
# కథా మంజరి

పది కథల సమాహారం



కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త

© Copyright 2020 - Editorial Board Kathamanjari

కథ



# సుస్వాగతం

# కథామంజరి శ్రావ్య సంచిక

ఈ సంచికలో 'గళ' సహకారం అందించిన కళాకారులు –

- శ్రీ పప్పు భోగారావు గారు
- శ్రీ వెంపటి కామేశ్వర రావు గారు
- శ్రీ భువనపల్లి రంగనాథం గారు
- శ్రీమతి కరవది సరస్వతి గారు
- శ్రీ బి ఎస్ మూర్తి గారు
- శ్రీ అవసరాల రాఘవరావు గారు

## ఈ నెల శ్రావ్య సంచిక కోసం

**ఇక్కడ నొక్కండి**

శ్రావ్య సంచికను SUBSCRIBE చేయడానికి ఇక్కడ నొక్కండి

# శ్రీ శుభకృత్ నామ ఉగాది సందర్భంగా

# శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ

కథామంజరి

వచ్చే ఉగాది సందర్భంగా ఓ వినూత్నమైన కథాంశం మీద కథల పోటీ నిర్వహిస్తున్నాం. కాదేదీ 'కథ'కు అనర్హం.. అన్నట్టు, ఏ అంశం మీదైనా సరే కథలను సృష్టించే సృజనాత్మకత రచయితలలో ఉంటుంది. అటువంటి సృజనాత్మకతతో, పాఠకుల్లో చైతన్యం కలిగించేలా, ఈ ప్రత్యేక అంశం మీదనే కథలను పాఠకులకు అందించాలనే ఉద్దేశంతో ఉగాది కథల పోటీని నిర్వహిస్తున్నాం.

## కథాంశం: సమకాలీన రాజకీయ, సామాజిక చైతన్యం


| | |
|---|---|
| మొదటి బహుమతి | ₹ 5116/- |
| ద్వితీయ బహుమతి | ₹ 3116/- |
| తృతీయ బహుమతి | ₹ 2116/- |
| 12 ప్రోత్సాహక బహుమతులు | ₹ 516/- |

**కథలు చేరడానికి ఆఖరు తేదీ**
**05.03.2022**

అతి ముఖ్య నిబంధన: కథాంశం సున్నితమైనది. సమకాలీన పరిస్థితుల నేపథ్యంలో.. వాస్తవిక పరిస్థితులు ప్రతిబింబించేలా మంచి, చెడు .. దేని గురించైనా రాయవచ్చు. ఐతే.. కథా విషయాన్ని చర్చించే ప్రయత్నంలో ఏ రాజకీయపార్టీల పేర్లని, వ్యక్తుల పేర్లని ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా ప్రస్తావించకూడదు. అంతర్లీనంగా కథ ఉండాలి. ఈ నిబంధన అతిక్రమణ జరిగినట్టుగా కథామంజరి భావిస్తే, ఆ కథలను పోటీలో పరిగణకు తీసుకోవడం జరగదు. ఇందులో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.

పోటీకి వచ్చిన కథలలో కొన్ని సాధారణ ప్రచురణ స్వీకరించి, పోటి ఫలితాలతో పాటు ప్రకటింపబడతాయి. అలా స్వీకరించిన కథలను ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తీసుకునే వెసులుబాటు లేదు. ఈ సూచనను రచయిత(త్రి)లు గమనించమని కోరుతున్నాం

మిగిలిన సాధారణ నిబంధనల కోసం ఇక్కడ నొక్కండి



**ఈ పోటీలో కథకులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాం.**

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | పేజీ |
|---|---|---|
| I | మా జట్టు | i |
| II | కృతజ్ఞతలు | ii |
| III | కథాకీయం | iii |
| IV | విశిష్ట అతిథి | v |
| V | కథా మార్గదర్శి | vii |

## కథలు

| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ |
|---|---|---|---|
| 1 | మెరుపు మరకలు | సి. హెచ్. వి. యస్. యస్. పుల్లంరాజు | 1 |
| 2 | ఏం చేశానని? | పి. రాజేంద్ర ప్రసాద్ | 7 |
| 3 | అర్ధరాత్రి అతిథి | చిత్రవెంకటేష్ | 11 |
| 4 | ఆదర్శం | పక్కి శివప్రసాద రావు | 18 |
| 5 | అమ్మ పేరు | మద్దూరి నరసింహమూర్తి | 23 |
| 6 | విచిత్ర బంధం | సి. ఎన్. చంద్రశేఖర్ | 27 |


కథామంజరి కథలు దిద్దిడంలో .. కథలు వ్రాయడాన్ని పక్కన పెట్టేస్తారేమోనే భయంతో 'ఓ కథ రాసిపెట్టరూ' అని అడిగిన వెంటనే కథలు దిద్దడం ఓసారి ఆపి కథలందించిన .. మా కథామంజరి బృందం కథలు ఈ నెల ప్రత్యేకం!!


| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ |
|---|---|---|---|
| 7 | వంచన | కొయిలాడ రామ్మోహనరావు | 36 |
| 8 | మంటలు | పోతుల కృపాకర్ | 45 |
| 9 | వందే! పార్వతీపరమేశ్వరౌ | ఎం ఏ పద్మనాభ రావు | 51 |
| 10 | విలువైనది కాలమే | జయంతి ప్రకాశ శర్మ | 57 |


మనుషుల్లో చాలా విషయాల వలన 'భయం' పుట్టుకొస్తుంది. ఈ సంచిక విశిష్ఠ అతిథి ఏభై ఏళ్ల కిందటే, చిత్రంగా ఓ విచిత్రమైన'భయాన్ని' ఆవిష్కరించారు. ఆ కథే ఈ సంచిక ప్రత్యేక కథగా పాఠకులకు అందిస్తున్నాం.


| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ |
|---|---|---|---|
| 11 | భయం | కొండముది హనుమంతరావు | 64 |



# మా జట్టు

## సాంకేతిక సహకారం

harbinger PUBLISHING

## బొమ్మలు

శ్రీ కొయిలాడ రామ్మోహన రావు

శ్రీ కొచ్చెర్ల వి ఆర్

శ్రీ సూరంపూడి చలపతిరావు

## సంపాదక సహకారం

శ్రీ ఎం ఎ పద్మనాభ రావు

శ్రీ కృపాకర్ పోతుల

# కృతజ్ఞతలు


# ఈ సంచిక దాత

పేరు ప్రకటనకి ఇష్టపడని ఓ

**కథాభిమాని**

ఫిబ్రవరి 2022 సంచికకి ఆర్థిక సహాయం చేసిన కథాభిమానే ..

ఈ సంచికకి కూడా సహాయం అందించారు.







# “కథా”కీయం

ఈ మాట ఎందుకొచ్చిందంటే… కాలమాన పరిస్థితులు మారినా, మిగతా సభ్య సమాజంలో ఎన్ని మార్పులు చోటు చేసుకున్నా, మారిన కాలామాన పరిస్థితుల ప్రభావంతో మానవ జీవితాల్లో పెనుమార్పులు సంభవించినా, తెలుగు కథకీ వందేళ్లు నిండినా, చాలా తెలుగు మాటలకు అర్ధాలు నిర్వచనాలు… వేరేగా పుట్టుకు వచ్చినా, సినిమా, టీవి ధారావాహికల గమనాలు వికృతచేష్టలకు నిలయమైనా సరే… నేటికి చెక్కు చెదరనిది.. తెలుగు కథ మాత్రమే అని ఖచ్చితంగా చెప్పాలి! ఎలాంటి ప్రభావాలు లేసమంత్రైనా కథ మీద పడలేదు. ఇప్పటికీ కథ సహజమైన మానవ జీవితాలనే అందిస్తోంది. సమాజ హితమే కథావస్తువుగా పాఠకులను అలరిస్తోంది. మనకెదురుగా కనబడే దృశ్యలే కథలుగా ఆకట్టుకుంటున్నాయి.

సరే.. అసలు ఈ 'కథాకేళీ' ఎందుకు ప్రస్తావనలోకి వచ్చిందంటే…

తెలుగు కథలు ముందులో పత్రికలకు పరిమితమై ఉండేవి. సినిమా పుట్టిన తర్వాత, కథలు తెరకి ఎక్కాయి. మంచి కథలు, నవలలని ఎంపిక చేసి సినీమాలు తీశారు. ఆయా రచయితలకు ‘సినీ రచయితలు’గా పేరు కూడా వచ్చింది. గౌరవం, కీర్తి కూడా వచ్చాయి. ఆ తర్వాత కాలంలో టివి వచ్చిన తర్వాత తెలుగు కథకీ మరింత మంచి రోజులు వచ్చేయని భావించాం.

అయితే ఈ మధ్య కాలంలో వస్తున్న సినిమాలు, టివి సీరియల్స్ చూస్తుంటే, వాటి గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంతా మంచిదనిపిస్తుంది. ఆ కథల మీద తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అవాస్తవిక సంఘటనలతో, అసామాన్యమైన హావభావలతో, ఊహకు కూడా అందని దృశ్యలు వాటిలో రాజ్యమేలుతున్నాయి. మన చుట్టూ ఉన్న సమాజంలో కనబడని, వికృతమైన పాత్రలను సృష్టించి, సంవత్సరాల పొడుగున సాగితీసి, అర్థం పర్ధం లేని గమనంలో కథ సాగిపోతోంది. ఏ కోణంలో చూసిన నాటికీయత, కథాపరంగా అవసరమయే కల్పన కొరవడుతున్నాయి. వాడుతున్న భాష గురించి చెప్పాలంటే.. తీవ్ర మనస్తాపమే మిగులుతుంది. 'ఇదేమిటి సార్?' అని అడిగితే.. 'ప్రేక్షకులు చూస్తున్నారు, మేం తీస్తున్నాం' అనే జవాబు టక్కున వస్తోంది. అలవాటైన ప్రాణులకు, గత్యంతరం లేక టీవిల ముందు కూలబడుతున్నారనే విషయం జగమెరిగిన సత్యమే! కానీ వినే నాధుడు లేడు .. సమాజ హితం కంటే, వ్యాపారమే ముఖ్యమైపోయింది. ఈ నేపథ్యంలో…. సమాజానికి మంచిని కాకుండా, చెడుని ధారవాహికంగా

అందిస్తున్న నిర్మాణాల వెనుక ఉండి, కథలందించే రచయితలకు సమాజం పట్ల బాధ్యత లేదా అనే ప్రశ్న ఎదురవుతోంది! అది వారి విచక్షణా జ్ఞానానికి వదిలేసినా, ఎప్పుడో అర్ధశతాబ్దం కిందట, రావిశాస్త్రి గారు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

'సార్! సినిమా వాళ్ళు రచయితలని గౌరవిస్తూ, బాగా చూసుకుంటారుట కదా, మరి మీరు సినిమాలకు ఎందుకు పనిచేయడం లేదని' ఓసారో ఓ అభిమాని ఆయన్ని అడిగారుట!

"అవునయ్యా! మన వూరు నుంచి చెన్నపట్నానికి విమానంలోనో, ఫస్టుక్లాసు రైలు లోనో తీసుకెళ్తారు. వాళ్లే టిక్కెట్లు కొంటారు. అక్కడ ఉన్నంత కాలం పెద్ద హోటెల్లో వాళ్ల ఖర్చుతోనే మకాం ఏర్పాట్లు చేస్తారు. ఇంకా కావలసిన సదుపాయాలన్నీ కూడా వాళ్లే ఏర్పాటు చేస్తారు!" అంటూ నవ్వుతూ అన్నారుట ఆయన.

"మరి... అంత బాగా చూస్తారుగా మీరెందుకు రాయడం లేదు సార్?" అంటూ ఆ అభిమాని వెంటబడ్డాడుట.

"ఏం చెప్పమంటావు!! మన టిక్కెట్టు మనల్ని కొనుక్కోనివ్వరు. మన హోటలు ఖర్చులను మనచేత పెట్టుకోనివ్వరు. మన డ్రింకుని మనని త్రాగనివ్వరు. మన ఖర్చులని మనని పెట్టుకొనివ్వరు. చివరికి మన డైలాగుల్ని కూడా మనలని రాయనివ్వరు!....." రావిశాస్త్రి గారు మాటలు పూర్తి కాకుండానే..

అర్ధం అయిందంటూ ఆ అభిమాని గట్టిగా చప్పట్లు కొట్టాడుట.

ఈ పరిస్థితి ఇప్పుడు ఇంకా దిగజారిపోయిందని చెప్పక తప్పదు.

అయితే ఈ పరిస్థితులు కథ రచనలలో కనబడటం లేదు. కథ సహజత్వంతోనే ఇప్పటికీ నిత్యం పురుడు పోసుకుంటోంది. మన చుట్టూ ఉన్న అంశాలే కథాంశాలుగా మనకి సాక్ష్యాత్కరిస్తున్నాయి. ఎలాంటి ప్రలోభాలకు, ప్రభావాలకు లోనవకుండా, తెలుగు కథ ముందుకు సాగుతున్నది. కాల, మాన పరిస్థితులు మారుతున్నా, ఆయా కాలాలలో సమాజంలో కనబడే మనుషులే కథల పాత్రల్లో కనబడుతున్నారు. ఆ సహజమైన వాతవరణమే కథల్లో కనబడుతోంది. వెరసి మన జీవితాలకి ప్రతిబింబాలుగా మన కథలే మనల్ని అలరిస్తున్నాయి!

అందుకే గర్వంగా చెప్పాలి.. తెలుగు కథ మారలేదు. మారదు!!

## సంపాదకుడు

***0***

# విశిష్ట అతిథి



# శ్రీ కొండముది హనుమంతరావు గారు

"రచయితకు సామాజిక స్పృహ, రచనకు సాంఘిక ప్రయోజనం అవసరం" అని నమ్మి అదే బాటలో నడిచిన రచయిత శ్రీ కొండముది హనుమంతరావుగారు.

ఈయన 1937వ సంవత్సరంలో కొండముది అన్నపూర్ణమ్మ, సుబ్బారావు దంపతులకు గుంటూరు జిల్లా అప్పికట్ల గ్రామంలో జన్మించారు. భౌతిక శాస్త్రంలో ఆంధ్రా యూనివర్సిటీ నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టాను పొంది, ఆకాశవాణి ఇంజనీరింగ్ శాఖలో ఉద్యోగ ప్రవేశం చేశారు. తరువాత అనేక సంవత్సరాలు అధ్యాపక వృత్తిలో భౌతిక శాస్త్ర ఉపన్యాసకుడుగా పనిచేశారు.

ఇక ప్రవృత్తి పరంగా హనుమంతరావు గారు విద్యార్థిగా ఉన్నప్పుడే రచన వ్యాసంగం ఆరంభమైంది. ఆంధ్ర యూనివర్సిటీలో ఎమ్. ఎస్సీ. చదువుతున్నప్పుడు.. మొదటి కథ "చదువు-సంధ్యా" రాశారు. ఆ కథ 'తెలుగు స్వతంత్ర' వారపత్రిక (04.03.1955) లో ప్రచురణమయింది. ఆ తర్వాత రాశి కంటే వాసికీ విలువిస్తూ.. ఆయన వందకు పైగా కథలు, రెండు సీరియల్లు రాశారు. అవి ఆనాటి.. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక వంటి అనేక దిన, వార, మాస పత్రికలలో ప్రచురితమయ్యాయి.

రేడియో కార్యక్రమాల మీద మంచి అవగాహన ఉన్న హనుమంతరావుగారు, దాదాపు ఎనిమిది సంవత్సరాలు ఆకాశవాణి సాంకేతిక విభాగంలో పనిచేయడం, ఆ వాతావరణంలో వృత్తి, ప్రవృత్తి చేతులు కలపడంతో, ఆ అంశాల మీద వారికి అమితమైన అవగాహన వచ్చింది. 'ప్రసార తరంగిణి' అనే వ్యాస సంకలనంలోని ఆయన వ్యాసం ఈ విషయాన్ని ధృవపరుస్తుంది.


మరో వైపు భౌతిక శాస్త్రం లో పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్టా పొందిన హనుమంతరావు గారు, తనకిష్టమైన ఖగోళశాస్త్రంలో విశేష కృషి చేశారు. విజయవాడలోని నక్షత్రదర్శనశాలలో వ్యాఖ్యాతగా పని చేశారు. అక్కడ కొన్ని సంవత్సరాల అనుభవం, సొంతంగా చేసిన విశేష కృషి కలబోసి నేసిన వ్రాత 'తారాపథం'. ఈ పుస్తకం విశేష ఆదరణ పొందింది. ఖగోళ శాస్త్రం మీద తెలుగులో రాసిన మొదటి పుస్తకం ఇది.

భౌతిక శాస్త్రంలోనూ, ఖగోళ శాస్త్రంలోనూ, రేడియో ప్రసారం లోనూ, వ్యాస కథా రచనలలోనూ చేయిదిరిగిన శ్రీ హనుమంతరావు గారికి "జనరంజక విజ్ఞాన శాస్త్రం" మీద ఎక్కువ మక్కువ. సైన్స్ ని ప్రజలకు అందుబాటులో, జనసామాన్యానికి అర్థమయ్యే విధంగా అందించడం ఈ "జనరంజక విజ్ఞాన శాస్త్రం" లక్ష్యం. అదే బాటలో ఆయన అనేక వందల వ్యాసాలు రాసి, కృతకృత్యులయ్యారు. వారు రాసిన 'భయం', 'దీపం', 'విచలిత', 'తొలి కోడి కూసింది', 'సత్యా సత్యాలు' లాంటి ఎన్నో కథలు పాఠకులకు ఆనందాన్ని పంచితే, 'తారాపథం', 'సంపూర్ణ సూర్యగ్రహణం', 'హేలీ తోకచుక్క', 'కాల గమనం ముందుగా లేక వెనుకకా?' లాంటి శాస్త్ర సంబంధ రచనలు జనసామాన్యానికి జ్ఞానాన్ని పంచాయి.

ఇలా బహుముఖ ప్రజ్ఞ చూపిన శ్రీ హనుమంతరావుగారు, ప్రస్తుతం హైదరాబాద్ లో విశ్రాంత జీవనం గడుపుతున్నారు. మేం కోరిన వెంటనే, వారు "కథామంజరి" కి విశిష్ట అతిథిగా రావడం ఎంతో ముదావహం. వారికి "కథామంజరి" శత సహస్ర వందనాలు.

***0***

# కథా మార్గదర్శి



## శ్రీ బలివాడ కాంతారావు గారు

"మంచి రచయితలను గొప్ప రచయితలుగా ముద్ర వేస్తే, సాధరణ రచయితలైపోయే ప్రమాదం ఉంది! డబ్బు, పేరుల మీద రచయితలు దృష్టి పెడితే, వారి రచనల నాణ్యత తగ్గిపోతుంది!  చాలమంది రచయితలు ఇప్పుడీ విషయాల పరిధిని దాటి మంచి రచనలు చేస్తున్నారు!" అని ఓ పాతిక, ముప్పై సంవత్సరాల క్రితం, అప్పటి కాలం రచయితల గురించి తన అభిప్రాయాన్ని చెప్పిన గొప్ప కథకులు కీ.శే. బలివాడ కాంతరావు. "ఓ కథో, నవలో రాయడానికి ముందు బాగా 'హోమ్ వర్క్' చెయ్యాలి. కూలంకషంగా విషయాన్వేణ చేసి రాయాలి. ఆ విషయంలో ఎంత టైమ్ పట్టినా సరే, రచన చేయడానికి ఇది తప్పనిసరి... అప్పుడే కథకి జీవాలు పుట్టుకొస్తాయి, అవి చరిత్రలో నిలిచిపోతాయి!" అన్న ఖచ్చితమైన సిద్ధాంతంతో ఆరు దశాబ్దాల పాటు తెలుగు సాహితీ ప్రపంచంలో తన సత్తా చాటి, చరిత్రలో నిలిచిపోయిన రచయిత బలివాడ కాంతరావుగారు.  సుప్రసిద్ధ బెంగాలీ రచయిత శరత్ చంద్రగారి ప్రభావం తన రచనలో ఉందంటూ, పాత్రలలో నిజాయితీతో పాటు సున్నితమైన ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలించి, వాటిని రచనలలో పెట్టడం సరియైన పద్దతని నమ్ముతారు కాంతారావుగారు. భాషాపరంగానూ, వస్తువురీత్యానూ ఉత్తరాంధ్ర జనజీవితం చిత్రించిన రచయితలలో అగ్రేసరులైన కాంతరావుగారి కథలలో నిజాయితీ, నిక్కచ్చి, జాలి, దయ, కరుణ.. ప్రస్ఫుటంగా కనబడతాయి. ఏదో ఒక సిద్దాంతానికి కట్టుబడి, దాన్నే బలపరుస్తూ రచనలు చేయకపోవడమే కాంతారావుగారి బలం అని ఆయన అభిమానులు అంటారు.  అలా రచనలు చేయడం వలననే.. అన్నపూర్ణ,

ఉద్యోగాలు, ఓట్ల సంబరం, తెగిన గాలిపటం, ముంగిస, దారి తప్పిన కథ, దేశభక్తి.. వంటి ఆయన కథలన్నీ అజరామరంగా నిలిచిపోయాయి. సుమారు నాలుగు వందల కథలు, ముప్పై ఎనిమిది నవలలు వ్రాసిన బలివాడ కాంతారావుగారు తన మొదటి కథ ఇరవయ్యో ఏటనే రాసారు. ఆ కథ 1947లో "ప్రజాబంధు" పత్రికలో ముద్రితమైంది. వీరు ఇరవై ఏటనే భారతనేవిలో గుమస్తాగా ఉద్యోగ ప్రస్థానం ఆరంభించి, అనతి కాలంలోనే సివిలియన్ ఆఫీసర్ గా ప్రమోషన్ పొంది, ఆ తర్వాత కాలంలో ఎక్కువగా ఢిల్లీలో పని చేసారు. 1957 కాలంలో 'వంశధార' నవల రాస్తున్నప్పుడు.. అందులో మూడు తరాల జీవితకాలాన్ని ప్రతింబింబచేయడానికి, ఆయన ఎప్పుడో ముప్పై ఏళ్ళ క్రిందట వదిలేసిన తన సొంతూరు 'మడపాం' (శ్రీకాకుళం జిల్లా) కి వెళ్ళి, అక్కడ అందర్ని కలసి, మాట్లాడి, విషయ సేకరణ చేసారు. తత్ఫలితంగా నవలలోని యాదార్ధమైన పాత్రలకు జీవం పోసి, భాషావాదాల్నీ, భేదాల్నీ చక్కగా పొందుపరచగలిగారు. అలాగే ఆ నవల అనేకమైన కోణాల్ని స్పృశించింది. ఆ నవలలో రాజకీయ, మతపరమైన సిద్ధాంతాలు, సామాజిక పద్ధతులు, జీవనరీతులు మొదలైన విషయాలను లోతుగా చర్చించారు. ఆ నవల రాయడానికి తొమ్మిది సంవత్సరాలు పట్టింది. అలాగే ఆయనోసారి మేనమామ ఇంటికి వెళ్తే.. అక్కడ ఓ ముంగిసను చూసారుట. ''దాని మీద కథ రాయవూ' అని మేనత్త అడగ్గానే, వెంటనే “ముంగిస” కథ రాసి, వినిపించారుట! ఆయన రాసిన కథలలో వాస్తవికత కొట్టొచ్చినట్లు కనబడతాయనడానికి వెనుకనున్న కృషి, సిద్ధాంతాలు ఇవే కారణం! నాటి తరం సుప్రసిద్ధ కథకులు శ్రీపాద సుబ్రహ్మణ్యం, కొడవటిగంటి కుటుంబరావు, ముళ్లపూడి వెంకటరమణ..మొదలగు వారితో సాంగత్యము ఉండేది. మనదేశంలో సుమారుగా అన్ని ప్రాంతాలు తిరిగి, అక్కడ కలిగిన అనుభవాలు, మనుషులు, మనస్తత్వాలతో రచనలు చేసారు. 1972 సంవత్సరం రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు వీరి నవల "పుణ్యభూమి" కి వచ్చింది.

"ఎక్కడ మంచి జరిగినా ఆనందిస్తాను, చెడు జరిగితే బాధ పడతాను!" అంటూ తన వ్యక్తిత్వాన్ని గురించి ఆయన చెప్పేవారు.. బహుశా ఆయన రచనలలో ఈ లక్షణం చొచ్చుకుపోయి, గొప్ప రచనలుగా తరతరాలు నిలిచిపోడానికి దోహదపడ్డాయని చెప్పవచ్చును.

మరో వందేళ్లు తర్వాత కూడా ఈయన మా తెలుగు కథారచయిత అని గర్వంగా చెప్పుకోగలిగే రచయితల సరసన ఉన్న బలివాడ కాంతరావు గారు రెండు వేలో సంవత్సరం మే నెల ఆరో తారిఖున స్వర్గస్తులైనారు. వారి కుటుంబ సభ్యులు ప్రతీ ఏటా వారి పేరిట సాహితీ పురస్కారాలు అందచేస్తుండటం మరో గొప్ప విషయమని చెప్పాలి.

అలా ఆయన, ఆయన రచనలు ఎప్పటికీ చిరంజీవులే!

**కథమంజరి బృందం**

# మెరుపు మరకలు



## సి. హెచ్. వి. యస్. యస్. పుల్లంరాజు

ఆ ఇంటి చుట్టూ పెరిగిన చెట్ల మీదకి, కాకులు చేరాయి. కాకిగోల చాలా విసుగు తెప్పిస్తోంది.

"వాడు తిరిగి రాని లోకానికి వెళ్లి పోయాడు కదా అని, వాడి కుటుంబానికి అన్యాయం చేయకురా జనార్ధనా! పై నుండి ఆ జగన్నాథుడు అన్నీ ఓకంట గమనిస్తూనే వుంటాడు నాయనా!" సున్నితమైన హెచ్చరిక చేస్తూ బయటకు నడిచాడు మేనమామ వరుస బంధువు.

మరొక బంధువు.. " ఈ శరీరం శాశ్వతమా? ఆ గీతాచార్యుడు చెప్పినట్లు జాతస్య హి ధ్రువో మృత్యుః... వెనుక ముందు తేడా అంతే! బ్రతికి వున్నందుకు బాధ్యత నెత్తిన ఎత్తుకోక తప్పదురా, ధైర్యంగా సాగాలి..."అంటూ స్మశాన వైరాగ్యం చాటుతూ గుమ్మం అవతల కాలు పెట్టాడు.

వారి మాటలు వింటున్న జనార్ధన్, కనులు మూసుకుని గోడకి జారబడి, నేల మీద కూర్చున్నాడు. అనంత శోకసాగరాన్ని తన హృదయంలోనే కట్టడి చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నా, కన్నీటి కెరటాలు అప్పుడప్పుడు అతని నేత్రాల్లోంచి ఎగసి పడుతూనే వున్నాయి. వాస్తవానికి ఎవరి మాటల సారాన్ని గ్రహించే స్థితిలో ఆతడు లేడు. ఎవరేమి ఉపదేశం చేస్తున్నా తలాడిస్తూ, అప్పుడప్పుడు భుజం మీది తుండుగుడ్డతో కళ్లు తుడుచుకొంటున్నాడు.

ఎదురుగావున్న గోడకానుకుని అతని స్నేహితుడు సత్తిబాబు జరుగుతున్న తతంగాన్ని సాక్షిగా చూస్తున్నాడు.

అంతలో.. పెద్దమ్మ వరుసయ్యే, అరవై పడిలో పడిన పెద్దావిడ ఆయాసపడుతూ వచ్చి,"ఈ ముసలి ముండ బతికే వుందని మర్చిపోకురా జగ్గూ! కాకితో కబురు చేస్తే చాలు, ఇలా వాలి, అలా ఏదో ఒకటి ఉడకేసి పోతాను. అంతకంటే నీకు ఏమి చేయగలను చెప్పు?" అంటూ రిక్షా ఎక్కింది. కొడుకు, కోడలు ఆవిడ్ని పట్టించుకోరు, సరిగ్గా తిండి కూడా పెట్టరు. తిండి దొరికే మార్గం వెతుకుతూ, కబురు చేస్తాడనే ఆశతో ఇంటికెళ్ళింది ఆవిడ. సాధారణంగా అలాంటి సందర్భంలో "వెళ్లి వస్తానని, మళ్ళీ కలుద్దాం" వంటి మాటలు చెప్పరు. అందుకే కొందరు మౌనంగా తిరుగు ప్రయాణమయ్యారు. కొంచె సేపటికి పెద్ద గొంతుతో.. "పచ్చని కాపురంలో చింత నిప్పులు కురిసాయి. పచ్చికాయ పగిలి పోయింది. చెట్టంత అన్నయ్య చెప్పా చేయకుండా హఠాన్మరణం చెందాడు. చిన్న వాడివి, కాని కష్టం వచ్చిపడింది...."అంటూ మరొకాయన జరిగిన ఘోరమైన సంఘటనని మరోసారి గుర్తుచేస్తూ, బయటకు నడిచాడు.

సత్తిబాబు, అందరి మాటలు, చేష్టలు గమనిస్తూ అక్కడే వున్నాడు.

గోడ గడియారం నిష్కామయోగిలా తన పని తాను చేసుకుంటోంది. కార్యక్రమాలు, భోజనాలు పూర్తి కావడంతో వచ్చిన బంధువులు ఒకొక్కరే వెళ్లిపోయారు. ఇల్లంతా నిశ్శబ్దం తాండవిస్తోంది. 'టిక్.. టిక్' మనే గోడగడియారం ధ్వనిలోనూ, నిరాశా నిస్పృహలే ధ్వనిస్తున్నాయి.

ఇంతలో హడావుడిగా జనార్దన్ కి పెద్ద తండ్రి వరుసయ్యే సుబ్బన్న అవధాన్లు ప్రత్యక్షమయ్యాడు. జనార్దన్ కేసి చూశాడు. ఏదో పని వున్నట్లుగా పరుగు పరుగున పెరట్లోకి వెళ్ళాడు. గదులన్ని కలయచూసి, వచ్చిన వాళ్ళందరూ వెళ్లిపోయారని నిర్ధారించుకొని, జనార్దన్ ఎదురుగా కుర్చీ లాక్కొని కూర్చొని, గొంతు సవరించుకుంటూ, "ఒరే జనార్దనా! నీ పరిస్థితి నాకు బాగా తెలుసురా. అందుకే చెబుతున్నా, దుఃఖం దిగమింగుకోవాలిరా, జరగవలసిన ముఖ్యమైన పనులన్ని ముందున్నాయిరా." అని క్షణం ఆగి, ఒక విషపు నవ్వు నవ్వి, జనార్దన్ ముఖంలోకి చూశాడు.. ప్రతిస్పందన కోసం! కానీ, ఆతనికి ఏ మాటలు బుర్ర కెక్కడంలేదు. కారణం, తోడబుట్టిన అన్న లేకుండా ఎలా బ్రతకగలనా అనే సమాధానం లేని ప్రశ్న, రాత్రి పగలు అతన్ని వెంటాడుతూ వేధిస్తోంది. అందుకే సుబ్బన్నకేసి పిచ్చి చూపులు చూసాడు. కానీ తన మాటలు పనిచేస్తున్నాయన్న ఉత్సాహంతో, చుట్టూ పరికిస్తూ, రహస్యం చెబుతున్నట్లు, గొంతు తగ్గించి సుబ్బన్న అవధాన్లు మళ్ళీ ప్రారంభించాడు. "నాకు కొడుకులాంటి వాడివి కాబట్టి చెబుతున్నా, మీ అన్నయ్య దస్తావేజులు ఎక్కడ దాచిపెట్టాడో వెతుకు. ఈరోజు కాకపోయినా రేపయినా నీకు ఆ పని తప్పదనుకో! అర్ధరాత్రి పిలిచినా పరిగెత్తుకుంటూ వచ్చి వాలిపోతాను. నీమీది వెఱ్ఱి అభిమానం అలాటిది.. వెధవది ఈ కోర్టులు, చట్టాలు, లిటిగేషన్లూ ఉన్నాయి చూడు.., ఇన్నేళ్ల నుండి ప్లీడరు గుమాస్తాగిరి వెలగపెడుతున్న నాకే, ఒక పట్టాన అర్ధమయ్యి ఛావవు. కుర్రకుంకవి, నీకవన్నీ ఏమి తెలుస్తాయి! కనుక, పెద్ద ముండావాడ్ని నేనున్నానుగా, నన్ను నమ్ము. ఆ దస్తావేజులు నా మొహం మీద పడేయ్. నేను చూసుకుంటాను. ప్రాణం పోయినా నీకు అన్యాయం జరగనివ్వనుగా.." అని భరోసా ఇచ్చి, అక్కడే

నిలబడిన సత్తిబాబు కేసి చూసి, ఒక వెకిలి నవ్వు నవ్వి, ఇంటికి కొంచెం దూరంగా బయట వేచి చూస్తున్న రిక్షాలోకి దూరాడతడు.
జనార్ధన్ తలనొప్పి, ఒళ్ళు నొప్పులతో బాధ పడుతున్నాడు. ఎదురుగా నిలబడ్డ సత్తిబాబుకి అతన్ని వదలి వెళ్ళడానికి మనసు రావడం లేదు. కానీ తప్పదు. అతనూ వెళ్ళితీరాలి. రాత్రి ఎనిమిది గంటలవుతోంది. అందుకే జనార్ధన్ కి మందులు వేసి, గదిలో మంచంపై పడుక్కోబెట్టి ఇంటికి చేరుకున్నాడు బరువెక్కిన మనసుతో.

***

మంత్రిప్రగడ వారి అగ్రహారాన్ని దావానలంలా ఆ వార్త దహించి వేసింది. ఆ సంఘటన కొందరి మనసుల్ని మెలిపెట్టి పిండేసింది, కొందరి గుండెల్లో గునపాలు దించింది. "ఏమిటీ దారుణం!" అని కొందరు దీర్ఘాలోచనలోపడి, జారుతున్న విషాదాశ్రువులని తుడుచుకున్నారు. సనాతన సంప్రదాయాలు మంటగలసిపోతున్నాయని వాపోయారు. కొంతమంది జరిగిన సంఘటనని ఎలా వ్యాఖ్యానించాలో తెలియక అయోమయంలో పడ్డారు. పెద్ద వయస్సు స్త్రీలు కొందరు "అయ్యో! ఐనా దానికదేమి పాడు రోగమో! కాలమహత్యం అమ్మా!" అంటూ విస్మయంతో ముక్కు మీద వేలేసుకున్నారు. బుగ్గలు నొక్కుకున్నారు.
మరికొంతమంది, "ఇలాంటి దౌర్భాగ్యపు పనులు చేసిన వాళ్లని క్షమించకూడదు. వాళ్ళ గడప పొరపాటున కూడా తొక్కకూడదు!" అంటూ శపథాలు చేశారు.
గాలి తిరుగుడు తిరిగే పరమశివం, తన అమోఘ పరిశీలనాశక్తిని ఉటంకిస్తూ, "జానాగాడు గుండెలు తీసే బంటురా.. వాడి వంకర చూపులు చాలాసార్లు గమనించా, ఖచ్చితంగా వాడు ఇలా చేస్తాడని నాకు ముందే తెలుసురా!" అంటూ కాలజ్ఞానం ప్రవచించాడు.
కానీ, అలాంటి వాళ్లకి చెప్పుదెబ్బ కొట్టారు ఆ అగ్రహారం యువకులు. నూతన ఆలోచనలకి స్వాగతం పలికారు. కొంతమంది.. జనార్ధన్ చేసిన తప్పేంటంటూ సన్నాయి నొక్కుల సంప్రదాయ వాదుల్ని ప్రశ్నించారు.

***

సాయంత్రం నాలుగు గంటలకు రామాలయం వీధిలో వున్న 'శుభమస్తు టెంట్ హౌస్' కి చాలా మంది చేరుకునేవారు. సైకిళ్లు గుడికి ఎదురుగా వున్న ఖాళీ స్థలంలో పెట్టి, సిరాజుద్దీన్ పాక హోటల్లో టీ త్రాగి, కబుర్లకోసం జనార్ధన్ అన్నయ్య గోవర్ధన్ దగ్గరకి చేరేవారు. తండ్రి చనిపోయిన తరువాత టెంట్ హౌస్ వ్యాపార విషయాలు గోవర్ధన్ చూసుకునేవాడు. సత్తిబాబు ఆ షాపులో గుమాస్తా.
ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేసే జనార్ధన్ సాయంత్రం ఐదు గంటలకు అక్కడికి వచ్చి అన్నకు సహాయం చేసేవాడు. జనార్ధన్ వస్తే గోవర్ధన్ షాప్ లోంచి బయటకు వచ్చి, సత్తిబాబు తెచ్చే వేడి వేడి మిర్చి బజ్జీలు తింటూ, చుట్టూ చేరిన స్నేహితులతో సరదాగా గడిపేవాడు. నిజానికి గోవర్ధన్ కి అందరూ

స్నేహితులే. చిన్నా పెద్దా అనే తారతమ్యం వుండేది కాదు. అతని మాటల్లో ఆప్యాయత, అనురాగం అందర్నీ కట్టిపడేసేవి. అతని పనుల్లో నిజాయితీ, నిబద్ధత అందర్నీ ఆశ్చర్యచకితులను చేసేవి. పండుగలు, పబ్బాలు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహించాలంటే గోవర్ధన్ నాయకత్వం వహించవలసిందే. జనార్ధన్ కి అన్నంటే ప్రాణం. ఇద్దరిదీ ఒక్కటే మాట.

***

ఆరోజు కూడా ఎప్పటిలాగానే ముందు జనార్ధన్ భోజనం చేసి హాల్లో టీవీ చూస్తున్నాడు. ఆ హాల్లోనే వున్న డైనింగ్ టేబుల్ మీద కూర్చొని గోవర్ధన్, అతని భార్య ఇందుముఖి కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు. ఆ తర్వాత అందరూ కబుర్లు చెప్పుకొని ఎవరి గదుల్లోకి వారు వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో, గది తలుపులు తడుతూ, "జనా... జనా.. మీ అన్నయ్యకి ఆయాసంగా వుంది" ఏడుస్తూ చెబుతున్న ఇందుముఖి మాటలకి జనార్ధన్ ఒక్కవుదుటున లేచి, పరుగున అన్నయ్య దగ్గరకు వెళ్ళాడు. "కంగారు పడకు ఇందూ! ఆసుపత్రికి తీసుకువెళదాం!" అని ఆమెకు ధైర్యం చెప్పి, ఆలస్యం చేయకుండా ఆటోలో అన్నయ్యని ఆసుపత్రికి తరలించాడు.

రెండ్రోజుల్లో గోవర్ధన్ బాగానే కోలుకున్నాడు. ఆసుపత్రి నుండి సంతోషంగా ముగ్గురు ఆటోలో ఇంటికి తిరిగి వస్తున్నారు. గోవర్ధన్.. ఇంటి ముందు ఆగిన ఆటోలోంచి దిగి, ఇంటికేసి చూస్తూ, ఒక చేయి భార్య మీద, మరో చేయి తమ్ముడు మీద వేసి, అడుగు వేయబోయి, అక్కడే రోడ్డు మీద కుప్పకూలిపోయాడు. గోవర్ధన్ ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

వచ్చే పోయే జనాలతో, నిత్య కార్యాలతో ఆ పన్నెండు రోజులు ఎలా గడిచాయో తెలియలేదు జనార్ధన్ కి. జనార్ధన్ ని కంటికి రెప్పలా చూసుకుంటూ, ఆ ఇంటి వ్యవహారాలు నడిపాడు సత్తిబాబు.

***

తెల్లారింది. హాల్లో గడియారం ఏడు గంటలు సూచిస్తోంది. జనార్ధన్ కి గతమంతా సినిమాలా వుంది. నిజం నిష్ఠూరంగా, చేదుగానే వుండచ్చు. కానీ అంగీకరించి జీవితం కొనసాగించవలసినదే, తప్పదనుకున్నాడు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది ఆ ఇంట్లో తనతో బాటు, తన కంటే ఎక్కువగా తల్లడిల్లిపోతున్న మరో జీవి కూడా వుందని. మళ్లీ దుఃఖం ముంచుకొచ్చింది. అలాగే నడుచుకుంటూ అన్నయ్య గది దగ్గరకు వెళ్లి తలుపు కొట్టాడు.

తలుపులు ఓరువాకిలిగా తీసేవున్నాయి. జీవచ్ఛవంలా వున్న ఇందుముఖి ఏడుపు వినిపిస్తోంది. ఆ దృశ్యం వాళ్ల దురదృష్టానికి పరాకాష్ట. ఆ సన్నివేశంలో ఎవరు ఎవరిని ఓదార్చాలి? ఎలా ఓదార్చాలి? అన్నీ ప్రశ్నలే. సమాధానాలు లేని ప్రశ్నలే!

పదేపదే గతం గుర్తుకు చేసుకుంటే అన్నయ్య తిరిగి రాడు. ధైర్యంగా ముందుకు నడవాలి. చేయి పట్టుకుని ఎవరూ నడిపించరనుకుంటూ, పెరటిలో బావి దగ్గరకు వెళ్లి, చేదతో నీళ్లు తోడుకొని తల స్నానం చేశాడు. మనసులోని ఉద్వేగం కొంత శాంతించింది.

సత్తిబాబు కాఫీ ఫ్లాస్కుతో వచ్చాడు. "సత్తిబాబు నువ్వు చేసిన సహాయం జీవితంలో మర్చిపోలేనురా!" మనసులోని కృతజ్ఞతా భావంతో, జనార్ధన్ కి ఆపై మాటలు రాక, చేతులు ఎత్తి దండం పెట్టాడు. సత్తిబాబు అతని మాటలకి, చలించిపోయాడు. ఆప్యాయంగా ఒకరినొకరు కౌగలించుకున్నారు. సత్తిబాబు ఒక కప్పులో కాఫీ పోసి ఇందుముఖి గది గడపకి అవతల పెట్టి, "అమ్మా! కొంచెం కాఫీ తాగండి.. తాగండమ్మా.. దయచేసి తాగండమ్మా" అన్నాడు. ఇందుముఖికి ఆ మాటలు వినబడ్డాయి. ఆ మాటల్లో దాగిన ఆతని వేడికోలుని మన్నించక తప్పలేదామెకు.

సత్తిబాబు వేళకు కాఫీ, టిఫిన్, భోజనాలు ప్రతి రోజూ తెచ్చి పెడుతున్నాడు. క్రమం తప్పకుండా సత్తిబాబు సేవలు అందించడం, జనార్ధన్ కు మొహమాటంగా, సిగ్గుగా తోచింది. అందుకే ఒక రోజు రాత్రి,"సత్తిబాబు! రేపు మంచి రోజు. అందుకే రేపు వంటింట్లోకి ప్రవేశించి, ఈ భీముడు విశ్వరూపం ప్రదర్శిస్తాడు. కాదనకు..." అన్నాడు. సత్తిబాబు నవ్వాడు. జనార్ధన్ కూడా అతనితో శృతి కలిపి, "షాపు తాళాలు ఇవిగో! రేపట్నుంచి షాపు బాధ్యత నీదే. కంగారు పడకు. నీ వెనుక నేను వుంటాను. సరేనా! మరో చిన్న పని చేయాలి. మన ఇంట్లో జరిగిన పనులన్నింటికి డబ్బులు ఎంత ఖర్చయ్యిందని అడిగితే అది నీకు కాదు అవమానం, నాకు.. అన్నయ్యకి!" అని, సంతకం చేసిన బ్యాంక్ చెక్ సత్తిబాబు చేతిలో బలవంతంగా పెట్టాడు.

***

జనార్ధన్ గొప్ప గురువే ఐనా, జీవితంలో ఎదురవుతున్న కఠిన ప్రశ్నలకి సమాధానాలు చెప్పడం కష్టంగానే వుందతనికి.

ఇందుముఖి ముభావంగా గదిలో ఒంటరిగానే గడపటం అతను జీర్ణించుకోలేక పోతున్నాడు.

ఆమె జీవితానికి పరిష్కారం కోసం ఆలోచిస్తూనే వున్నాడు. ఆమెకేసి చూడాలన్న, మాట్లాడాలన్నా ధైర్యం సరిపోవడం లేదు. ఆమె దైన్యాన్ని తల్చుకుంటే గుండె చెరువవుతోంది. అప్పుడప్పుడు స్నేహితులే వచ్చి పలకరించారు తప్ప, బంధువులందరూ మొహం చాటేశారు.

ఒక రోజు ఇందుముఖి ఉదయమే లేచి, కాఫీ పెట్టి, జనార్ధన్ పిలిచింది. ఆమెలో వచ్చిన మార్పుకి ఆశ్చర్యం ఆనందం ఒకేసారి చుట్టుముట్టాయి అతన్ని! ఎంతో ఆతృతగా వంటింటి వైపు కదులుతుంటే, ఆమే కాఫీ తెచ్చి, డైనింగ్ టేబిల్ మీద పెట్టి వెళ్ళింది. ఎన్నో సంవత్సరాల తర్వాత ఆమెను చూసినట్టుంది. కళకళలాడే ముఖంలో, నిర్వికారం. గలగలా పారే సెలయేరులా మాట్లాడే, నోటి మీద మౌనం. ఆనాడు అన్నయ్యతో ఆసుపత్రిలో చూసిన ఇందుముఖి ఈమేనా! ఎంత చిత్రం జీవితం! క్షణం చాలు జీవిత ముఖచిత్రం చిరిగి పోవడానికి, మారి పోవడానికి.

అతని తాత్త్విక చింతనని భంగపరుస్తూ, "కూరలు తెస్తే వంట చేస్తా"నంది.

ఆ మాటలకి పొంగిపోయాడు. ఆ రోజు రాత్రి భోజనాలు చేశాక, "ఇందూ! నీతో కొన్ని రోజులుగా కొన్ని విషయాలు చర్చించాలని...." అన్నాడు సాలోచనగా.

ఆతని మాట పూర్తి కాకుండానే, "సరే, ఏం చెప్పాలనుకుంటున్నావ్, చెప్పు" అంది ఆమె.

అది జనార్దన్ ఊహించలేదు. ఒక నిమిషం తటపటాయించి.. "ఇందూ! నీకు తెలుసు, ఇల్లు, పొలం, షాపు మనకున్నాయి! అన్నయ్యని తీసుకురాలేను కానీ, ఇవన్నీ నీ పేర వ్రాయిస్తాను. ఆడవారైనా, మగవాడయినా, ఎవరి జీవితం వారిది. కాబట్టి ఎవరి అభిమతం మేరకు వాళ్లు జీవించవచ్చు." అతను ఆగాడు ఆమె స్పందన కోసం.

కొంతసేపటికి, ఆమె దీర్ఘంగా నిట్టూరుస్తూ అంది."అమ్మానాన్నలు లేని నేను, ఆస్తిపాస్తులు ప్రోగుచేసుకొని ఏం సాధించాలి? వాటి కంటే నా దృష్టిలో విలువైనది జీవితం. ఆడదానికి భద్రత ముఖ్యం. ఇది ఆస్తిపాస్తుల సమస్య కాదు. ఎలా జీవించాలన్నది!!"

జనార్దన్ ఆలోచనలో పడ్డాడు. ఆమెకు డబ్బు వుంటే, బ్రతకడం కష్టం కాదనుకున్నాడు. అంతకంటే ముఖ్యమైనది జీవితం. ఎలా జీవించాలని అడుగుతోంది ఆమె. ఈ కోణంలో ఆలోచన చేయలేదు. ఆమెకు ఏమని చెప్పాలి? ఆలోచనలతో సతమతమవుతున్నాడు. ఆ విషయం అతన్ని చూస్తే అర్థమవుతుంది. అందుకే ఆమె ఒక్క నిమిషం ఆగి, "జనా! సమస్య ఏమిటంటే నన్ను ఇలా ఈ ఇంట్లో నువ్వు చూడలేక పోతున్నావు. ఈ ఇల్లు వదిలి నేను వెళ్లలేను. ఇది మన ఇద్దరి సమస్య. మనమే పరిష్కరించుకోవాలి. ఆలోచించి నువ్వే చెప్పు!" మెల్లగా ఆమె గదిలోకి వెళ్లిపోయింది. సూటిగా, సౌమ్యంగా, చిక్కుముడిని విప్పింది ఆమె. ఇందుముఖి తెలివితేటలకు అబ్బుర పడ్డాడు జనార్దన్. మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

***

అన్నవరం సత్యనారాయణ స్వామి సమక్షంలో జనార్దన్ ఇందుముఖి దంపతులయ్యారు. నాలుగు రోజులు మానసిక విశ్రాంతి కోసం విశాఖపట్నం, అరకులోయ తిరిగి, ఇంటికి వచ్చారు. జ్ఞాపకాల మబ్బులు, జీవిత ఆకాశంలో చెదరిపోతున్నాయి. ఆరోజు రాత్రి, బయట వాన తుంపర మొదలయ్యింది. అలవాటుగా తన గదిలోకి నిద్రపోవడానికి వెళ్లబోయాడు. చిత్రం! అతని గదికి తాళం వేసి వుంది. ఇందుముఖి గదిలోకి తలుపు తోసుకుని వెళ్ళాడు. అమె గదిలోకి వెళ్ళడం, అతనికదే మొదటిసారి. సువాసనలు అతన్ని పలకరించాయి. పూలసజ్జ పానుపు స్వాగతం పలికింది. తెల్లనిచీరలో, అందాల విందుకు అరవిచ్చిన అరవింద నయనాల ఇందుముఖి ఎదురు చూస్తోంది. తొలకరి జల్లు పలకరింపుకి, పులకించి, తరించి, తడిసి ముద్దవుతోంది నేలతల్లి.

***0***

# ఏం చేశానని?



## పి. రాజేంద్ర ప్రసాద్

ఈ కథ ఇప్పటికి సరిగ్గా వంద సంవత్సరాల పాతది! మనిషి క్రూరత్వం మాత్రం అంతకన్నా పాతది. క్రూర జంతువులదో, సాధు జంతువులదో ఆకలీ పాతదే.

అప్పటి రోజుల్లో ఒక రోజున... చీకటి చిక్కగా పరుచుకున్న రాత్రి సమయం. అది కాకులు దూరని కారడవీ, చీమలు దూరని చిట్టడవీనూ. వెన్నెల వెలుతురు పంచాలనే చంద్రుడు చేసే ప్రయత్నాలనన్నిటినీ గుబురుగా ఎత్తుగా పెరిగిన చెట్లూ, వాటినల్లుకుని దట్టంగా, బలంగా పెరిగిన తీగలూ భగ్నం చేసేస్తున్నాయి. పగలే సూర్యుణ్ణి అడ్డగించే చెట్లూ తీగలూ రాత్రిళ్ళు అంతంత మాత్రమయిన చంద్ర కాంతిని అసలుకే రానివ్వడం లేదు. మనిషన్నవాడెవడూ బయటకు రాలేనంత చలిగా ఉంది. చెట్ల మధ్య నుండి విసురుగా వీస్తున్న ఈదురు గాలి చలికి తోడై వణికిస్తోంది.

ఆ ఊరికి ఉత్తరానా, దక్షిణానా పొలాలున్నాయి. తూరుపు వైపు రోడ్డు పట్టణానికి పదిహేను మైళ్ళ దూరంలో ఉంది. పడమర వైపూ ఊళ్లే ఉన్నాయి. ఉత్తరాన పొలాలావతల అడివుంది. అది ఈనాటి కాలం కాదు కాబట్టి అడవి అడవిలాగే ఉంది. అప్పటికి స్వాతంత్రం ఇంకా రాలేదు. అడవీ, అందులోని పులులూ, సింహాలూ, లేళ్ళూ, ఎలుగుబంట్లూ అన్నీ స్వతంత్రంగా హాయిగా ఉన్నాయి.

అడవంతా నిశ్శబ్దంగా ఉంది. అప్పుడప్పుడూ గాలికి కదిలే ఎండుటాకుల శబ్దమూ, సరీసృపాలు ఉన్నట్టుండి వేగంగా ఎర వైపు కదిలే శబ్దాలూ తప్ప! మంచె మీద కూర్చున్న రావుగారు అప్రమత్తంగా

ఉన్నారు. చీమ చిటుక్కుమన్నా ఉలిక్కిపడుతున్నారు. ఒళ్ళంతా కళ్ళు చేసుకుని మరీ చూస్తున్నారు. ఒకటే లక్ష్యం. పులి.. పొలాల్లో చొరబడి మేకల్నీ గొర్రెల్నీ తినేస్తున్న పులి!
"ఈ రోజు నేనో అదో తేలిపోవాలి!" అంటూ ఆయన అనుకోవడం ఇది వందో సారి. ఒంటరిగా చలిని తట్టుకొనే ప్రత్యేకమైన వేట దుస్తులతో వచ్చారు. ఆయన అంతకు ముందు చేసిన మిలిటరీ సర్వీసు నలభై ఐదేళ్ల వయసులో ఆయనకు సాహసాన్నిచ్చింది. ఎంతసేపైనా శత్రువు గురించి ఎదురు చూడగలగటం, గురి తప్పకుండా లక్ష్యాన్ని ఛేదించడం, ఎదుటి లక్ష్యంగా శత్రువు ప్రాణానికి అతి తక్కువ విలువనివ్వడం.. మిలిటరీ ఆయనకి నేర్పిన విద్య!
ఈ రోజు ఇలా ఇక్కడ అడవిలో మంచె మీద ఉండటం దాదాపు పది రోజులు అడవినంతా క్షుణ్ణంగా పరిశీలించి చేసిన కృషి, ఆలోచనానూ. మొదటిసారి ఆ ఊరి వాళ్ళు వచ్చి తమ గోడు చెప్పుకోగానే, ఆయనకి చాలా జాలి కలిగింది. దాని మీద ఆవేశమూ, ఆ వెనుక ఆలోచనా వచ్చాయి. ఆ ఊరికెళ్లి నాలుగు రోజులు క్యాంపు వేశారు. పులి రోజూ రావటం లేదు. ఊళ్లోకీ రావటం లేదు. ఎప్పుడో ఓ సారి ఊరి చివర ఉన్న పొలాల్లోకీ, ఇళ్ళల్లోకీ వచ్చి అదాటున అక్కడ ఉన్న మేకనో, గొర్రెనో ఈడ్చుకొని వెళ్లిపోతోంది. అడుగుల గుర్తులను బట్టి పులి జాడలు అనుకోవడమే గాని, పులిని చూసిన వాళ్ళెవరూ లేరు. పులి గాండ్రింపూ ఎవరూ వినలేదు. ఈ కథనాలన్నీ విన్న రావుగారికి అది ఆడపులేననీ అయితే దెబ్బ తిని ఉండాలి, లేదంటే కడుపుతో ఉండుండాలి అనే నిర్ణయానికొచ్చారు. ఆడుగుజాడలు జాగ్రత్తగా చూస్తూ ఎక్కడికి వెళుతోందని వెతికితే, కొంతదూరం దాకా బాగానే కనిపించాయి. ఆ పైనంతా గట్టి నేల కాబట్టి కొద్దిగా గడ్డి నలిగిన గుర్తులు తప్ప పాద ముద్రలు లేవు. వాటిని అనుసరిస్తూ కొంచెం దూరమే వెళ్లిన రావుగారు ఎక్కువ సాహసం చేసి పులికి దగ్గరగా వెళ్ళకూడదనీ, అడవికి అవతల గుట్టల్లో ఏదో ఒక దాంట్లో అది ఉండి ఉండాలని నిర్ణయించుకున్నారు. అది ఎక్కడ ఉన్నా నీళ్ళకి అడవిలో ఉన్న ఒకే ఒక చెలమ దగ్గరకి రావాలి. లేదంటే వేట గురించి ఊళ్ళోకి రావాలి. పులి రోజూ వెళ్లే దారిలో ఊరికీ చెలమకీ విడిపోయే చోటు నిర్ధారించుకున్నారు. మంచె నుంచి కొంచెం దూరంలో చెట్టుకు కట్టేసి ఉన్న మేక, తనకై వేసిన మేత తింటూనే మధ్య మధ్యలో 'మే' అంటూ అరుస్తుంది.
రావుగారు వేచి చూస్తున్నారు. ఇలాంటప్పుడు నిరీక్షణ చాలా భయంకరంగా ఉంటుంది. చెయ్యాలనుకున్న పని చిన్నది కాదు. అంచేత ఆయన ఏమీ తినలేదు. తిన్నా నిద్ర కాయటం ఆయనకి అలవాటే, కానీ ఊళ్ళోని చాలా ఆవుల్నీ మేకల్నీ లాక్కుపోయిన పులంటే ఆయనకి చాలా కసిగా కోపంగా ఉంది... అందుకే ఆయన ఏమీ తినలేదు. తనకి ఇష్టమైన స్కాచ్ తాగలేదు. సిగరెట్ కాల్చలేదు. తన పక్కనే ఉంచుకున్నా వాసన పైకి రాకుండా సీల్ చేసి పెట్టారు. పులులూ ఇతర జంతువులకూ ఘ్రాణశక్తి చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆయన అన్ని జాగ్రత్తలు తీసుకోవలసి వచ్చింది. బాగా విరిసిన మోదుగు చెట్టు చూసుకొని, దాని ప్రక్కనే మంచె వేయించుకున్నారు. మోదుగు పూల వాసన వల్ల తన ఒంటి వాసన

పులికో,  మరో క్రూరమృగానికో తెలియకూడదు. ఆయనకి ఎంతసేపూ ఒకటే ఆలోచన బుర్రలో తొలుస్తోంది. పులి బారిన పడి తమ జీవనాధారాలైన మేకల్నీ, గొర్రెల్నీ, ఆవుల్నీ, గేదెల్నీ పోగొట్టుకుని..  తన కాళ్ళ మీద పడ్డ ఆ ఊరి జనాన్ని ఈ కష్టం నించి ఎలాగైనా గట్టెక్కించాలని.

రావు గారేం చేస్తారోనని ఊరి జనమంతా ఆత్రంగా చూస్తున్నారు. ఎవరికీ ఆ రాత్రి కంటి మీద కునుకు లేదు. ఎన్నో జీవాలను పోగొట్టుకున్న ఆవేదన కోపమై వాళ్ళ కళ్ళల్లో కనిపిస్తోంది. 'ఆయన దానిని తప్పకుండా చంపుతాడు.. పీడా విరగడౌతుంది..' అని అందరూ బలంగా నమ్ముతున్నారు. ఆతృతతో ఎదురుచూసే ఆ జనానికి రావుగారు చెప్పారు. పులిని కొట్టిన వెంటనే మంచెమీది సెగడు వెలిగిస్తానని!

గుహ లోపల ఉన్న పులి నిన్ననే నాలుగు  పులికూనలను కన్నది. వారం క్రితం అడవంతా గాలిస్తూ చివరికి వచ్చేసరికి, అడవికీ ఊరికీ మధ్య ఉన్న పొలంలో మేస్తున్న ఆవూ దూడా కనిపించేసరికి  ఉత్సాహంగా దూకింది.  మామూలుగా వేటాడడానికి ఓపికేలేని పులికి, చాలా సులభంగా దొరికిన ఆ ఆవూ దూడా నాలుగు రోజుల ఆహారమైనాయి.  ఇక నుంచి అదే పని మొదలుపెట్టింది.

ఆ రోజు రాత్రి కార్తీక మాసపు అమావాస్య నాడు...  చీకటి చిక్కగా ఉంది. ఆ చీకటిని చలి దుప్పటిలా కప్పింది. చలికీ, చీకటికీ ముడుచుకొన్న పులికూనలు తల్లి చన్నులనందుకుని,  పడుకుని పాలు తాగుతున్నాయి. పులి ఆహారం దొరికి ఆనాటికి వారం రోజులు అయింది! ఇక తప్పదని పిల్లలను వదలి లేచింది. ఈ రోజు  అడవి దాటి ఊళ్ళోకి పోవల్సిందే. అక్కడైతే ఏదైనా సులువుగా దొరుకుతుందని దానికి తెలుసు. నిశ్చయించుకుని నెమ్మదిగా కదిలింది.

అడుగులో అడుగు వేసుకుంటూ చుట్టూ వాసన చూస్తూ, నిశ్శబ్దంగా కదులుతోంది పులి.  దాని కళ్ళు చింత నిప్పుల్లా ఉన్నాయి.   కోపం రంగూ ఆకలి రంగూ ఒకటేనేమో! అడవిలోనో, ఊళ్ళోనో ఏదైనా దొరకకూడదా అని దేవుడ్ని ప్రార్థిస్తోందది. ఇలాంటి క్రూర మృగాల కోరికలు తీర్చడానికేనా దేవుడున్నది?  'కలడందురు దీనుల ఎడ.. కలడందురు పరమయోగి గణముల పాలన్' నిజమే.  పచ్చి నెత్తురు తాగే ఈ పులికా దేవుడు సాయం చేసేది! ఏం  జరిగినా ఏమీ చెయ్యడు. పాపం ఊళ్లో జీవాలూ, జనాలూ, మంచె మీది రావుగారూ వీళ్ళే కదా దీనులంటే!  అందుకని ఏమీ ఫరవాలేదు. ఏ కథైనా చివరకు శాంతీ సౌభాగ్యాలే ఉండాలి కదా. అందుకని దేవుడు పులి ప్రార్థన వినలేదు. పులి పిల్లలు కూడా క్రూర జంతువులే ! అంచేత చచ్చినా, చంపబడ్డా  ఎవరూ ఏమీ అనుకోరు. ప్రపంచం సర్వమానవ సౌభ్రాతృత్వంతో వర్ధిల్లుతుంది.

నెమ్మదిగా నడిచి వస్తున్న పులికి చెట్టుకి కట్టేసి ఉన్న మేక  కనిపించింది. వాటం చూసుకుంది. మేకకు అస్సలు అనుమానం రాకుండా నిశ్శబ్దంగా హఠాత్తుగా ఒక్కసారిగా దూకడానికి ప్లాన్ చేసుకుని ఆ వైపుగా కదిలింది. ఒక్క క్షణమైతే దూకేసేదే. కానీ రావుగారి బైనాక్యులర్స్ లోంచి దాని ప్రతీ అడుగూ గమనింపబడుతోందని దానికి తెలీదు.  దాని మెత్తనైన నిశ్శబ్దపు అడుగులను చూసి రావు గారు నిశ్శబ్దంగా పళ్ళు కొరికారు.  టెలీస్కోపిక్ గన్లో నుండి దాని గుండెకి తిన్నగా, నిశితంగా, ఖచ్చితంగా గురి పెట్టారు.

ఆ నీరవ నిశ్శబ్దంలో ఉన్నట్టుండి పెరేల్మని మోత. ఒక్క క్షణం పాటు చెట్ల మీది పక్షులూ, శబ్దం వినిపించిన జంతువులూ గోల గోల చేశాయి. దూరాన ఉన్న ఊళ్ళోకి కూడా వాటి కలకలం, ఖంగారూ వినిపించాయి. కలకలం సద్దుమణిగిన కొద్దిక్షణాల్లోనే మంచె మీద ఎత్తుగా కట్టిన కాగడా మంట కనిపించింది. ఊరిలో ఉత్సాహం పరవళ్ళై ఉరికింది. జనం ప్రభంజనంలా కదిలారు. జేజేలు... అభినందనలు! అసంకల్పితంగా ఆయన చెయ్యి మీసం మీదకు పోయింది. చచ్చిన పులి వైపు గర్వంగా చూశారు. జీవాన్ని కోల్పోయిన ఆ కళ్ళు తెరుచుకునే ఉన్నాయి. ఆయన వైపే తీక్షణంగా చూస్తున్నాయి. ఆ కళ్ళలో ఏవో ప్రశ్నలు. గతుక్కుమన్నారాయన. ఉన్నట్టుండి ఆ కళ్లు మాట్లాడుతున్నాయి.


ఇంటికొచ్చిన రావుగారికి వేల వేల గొంతులతో ఆ కళ్ళు మాట్లాడుతున్న మాటలేమిటో, వాటి అర్థమేమిటో నలువైపుల నుండీ ప్రతిధ్వనించసాగింది.

"నా ఆకలి తీర్చుకోవడమూ, నా పిల్లల ఆకలి తీర్చడమూ తప్పా! దేవుడు నాకిచ్చిన ఆహారాన్ని కాదనడానికీ, నేను చేసేది తప్పనీ తీర్పు చెప్పడానికి నువ్వెవరు? నీవు దేవుడి కంటే గొప్పవాడివా? ఏం చేశానని మోసం చేసి ఎర చూపించి, నా పిల్లల కోసం నేను తిండి సంపాదించుకుంటుంటే చంపావు? ఎందుకు? ఎందుకు? ఏం చేశానని.....? ఏం చేశానని.....?". ఆయనకు ఉన్నట్టుండి తలంతా తిరుగుతున్నట్టు అనిపించింది.

ఆ రోజు నుండీ రావుగారు వేటకెళ్లడం మానేశారు. ఎవరు ఎన్నిసార్లడిగినా ఎవరికీ కారణం చెప్పలేదు. ఒక రోజంతా కూర్చొని పులి బొమ్మ వేయడానికి ప్రయత్నించినా, ఆయన ఆ పులి కళ్ళ వరకే బొమ్మ గీయగలిగారు. ఈ రోజుకీ ఆయన బెడ్ రూమ్ లో ఆ బొమ్మ ఉంది. రోజూ నిద్రలేవగానే ఆయన దాని ముందు క్షమాపణ కోరుతున్నట్టుగా ఒక నిమిషం మౌనంగా నించున్నాకే తన దైనందినమయిన పనులు చేసుకుంటారు!

***0***

# అర్ధరాత్రి అతిథి



## చిత్రవెంకటేష్

బయట పిడుగుపడిన చప్పుడు భయంకరంగా వినిపించింది. గదిలో సూట్ కేసు సర్దుతున్న వైదేహి కంగారుగా గదిలోంచి బయటకు వచ్చింది. కిటికి దగ్గరకు వెళ్ళి బయటకు చూసింది. ఆకాశంలో కారు మేఘాలు కమ్ముకున్నాయి. నల్ల చీర కప్పుకున్నట్టుగా ఉంది. గాలి కూడా వేగంగా వీస్తోంది. ఏ క్షణంలోనైనా వర్షం కురిసేలా ఉంది.

వైదేహి కంగారుగా లోపలికి వెళ్ళింది. మంచం మీద ఒక సూటుకేసు తెరిచి ఉంది. ఇంకా కొంచెం సేపట్లో అందులో సామాను పెట్టుకుని బయటకు వెళ్ళాలనుకుంది. అందుకోసం రెండు గంటలనుంచి తయారుగా ఉంది. ఇంకో అయిదు నిమిషాలలో బయలుదేరాలనుకుంది.. ఈ లోగా వాతావరణంలో విపరీతమైన మార్పు వచ్చింది.

సూటుకేసు మూసి మళ్ళీ హాలులోకి వచ్చింది. ఆమె అనుకున్నట్టుగానే జరిగింది. సన్నగా వర్షం కురవటం మొదలుపెట్టింది. అయిదు నిమిషాలలో అది జడివానగా మారింది. అప్పుడప్పుడు ఢాం అంటు పిడుగులు పడుతున్న చప్పుడు వినిపిస్తోంది. దానికి తోడు ఆకాశంలో మెరుపులు. ఒక్క మాటలో చెప్పాలంటే వాతావరణం భీభత్సంగా ఉంది.

ఏం చెయ్యాలో ఆమెకు అర్ధంకాలేదు. ఖచ్చితంగా ఆమె బయటకు వెళ్ళి తీరాలి. ఆమె అవసరం అలాంటిది. లేకపోతే లేని పోని అనర్ధాలు జరుగుతాయి. వాటికి జవాబు చెప్పలేక ఇబ్బంది పడవలసి వస్తుంది.

బయట వర్షం ఏకధాటిగా కురుస్తోంది. ఈ రోజు బయటకు వెళ్ళటం సాధ్యం కాదని ఆమెకు అర్ధమైంది. గదిలోకి వెళ్ళి సూటుకేసు మూసి బీరువా పైన పెట్టింది. తరువాత గది తలుపులు మూసి హాలులోకి వచ్చింది.

బయట ఎంత వర్షం కురుస్తున్నా కరెంటు మాత్రం పోలేదు. అది ఒకందుకు నయం. ఏం చెయ్యాలో తోచక చేతికి అందిన పుస్తకం చదువుతూ కూర్చుంది. అరగంట గడిచింది. అప్పుడే తలుపుమీద సన్నగా చప్పుడయింది. ఉలిక్కిపడి టైం చూసింది. దాదాపు తొమ్మిది గంటలు కావస్తోంది. ఈ టైంలో ఎవరు వచ్చారా అనుకుంటూ వెళ్ళి తలుపు తీసింది. గుమ్మం దగ్గర ఒక అపరిచిత వ్యక్తి కనిపించాడు. ఖరీదైన బట్టలు వేసుకున్నాడు. పైన జర్కిన్స్ కూడా ఉన్నాయి. చూస్తుంటే బాగా చదువుకున్నవాడిలా కనిపించాడు.

"ఎవరండీ? ఏం కావాలి?" అని అడిగింది వైదేహి.

"నా పేరు రవి. వ్యాస్ చంద్ గారు ఉన్నారా?" అని అడిగాడు.

"లేరు ఇంకా ఆఫీసునుంచి రాలేదు. మీరు ఎవరో తెలుసుకోవచ్చా?"

"నేను వ్యాస్ చంద్ గారి బిజినెస్ పార్టనర్ ను. ఆయనతో అర్జంటుగా మాట్లాడాలని వచ్చాను!"

"ఈ పాటికి ఆయన ఆఫీసు నుంచి రావాలి. కాని ఈ రోజు ఎందుకో రాలేదు. నాలుగుసార్లు కాల్ చేశాను. బిజీ అంటు జవాబు వచ్చింది."

"మీరు ఎవరో తెలుసుకోవచ్చా?" అడిగాడు రవి.

"నేను ఆయన భార్యను. నా పేరు వైదేహి. సారీ బయట నిలబెట్టి మాట్లాడుతున్నాను. లోపలికి రండి. సోఫాలో కూర్చోండి. బాగా తడిసిపోయినట్టున్నారు, తుడుచుకోవటానికి తువ్వాలు తెస్తాను!" అని పక్కకు జరిగింది.

రవి లోపలికి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. బయట వర్షం ఇంకా ఎక్కువైంది. అప్పుడప్పుడు భయంకరంగా పిడుగులు పడుతున్న చప్పుడు వినిపిస్తోంది. కళ్ళు మిరుమిట్లు చేసే మెరుపులు కూడా మెరుస్తున్నాయి. లోపల నుంచి తువ్వాలు తెచ్చి రవికి ఇచ్చింది.

రవి తుడుచుకుంటూ సాభిప్రాయంగా వైదేహి వైపు చూశాడు. వైదేహి చాల అందంగా గ్రేస్ ఫుల్ గా కనిపించింది. వ్యాస్ చంద్ కు ఇంత అందమైన భార్య ఉందని అతను ఎప్పుడు చెప్పలేదు. నిజానికి వాళ్ళు పార్టనర్స్ గా రెండు సంవత్సరాల నుంచి కొనసాగుతున్నారు. ఎన్నో విషయాలు మనస్సు విప్పి మాట్లాడుకున్నారు. కాని ఎప్పుడు వ్యాస్ చంద్ తన భార్య గురించి చెప్పలేదు. రవి కూడా అడగలేదు.

"వేడిగా కాఫీ తాగుతారా?" అడిగింది వైదేహి.

"ఇప్పుడు ఎందుకండీ మీకు శ్రమ!" అన్నాడు ఇబ్బందిగా.

“ఇందులో శ్రమ ఏం లేదు. భోజనం చెయ్యటానికి ముందు వేడి కాఫీ తాగటం ఆయనకు నాకు అలవాటు. మీరు కూర్చుని పుస్తకాలు తిరగేస్తూ ఉండండి. నేను కాఫీ తీసుకువస్తాను!” అని హడావిడిగా లోపలికి వెళ్ళింది.

ఆమె వెళ్ళగానే రవి ఎదురుగా ఉన్న టీపాయి మీద చూశాడు. దినపత్రికలు, రెండుమూడు పుస్తకాలు, ఓ తెల్లకాగితాల లెటర్ ప్యాడ్ ఉన్నాయి.  ఆమె కాఫీ తీసుకుని వచ్చేసరికి అతను పేపరు చూస్తూ కూర్చుని ఉన్నాడు. ఇద్దరు ఎదురెదురుగా కూర్చుని కాఫీ తాగారు.

“ఆయన మీ గురించి ఎప్పుడు చెప్పలేదు. అసలు తనకు ఒక పార్టనర్ ఉన్నాడని మాట వరుసకు కూడా అనలేదు!” అంది కాఫీ కప్పు ట్రే లో పెడుతూ వైదేహి.

“నేను పెద్ద పార్టనర్ ను కానులెండి. ఏదో చిన్న పార్టనర్ ను. ఆయన మీద గౌరవంతో ఆరాధన భావంతో పార్టనర్ గా చేరాను. నేను కామర్స్ లో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేశాను. ఉద్యోగం చెయ్యటం ఒకరి కింద పనిచెయ్యటం నాకు ఇష్టం లేదు. అందుకే ఏదైనా వ్యాపారం చెయ్యాలని అనుకున్నాను.  నాకు గ్రేనేట్ వ్యాపారం గురించి కొంత తెలుసు. ఒక ఆరు నెలలు అలాంటి సంస్థలో ఒక దాంట్లో అకౌంటెంట్ గా పనిచేసాను. ఆ వ్యాపారంలో ఉన్న లోటు పాట్లు అన్ని తెలుసుకున్నాను. ముఖ్యంగా ఆ వ్యాపారంలో విపరీతమైన లాభాలు సంపాదించవచ్చని నాకు అర్ధమైంది. అందుకే మా నాన్నగారిని అడిగి అయిదు లక్షలు తీసుకున్నాను. ఒంటరిగా బిజినెసులోకి దిగటానికి నాకు ధైర్యం చాలలేదు. అందుకే ముందు ఎవరి దగ్గర అయిన చిన్న పార్టనర్ గా చేరాలని అనుకున్నాను. ఈ వ్యాపారంలో రాష్ట్రంలో నెంబర్ వన్ బిజినెస్ మ్యాన్ వ్యాస్ చంద్ గారు. అందుకే ఒక రోజు ఆయనను కలుసుకుని నా కోరిక చెప్పాను. ఆయన వెంటనే సంతోషంగా ఒప్పుకున్నారు. అప్పటికి అప్పుడు నన్ను పార్టనర్ గా చేర్చుకున్నారు.

వ్యాస్ చంద్ గారు చాల మంచివారు. ముఖ్యమైన పనులన్నీ నాకే అప్పగించేవారు. డబ్బుతో సంబంధించిన వ్యవహారాలన్నీ నాచేత చేయించేవారు. దాని వల్ల వ్యాపారంలో మెలకువలు నాకు పూర్తిగా అర్ధమయ్యాయి. పైగా చదువుకున్నవాడిని కనుక చాల విషయాలు లొసుగులు ఇట్టే గ్రహించాను.

రెండు సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి.  వ్యాపారంలో నాకు తగినంత అనుభవం వచ్చిందని గ్రహించాను. అందుకే పార్టనర్ షిప్ లోంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. వేరేగా వ్యాపారం పెట్టాలని తీర్మానించుకున్నాను. ఈ సంగతి వ్యాస్ చంద్ గారితో రెండు రోజులకు ముందు చెప్పాను. ముందు ఆయన విపరీతంగా స్పందిస్తాడని అనుకున్నాను. కాని ఆయన ఈ విషయాన్ని చాల తేలికగా తీసుకున్నాడు. నాలుగు రోజుల తరువాత వచ్చి తనని కలుసుకోమని చెప్పాడు. నా పెట్టుబడి డబ్బు లాభాలతో తిరిగి ఇచ్చేస్తానని చెప్పాడు. ఈ రోజుతో నాలుగు రోజులు గడిచిపోయాయి. ముందు ఆఫీసుకు వెళ్ళాను. ఆయన ఈ రోజు ఆఫీసుకు రాలేదని చెప్పారు స్టాఫ్. అందుకే ఇక్కడికి వచ్చాను. కాని ఇక్కడ కూడా ఆయన లేరని తెలుస్తోంది!” అన్నాడు రవి.

“నిరుత్సాహ పడకండి. అప్పుడప్పుడు ఆఫీసునుంచి ఆలస్యంగా రావటం ఆయనకు అలవాటే. ఇంకా కొంచం కాచుకోండి. వచ్చేస్తారు!” అంది వైదేహి.

ఇద్దరు కబుర్లు చెప్పుకున్నారు. వైదేహిని చూసి చాల ముచ్చట పడ్డాడు రవి. ఆమె మంచితనం మర్యాద అతన్ని బాగా ఇంప్రస్ చేశాయి.

బయట వర్షం కొంచం కూడా తగ్గినట్టుగా లేదు.

“ఈ వర్షం ఇప్పట్లో తగ్గేలా లేదు!” అన్నాడు రవి.

“తగ్గుతుందిలెండి. మీరు అనవసరంగా కంగారుపడకండి. ఆ విషయం పక్కన పెట్టండి. మీ గురించి చెప్పండి!” అంది.

“నాకు పెళ్ళైంది. నా భార్య పేరు రమ. తను కూడా ఆర్ట్స్ లో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసింది. మాది పెద్దలు కుదిర్చిన పెళ్ళి. తను కూడా మీలాగే బాగా కాఫీ చేస్తుంది. అల్లికలు, కుట్లు పనులు చేస్తుంది. ముఖ్యంగా రుచికరమైన వంటలు చేస్తుంది. మాకు పిల్లలు లేరు. ఇప్పుడే వద్దని అనుకున్నాం. బిజినెస్ లో బాగ స్థిరపడిన తరువాత, ఆ విషయం ఆలోచిద్దాం అనుకున్నాం! అప్పుడే నేను వేరుగా వ్యాపారం పెట్టాలని నిర్ణయించుకున్నాను. సిటిలో మంచి బిజి సెంటర్లో ఆఫీసు కూడా చూసుకున్నాను. సరుకు నిల్వ పెట్టటానికి గోడవున్ కూడా ఏర్పాటు చేసుకున్నాను. వ్యాస్ చంద్ గారు డబ్బు ఇస్తే వెంటనే వ్యాపారం మొదలుపెడతాను. అందుకే ఇంట్లోంచి హడావిడిగా బయలుదేరాను. మధ్యలో ఈ అకాల వర్షం పట్టుకుంది. ముందు తిరిగి వెళ్ళిపోదామని అనుకున్నాను. తరువాత మనస్సు మార్చుకుని వచ్చాను. దాని వల్ల మీకు ఇబ్బంది కలిగించాను. మన్నించండి!” అన్నాడు అపాలజటిక్ గా రవి.

తేలిగ్గా నవ్వింది వైదేహి.

“నాకేం ఇబ్బంది కలగలేదు. ఒక ముఖ్యమైన పని మీద బయటకు వెళ్ళాలనుకున్నాను. ఈలోగా వర్షం పట్టుకుంది. ఏం చెయ్యాలి దేవుడా అనుకుంటుంటే మీరు వచ్చారు.”

“ఒకసారి మీ వారికి కాల్ చెయ్యండి!” అన్నాడు.

వైదేహి సెల్ తీసి భర్తకు కాల్ చేసింది. తరువాత సెల్ చెవులో పెట్టుకుని కిటికీ దగ్గరకు వెళ్ళింది. రెండు క్షణాల తరువాత అతని దగ్గరకు వచ్చి అంది.

“ఆయన ఎక్కడికో అర్జంటుగా బయటకు వెళ్లారట. రావటానికి టైం పడుతుందని.. ఆయన పర్సనల్ సెక్రటరీ చెప్పింది.”

నిరుత్సాహంగా చూశాడు రవి.

“మీరు కూర్చోండి.  వంటింట్లో చిన్న పని ఉంది. ఒక్క ఐదు నిమిషాల్లో వచ్చేస్తాను!” అని అతని జవాబు కోసం చూడకుండా, లోపలికి వెళ్ళింది వైదేహి.

ఒక్కసారి ఆలోచించాడు రవి.   ఓ నిర్ణయానికి వచ్చినట్టు..  వెంటనే అక్కడే టీపాయి మీద ఉన్న లెటర్ ప్యాడ్ తీసుకుని, అందులో ఓ కాగితం మీద  గబగబా ఏదో రాసి, దానిని చింపి మడత పెట్టి, టీపాయి మీద ఉన్న ఓ పుస్తకంలో పెట్టాడు. మరో చిన్న కాగితం చింపి, దాని మీద రెండు ముక్కలు  రాసి,  దాన్ని ఆ పుస్తకం మీద పెట్టి, అది ఎగరకుండా పేపర్ వైట్ పెట్టాడు.

అప్పుడే వైదేహి కాఫీ తీసుకుని వచ్చింది.

“ఇక నేను వస్తాను మేడం. నా భార్య నాకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. వెళ్ళకపోతే కంగారు పడుతుంది వస్తాను!” అని లేచాడు రవి. కప్పు టీపాయ్ మీద పెట్టి వెళ్ళిపోయాడు. బయట అతని కారు స్టార్ట్ అయిన చప్పుడు వినిపించింది. చిన్నగా నవ్వుకుంటూ టీపాయ్ దగ్గరకు వచ్చింది. కప్పు అందుకోబోతూ, పుస్తకం మీద రెపరెప ఎగురుతున్న కాగితాన్ని చూసింది. ఆశ్చర్యంగా కాగితం తీసుకుని చదివింది.

“మేడం.

“నేను చెప్పినదంతా పూర్తిగా నిజం కాదు. కొంత అబద్ధం ఉంది. ఎందుకు అబద్ధం చెప్పానో తెలుసుకోవాలంటే కిందనున్న పుస్తకంలో ఓ ఉత్తరం ఉంది, దయచేసి అది చదవండి.  అంతా మీకే అర్ధమవుతుంది!”

రవి.

ఆశ్చర్యంగా పుస్తకంలోంచి కాగితాలు తీసి చూసింది.

“నేను మీ ఇంటికి వచ్చింది వ్యాస్ చంద్ గారిని కలుసుకోవటానికి కాదు. మిమ్మల్ని చంపటానికి వచ్చాను. నేను మీకు చెప్పిన విషయాలన్నీ నిజమే. మీ వారితో పార్టనరుషిప్ చేసేంత వరకు అంతా నిజమే చెప్పాను. కాని తరువాత జరిగిన విషయాలు చెప్తాను వినండి. కొన్ని రోజుల వరకు వ్యాస్ చంద్ గారి ప్రవర్తన బాగానే ఉంది. నన్ను చాల మర్యాదగా గౌరవంగా చూసేవాడు.

డబ్బుతో జరిగే వ్యవహారాలన్ని నాకే అప్పగించేవాడు. అందువల్ల నేను తరుచు బయట ఊళ్ళకు వెళ్ళవలసి వచ్చింది. ఆ నేపధ్యంలోనే ఒకసారి బెంగుళూరు వెళ్ళాను. విజయవంతంగా పనులు అన్ని ముగించుకున్నాను.  రావలసిన డబ్బు వసూలు చేసుకుని ఇంటికి బయలుదేరాను. నేను ఇంటికి వెళ్ళేసరికి నా భార్య ఇంట్లో లేదు. ఎక్కడికి వెళ్ళిందో తెలియలేదు. అందుకే నౌకరును అడిగాను.

‘అమ్మాగారు బయటకు వెళ్ళారు సార్’ అన్నాడు.

‘ఎక్కడికి వెళ్ళారు’ అడిగాను.

‘వ్యాస్ చంద్ గారితో వెళ్ళారు’ అని బాంబులాంటి వార్త పేల్చాడు.

నా భార్య గురించి నేను ఎప్పుడు వ్యాస్ చంద్ గారితో చెప్పలేదు. కనీసం ఆయన ఒక్కసారి కూడా మా ఇంటికి రాలేదు. మరి నా భార్య గురించి ఆయనకు ఎలా తెలిసిందా అని ఆశ్చర్యపోయాను.

వాళ్ళిద్దరు ఎక్కడికి వెళ్ళి ఉంటారో ఊహించాను. వ్యాస్ చంద్ గారికి సిటి చివరలో ఒక ఫారమ్ హౌస్ ఉంది. అక్కడికి నేను చాల సార్లు వెళ్ళాను. అప్పడప్పుడు ఆయన ఖరీదైన కాల్ గరల్స్ తో అక్కడికి వెళ్ళటం చాల

సార్లు చూశాను. అందుకే వెంటనే కారులో అక్కడికి చేరుకున్నాను. నేను ఊహించింది నిజమైంది. ఇద్దరు స్విమ్మింగ్ పూల్ దగ్గర కూర్చుని విస్కీ తాగుతున్నారు.

నన్ను చూసి వ్యాస్ చంద్ కొంచం కూడా కంగారుపడలేదు. సిగ్గు పడలేదు. పైగా ఏదో గొప్ప విజయం సాధించినట్టు నవ్వాడు. నా భార్య కూడా కొంచం కూడా భయపడలేదు. సిగ్గు పడలేదు. ఎవరోలే అన్నట్టు నిర్లక్ష్యంగా తల పక్కకు తిప్పుకుంది. ఆమె పరిస్థితి వెంటనే నాకు అర్ధమైంది. తన డబ్బుతో నా భార్యను పూర్తిగా లోబర్చుకున్నాడు వ్యాస్ చంద్. నన్ను టూర్ కు పంపించి, ఆమెతో అక్రమసంబంధం పెట్టుకున్నాడు. వాళ్ళ వ్యవహారం చాల రోజుల నుంచి కొనసాగుతోంది. నాకు మాత్రం ఈ రోజే తెలిసింది.

అయన సిగ్గు విడిచి నాతో రమ్మని నా భార్యను వేడుకున్నాను. ఆమె చేసిన తప్పును క్షమిస్తానని కూడా చెప్పాను. అయిన ఆ రాక్షసి నా మాటలు పట్టించుకోలేదు. పురుగును చూసినట్టు చూసింది. అంతేకాకుండా ఒక వజ్రాల హారం తీసి నాకు చూపించింది. ఆ హారం కొన్ని రోజులకు ముందు, నేను నా భార్య ఒక నగల షాపులో చూశాం. దాని ఖరీదు దాదాపు పదిలక్షలు. అంత డబ్బు పెట్టలేనని ఆమెకు ఖచ్చితంగా చెప్పాను. ఆ రోజంతా నా భార్య నాతో మాట్లాడలేదు. కోపంతో మొహం ముడుచుకుంది.

ఆ రోజు ద్వేషంతో ఒక నిర్ణయం తీసుకున్నాను. వ్యాస్ చంద్ నా భార్యను నాకు కాకుండా చేశాడు. కట్టుకున్న భార్య ఎడబాటు ఏ భర్త సహించలేడు. అదే పరిస్థితి అతనికి కలిగించాలి. అందుకే మిమ్మల్ని చంపాలని మీ ఇంటికి వచ్చాను. అంతకు ముందే మీ గురించి వివరాలు సేకరించాను. కాని దగ్గర నుంచి మిమ్మల్ని చూసి నా మనస్సు మార్చుకున్నాను. మీ సంస్కారం మంచితనం నన్ను మెస్మరైజ్ చేశాయి. నాలో ఉన్న రాక్షసత్వం పూర్తిగా పోయింది. మాములు మనిషిగా మారిపోయాను. అందుకే తిరిగి వచ్చేశాను. మిమ్మల్ని ఇబ్బంది పెట్టినందుకు నన్ను క్షమించండి.

రవి"

పూర్తిగా చదివి ఒక్కసారిగా గట్టిగా నవ్వింది వైదేహి. రవి ఎదురుగా ఉన్నట్టు మాట్లాడటం మొదలుపెట్టింది. "పిచ్చి రవి. నీకు ద్రోహం చేసిన వ్యాస్ చంద్ అంటే నా భర్తని నేను ఎప్పుడో చంపేశాను. ఆయన శవం బెడ్ రూమ్ లో ఉంది. ఈరోజు అనుకోకుండా మద్యాహ్నం ఆయన వచ్చారు. తలనొప్పిగా ఉందని గదిలో పడుకున్నారు. నేను కాఫీ తెచ్చేలోగా గాఢనిద్రలోకి జారుకున్నారు. ఇదే మంచి సమయం అనుకుని కత్తితో కసిదీరా ఆయనను పొడిచాను. ఇంతకాలం దాచుకున్న కోపం ద్వేషం ఈ రోజు పూర్తిగా తీర్చుకున్నాను. మద్యాహ్నం నుంచి ఆయన శవాన్ని ఎలా మాయం చెయ్యాలా అని ఆలోచించాను. చివరకు ఒక ఉపాయం తట్టింది. అది అమలు పరచటానికి ముందే వర్షం వచ్చింది. దాంతో నా ప్లాన్ అంతా చెడిపోయింది. ఈలోగా నువ్వు వచ్చావు!" అని మాట్లాడటం పూర్తిచేసి గదిలోకి వెళ్ళింది.

విశాలమైన మంచం మీద వ్యాస్ చంద్ శవం ఉంది. అతని గుండెల్లో పిడి వరకు కత్తి దిగి ఉంది. చుట్టు రక్తపు మడుగు కట్టి ఉంది.

***

మూడు నెలలు గడిచాయి.

హాలులో నిస్సారంగా కూర్చుని ఉన్నాడు రవి. గంట ముందే రమ అతని దగ్గరకు వచ్చింది. తను పెద్ద తప్పు చేసిందని క్షమించమని అడిగింది. రవి పట్టించుకోలేదు. ఎంతో సేపు బ్రతిమాలింది. అయిన స్పందించలేదు రవి. దాంతో నిరుత్సాహంగా వెళ్ళిపోయింది రమ. తన భవిష్యత్తు ఏమిటా అని ఆలోచిస్తున్నాడు అతను. అప్పుడే కొరియర్ వాడు వచ్చి ఒక కవరు ఇచ్చి వెళ్ళిపోయాడు.

అది వైదేహి పంపిన కవరు. అందులో ఒక చెక్ ఉంది. దాని మీద పదిలక్షలు అని రాసుంది. దాంతో పాటు చిన్న ఉత్తరం కూడా ఉంది.

"రవిగారికి.

మా ఆయన చేసిన మోసం నాకు తెలిసింది. అందుకే మీకు పదిలక్షలు పంపిస్తున్నాను. ఈ డబ్బుతో మళ్ళీ వ్యాపారం మొదలుపెట్టండి. నన్ను కలుసుకోవటానికి రాకండి. నేను మీకు కనిపించను. ఎందుకంటే.. ప్రస్తుతం నేను జైలులో శిక్ష అనుభవిస్తున్నాను. మా ఆయనను చంపిన నేరానికి కోర్టు నాకు జైలు శిక్ష విధించింది. ఉంటాను

వైదేహి."

***0***

# ఆదర్శం




పక్కి శివప్రసాదరావు

"ఏమండీ! ఎదురింటి ఫ్లాట్లో శర్మగారు అని రిటైర్డ్ ప్రిన్సిపాల్ దిగారు. వాళ్ళ ఆవిడ, కొడుకూ, కోడలు, ఇద్దరు మనవలు, చూడ ముచ్చటగా వున్నారు. చక్కని కుటుంబం!" మా ఆవిడ చెబుతుంటే "పోనీలే… ఇరుగూ పొరుగు, మాటామంతీ, చేదోడు వాదోడుగా ఉంటుంది!" అన్నాను.

"అవునండీ…." అంది.

అంతకు ముందు ఓ వర్కింగ్ కపుల్ వుండేవారు. ఆదివారం కూడా కనిపించేవాళ్ళు కాదు.

నేను ఉదయం వెళితే రాత్రి ఏ పదింటికో ఇంటికొచ్చే ఉద్యోగం. పిల్లలిద్దరూ ఫారిన్ లో సెటిల్ అయ్యారు. పెళ్లిళ్లు అయ్యాక వాళ్ళు సంవత్సరానికి ఒకసారి రావడం కూడా అరుదే. ఈ నేపథ్యంలో మా ఆవిడకు మంచి కాలక్షేపం దొరికిందనిపించింది.

రోజు వాళ్ళ సంగతులు రాత్రి డైనింగ్ టేబుల్ దగ్గర చెప్పేది మా ఆవిడ. నాకూ ఉత్సాహంగానే ఉండేది.

"నిజంగా ఆ శర్మగారు, ఆవిడా చాలా అదృష్టవంతులు. కళ్లెదుటే కొడుకూ, కోడలూ మనవళ్లతో ఎంచక్కా హాయిగా వున్నారు!" తెగ మురిసిపోతూ అంది.

"ఏమో… అప్పుడే ఏం తెలుస్తుంది!" అన్నాను.

“మీరు అలాగే అంటారు… అన్నం అంతా పట్టి చూడాలా.. ఒక్క మెతుకు చాలదూ!"

నేను ఇంకేం మాట్లాడలేదు. తను చెప్పేది వింటూ తినసాగాను.

శర్మగారు ఉదయాన్నే వాకింగ్ కి వెళతారు. ఆవిడ పూజలో ఉంటుంది. కోడలు చకచకా వంటింట్లో అన్నీ రెడీ చేసేస్తుంది. కాన్వెంటుకెళ్లే పిల్లలిద్దరినీ రెడీ చేయడమే కాకుండా, వాళ్లకు టిఫిన్లు పెట్టడమే కాకుండా లంచ్ బాక్సులు కూడా కట్టేస్తుంది. అదే టైముకి అత్తా మామలకు బ్రేక్ ఫాస్ట్ పెట్టేస్తుంది. చక్కని పనిమంతురాలు. డిగ్రీ చదివినా, ఆ చదువుని పిల్లలకు చెప్పడానికే ఉపయోగిస్తుంది. సాయంకాలం పిల్లలు స్కూలు నుండి రాగానే చీకటిపడేవరకు ఆడుకున్నాక, అప్పటికే అన్ని పనులు పూర్తి చేసేసుకుని, ఓ

గంటసేపు హోంవర్కులు చేయించి చదివిస్తుంది.  రాత్రి ఎనిమిది గంటలకు అత్తా, మామలిద్దరికీ టిఫిన్ పెట్టి డైనింగ్ టేబుల్ దగ్గరకు పిలుస్తుంది.  అప్పుడే టీవీ ఆన్ చేసి మంచి కార్టూన్ ఫిల్మ్ వేయగానే పిల్లలు ఉత్సాహంగా చూస్తుంటే... గబగబా వాళ్లకు తినిపిస్తుంది.  తరువాత, పిల్లలు తాత, నాయనమ్మల గదిలోకి వెళతారు. ఇక వాళ్ళు, కథలూ కబుర్లు చెప్పుకుంటూ వుంటారు.  ఈలోగా వాళ్ళ అబ్బాయి వస్తే ఒకటే సందడి.

"నువ్వు చెబుతుంటే నాకెంతో ముచ్చటేస్తోంది!" అన్నాను.

"నిజం సుమండీ! ఆ పెద్దలకు ఎంత నిశ్చింత, ఎంత ప్రశాంతత ఉంటుందో!"

"మరి, మన సంగతేంటి?" అడిగాను.

 "మన పిల్లలు ఆ ఉద్యోగాలు వదిలి వైజాగ్ వస్తారా?"

"ఇక్కడకు వచ్చీ ఏం ఉద్యోగాలు చేస్తారు! కనీసం హైదరాబాదో, బెంగళూరో అయితే ఏదో ఉద్యోగం దొరుకుతుంది!"

"నిజమేలెండి. కానీ మీరు రిటైర్ అయ్యాక మనిద్దరమే ఇలా ఎంతకాలం ఉంటాం! వయసు పెరిగాక, పిల్లల ఆసరా లేకుండా ఎలా ఉండగలం!" మా ఆవిడ నుంచి ఆ ప్రశ్న ఊహించిందే.

"అందరిలాగే మనం కూడా...." అన్నాను ఆలోచనగా.

"ఇప్పటి పిల్లల ఉద్యోగాలు మనకు పనిష్మెంట్ అయిపోయాయి!"

"అలా ఎందుకు అనుకోవాలి?" అన్నాను.

"మన పిల్లల్ని ఒకడు లాయర్, ఇంకొకడ్ని డాక్టరు చదివించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు కదా!" అంది.

"ఈ ఆలోచన అప్పుడు రాలేదు, రాదు!"  ఇంకేమనలో తెలియక అన్నాను.

***

ఆదివారం.

ఉదయం పూట నిదానంగా కాఫీ తాగుతూ ఉంటే, కాలింగ్ బెల్ మ్రోగింది. వెళ్లి తలుపు తీస్తే ఎదురింటి శర్మగారు!

"నమస్తే...రండి!" అంటూ ఆహ్వానించాను.

"ఆదివారం కదా... ఇంట్లో వుంటారని.. " అంటూ లోపలికి వచ్చారు.

"కూర్చోండి!" సోఫా చూపిస్తూ అన్నాను.

తెల్లని పంచె కట్టులో ఎంతో హుందాగా ఉన్నారాయన.

"ప్రిన్సిపాల్ గా రిటైర్ అయ్యారట కదా...."అడిగాను.

"అవునండీ.... మీరు బ్యాంక్ మేనేజర్ కదా!" అడిగారాయన.

"అవునండీ!" చెప్పాను.

ఈలోగా మా ఆవిడ  కాఫీ కప్పుతో వచ్చి పలకరించింది.

"ఇప్పుడే తీసుకున్నానమ్మా...."

"పరవాలేదు తీసుకోండి!" అంది.

ఆయన మొహమాటం పడుతూనే తీసుకున్నారు.

తరువాత ఆయన అవీ, ఇవీ మాట్లాడుతూ.... 'తన రిటైర్ బెనిఫిట్స్ బ్యాంకులో ఏ విధంగా వేయాలి? ఎన్నాళ్లకు వేస్తే బావుంటుంది? నామినేషన్ ఎలా పెట్టాలి?' అని అడిగితే, నేను వివరంగా చెప్పాను. అతని పెన్షన్ అకౌంట్ మా బ్రాంచిలోనే ఉంది. "ఓసారి మీరు బ్యాంకుకి వస్తే, మీకు ఎలా కావాలో అలా చేద్దాం!" అని చెప్పాను.

"ఇది మీ ఓన్ ఫ్లాటా?" ఆడిగారాయన.

"అవునండీ! పదేళ్ల క్రితమే తీసుకున్నాను. ఇన్నాళ్లూ బదిలీల మీద పై ఊళ్లు తిరిగేవాళ్ళం. ఇంకో రెండేళ్లలో రిటైర్మెంట్ ... అందుకని ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు!" చెప్పాను.

"రిటైర్మెంట్ అయ్యేసరికి సొంత ఇల్లు ఉండాలి.  కానీ, నాకు ఆ భాగ్యం లేదు. పిల్లల చదువులకే సరిపోయింది!"

"ఏం చేస్తున్నారు పిల్లలు?" యథాలాపంగా ఆడిగాను.

"పెద్దవాడు అమెరికాలో డాక్టర్, రెండోవాడు కంప్యూటర్ ఇంజినీర్, మూడోవాడు జర్మనీలో ప్రొఫెసర్. అందరూ మంచి పొజిషన్లో వున్నారు!"

"మరి ...  ఇతను నాలుగో వాడా? ఏం చేస్తున్నాడు?" అడిగాను.

"ఇక్కడే టీచర్!" అంటూ, ఆ  కాన్వెంట్ పేరు చెప్పారు. సిటీలో అది పెద్ద కాన్వెంట్.

"మా ఆవిడ చెబుతూ ఉంటుంది..  మీ అబ్బాయి, కోడలు ఎంతో చక్కగా బాధ్యతాయుతంగా ఉంటారనీ, ఈ రోజుల్లో అటువంటి కొడుకూ, కోడలు చాలా అరుదేననీ..  మీరెంతో అదృష్టవంతులనీ...."

“నిజమేనండీ...."అని మొహమాటంగా అంటూ,  కాసేపు అవీ, ఇవీ మాట్లాడి "రేపు బ్యాంకుకి వస్తాను!" అంటూ సెలవు తీసుకున్నారు.

***

మరుసటి రోజు శర్మగారు మా బ్యాంకుకి వచ్చారు. అన్నీ భార్య పేరుతో జాయింట్ గా ఫిక్స్డ్ డిపాజిట్ వేశారు. నామినేషన్ నాలుగో అబ్బాయి పేరు రాశారు.  కాసేపు మాట్లాడి వెళ్లిపోయారు.   తరువాత, ఆ నామినేషన్ పేరుని రికార్డు చేయడానికి చూస్తే,  అబ్బాయి ఇంటిపేరులో తేడా కనబడింది.

ఇతను శర్మగారి అబ్బాయి కాదా....లేక అల్లుడా? సందేహం కలిగి, నా పనిలో నేను మునిగిపోయాను.

ఆ రాత్రి భోజనాల దగ్గర గుర్తొచ్చి, నా సందేహం మా ఆవిడకు అడిగాను.

"అంటే అంత బాగా చూసుకుంటున్నారు కాబట్టి, కొడుకూ కోడలు కాకుండా, కూతురు, అల్లుడు అయివుంటారని మీ ఫీలింగా?" అంది మా ఆవిడ.

"ఆడపిల్లలు లేనివాళ్లకు ఎంత లేదన్నా, కాదన్నా ఆ ఫీలింగ్ ఉండటం సహజమే కదా"

"ఇంతకీ ఆ పిల్ల కోడలు కాదు, కూతురనే సందేహం మీకు ఎందుకు వచ్చింది?"

"ఎందుకంటే... ఇంటి పేరు వేరుగా ఉంది కాబట్టి!" అంటూ వివరంగా చెప్పాను.

మా ఆవిడ ఆలోచనలో పడింది!

***

కొద్ది రోజులు గడిచాక ,

మా ఆవిడ "ఏమండోయ్....మీ సందేహం నిజమేనండోయ్" అంది.

నేను 'ఏమిటా?' అన్నట్లు చూసాను.

"శర్మగారి నాలుగో అబ్బాయి ఆనందబాబు.  కొడుకూ కాదు, అల్లుడూ కాదు. అతను చిన్నప్పటినుంచి పెంచి పెద్ద చేసిన అనాథ శిష్యుడట!"

నేను పెద్దగా ఆశ్చర్యపోలేదు. ఇంచుమించు అటువంటిది 'ఏదో కావచ్చు' అని అనుకుంటూనే వున్నాను.

"ఏదైనా... అదీ ఓ అదృష్టమే కదా!" అన్న మా ఆవిడ మాటలకు అవునన్నట్లుగా తలూపాను.

అయితే, వారి దైనందిన జీవన విధానం కొన్ని నెలలుగా గమనించాక, అటువంటి శిష్యుడు దొరకడం నిజంగా ఎంతో అదృష్టం అనిపించింది.

ఓ రోజు వాకింగ్ లో శర్మగారి కాలు బెణికినప్పుడు, ఆనందబాబు తీసుకున్న శ్రద్ధ, జాగ్రత్త చూసిన మాకెంతో ముచ్చటేసింది.

శర్మగారి కుటుంబం మాకు బాగా దగ్గరయ్యారు! నిజానికి మేమే వాళ్లకు దగ్గర అయ్యాం. విదేశాలలో ఉన్న మా పిల్లలు కూడా అప్పుడప్పుడు ఫోన్ లో శర్మగారి కుటుంబంతో మాట్లాడుతున్నారు కూడా.

సంక్రాంతికి మా పెద్ద అబ్బాయి, కోడలు, మనవడు అమెరికా నుండి వచ్చారు.  ఇంక ఒకటే సందడి! ఎదురెదురుగా ఉన్న మా ఫ్లాట్స్ తలుపులు ఇప్పుడు పూర్తిగా తెరిచే ఉంటున్నాయి.

ఆనందబాబు పిల్లలతో మా మనవడు ఆడుకోవడం, మా కోడలు ఆనందబాబు భార్యతో సఖ్యతగా మెలగడం, మా అబ్బాయి శర్మగారితో కబుర్లు చెప్పడం.. చాలా కొత్తగా ఉత్సాహంగా ఉంది!

"డాడీ! ఈ శని, ఆదివారాలు మీకు సెలవు కదా,  రిసార్ట్ బుక్ చేసాను.  అందరం వెళుతున్నాం!"  చెప్పాడు.

"శర్మగారి ఫామిలీ కూడా.. " ఉత్సాహంగా అంది మా ఆవిడ.

ఈ మధ్య మా ఆవిడ చాలా ఆరోగ్యంగా కనిపిస్తోంది. ఇంతకు ముందులా తరచూ డాక్టర్ దగ్గరకు వెళ్లే అవసరం నాకైతే కనిపించడం లేదు.

ఇక రిసార్ట్ లో గడిపిన రెండు రోజులు మేము ఎవరం మరిచిపోలేము.  ప్రతీ రోజు జరిగే దైనందిన జీవన విధానానికి భిన్నంగా అందరం ఉదయం లేచి, విశాలమైన ఆ  పచ్చని చెట్ల మధ్యనుండి నీరెండలో నడుస్తూ ఒక గంట సేపు తిరిగాక, రూములకు వచ్చి స్నానాలు ముగించి, అందరం ఆ పెద్ద హాలులోకి వచ్చి కూర్చునేవాళ్ళం.  అవీ, ఇవీ మాట్లాడుకుని బ్రేక్ ఫాస్ట్ అయ్యాక అందరం రిసార్ట్స్ అంతా తిరిగేవాళ్ళం.
మా పెద్దబ్బాయి శర్మగారితో వాకింగ్ చేస్తూ, చాలా విషయాలు చర్చిస్తూ ఉండేవాడు.
ఆ రోజు తిరుగు ప్రయాణం.  అక్కడే భోజనాలు చేసి బయలుదేరుదామని అనుకుని, అందరం ఆ రిసార్ట్ రెస్టారెంట్ లో ఒకే టేబుల్ దగ్గర కూర్చున్నాం.
"ఒక ముఖ్య విషయం మీ అందరికీ చెప్పాలి!" అంటూ మా అబ్బాయి అందరి వైపు చూశాడు. అందరం ఒక్కసారి కంగారుగా అతడి వైపు చూశాం.
“కంగారు పడకండి! మీకు ఓ ప్లెసెంట్ సర్ ప్రైజ్.. అంతే!” అంటూ నవ్వుతూ అందరి వైపు చూశాడు.
అందరిలో ఓ విధమైన రిలీఫ్ వచ్చింది.
“విదేశాలు వెళ్లి మన దేశాన్ని మరిచిపోవడం నాకయితే ఏమీ నచ్చలేదు. ముఖ్యంగా అమ్మానాన్నలను వృద్ధాప్యంలో ఒంటరిగా వదిలేయడం ఇంకా దారుణం అనిపిస్తోంది.  ఇప్పటికి సంపాదించింది చాలు... ఇక్కడికి వచ్చేయడం మేలని అనిపించింది.  ఇది నా నిర్ణయం!" అన్నాడు.
నా నోటంట మాటలు రాలేదు.  మా ఆవిడ ముఖం వెలిగిపోతోంది.
శర్మగారు ప్రశంసా పూర్వకంగా చూసారు.
"మీ ఆనందబాబు అందరికీ ఇన్స్పిరేషన్! నిజానికి మీ కుటుంబమే అందరికీ ఆదర్శం!!" మా అబ్బాయి మాటలు అందరూ వింటున్నారు.
అప్పుడు అక్కడ ఉన్న ఒక్కొక్కరి మనసులో ఉండే ఆలోచనా తరంగాలు ఎలా ఎగిసిపడుతున్నాయో.. వివరించడానికి నేనేమీ చేయి తిరిగిన రచయితనూ కాను..  అద్భుతమైన వక్తనూ కాను!
జీవితంలో మొదటిసారి ఎదిగిన కొడుకుని చూసి, గర్వ పడ్డాను!
ఉబికి వస్తున్న కన్నీళ్లను తుడుచుకోడానికి, నా చేతులు రాలేదు.. అప్పటికే అవి శర్మగారి చేతులను మృదువుగా పట్టుకున్నాయి!

***0***

# అమ్మ పేరు

మద్దూరి నరసింహామూర్తి



"అక్కా ఇలా రమ్మీ!"

"ఏం కావాల్రా?" అంటూ వచ్చింది పల్లవి.

"ఈ కాగితాలలో అమ్మ పేరు వ్రాయాలి. ఇంతకీ అమ్మ పేరేమిటి?"

"అదేమిట్రా, అమ్మ పేరు తెలీదు నీకు?"

" 'అమ్మా' అని పిలవడమే కానీ, అమ్మ పేరుతో అవసరమే పడలేదు. నాకంటే, పెద్దదానివి కదా, నీకు తెలిసి ఉంటుందని పిలిచేను!" అన్నాడు ప్రకాష్ తలదించుకొని.

అవాక్కయిన పల్లవి "నిజానికి నాకూ అవసరం పడలేదు.." అంది లోగొంతుకతో.

ఇక తప్పదని, ఇద్దరూ వాళ్ళ అమ్మ దగ్గరకి వచ్చి, "అమ్మా ఇక్కడ నీ పేరు వ్రాసి, రెండో పేజీలో క్రిందన సంతకం చెయ్యి!" అంటూ ఆ కాగితాలు అందించేడు ప్రకాష్.

"ఏం కాగితాలురా అవి?" వాటిని ఎగాదిగ చూస్తూ అంది ఆవిడ.

"నీ ఫామిలీ పెన్షన్ కాగితాలమ్మా!"

"చెట్టంత మనిషి పోయిన తరువాత, ఈ కాగితాలతో నాకు పనేమిటి!" అని ఏడుస్తూ కూర్చుంది ఆవిడ.

పదవీ విరమణకు ఇంకా నాలుగేళ్ల కార్యకాలం ఉండగానే, రామకృష్ణగారు ఒక రోజు దినపత్రిక చదువుతూ కూర్చున్నవారు కూర్చున్నట్టే అనంత వాయువులో కలిసిపోయేరు. అప్పటికి ప్రకాష్ ఉద్యోగంలో చేరి ఏడాదైంది, పల్లవి పెళ్ళై రెండేళ్లయింది.

పిల్లలిద్దరూ ఆవిడని చెరో పక్కా పొదివి పట్టుకొని, "నాన్న పోయి నాలుగు నెలలైపోయింది. ఈ కాగితాలు నాన్న పనిచేసే ఆఫీసులో ఇవ్వడానికి ఇప్పటికే ఆలస్యమైందని.. నాన్నతో కలిసి పనిచేసిన రామారావు అంకుల్ అంటున్నారు. రెండు రోజులకోసారి నాకు గుర్తుచేస్తూనే ఉన్నారు."

"ఆయనే లేనప్పుడు ఆ పెన్షన్ డబ్బులు నాకెందుకురా!"

"అది నీ హక్కమ్మా! ఒక్కసారి ఆలోచించు. ప్రతీనెలా పెన్షన్ అందుకుంటూ ఉంటే, నెలకోసారి పలకరించడానికి నాన్న నీ దగ్గరికి వచ్చినట్టే అనిపించవచ్చు."

"అవునమ్మా, తమ్ముడు సరిగ్గా చెప్పేడు. అందుకోసమేనా నువ్వు ఈ కాగితాల మీద నీ పేరు వ్రాసి సంతకం చేసి ఇవ్వాలి. తక్కిన వివరాలు తమ్ముడు నింపేసి, అంకుల్ని కలిసి ఆయన చెప్పినట్టుగా చేస్తాడు."

"మీరిద్దరూ తందానా అంటే తందానా అన్నట్టుగా కూడబలుక్కొని నా దగ్గరికి వచ్చినట్టుంది. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. భోజనాలైన తరువాత ఈ కాగితాల సంగతి చూడొచ్చు." అని ఆవిడ వడ్డన కార్యక్రమాల్లో పడ్డారు.

భోజనాలైన తరువాత, ప్రకాష్ ఆ కాగితాలు తెచ్చి "ఇగో.. ఇక్కడ నీ పేరు పెద్ద అక్షరాలతో వ్రాసి, దిగువన ఇక్కడ సంతకం చేసి ఇవ్వు!" అని చెప్పి, ఇద్దరూ ఆవిడకి చెరో పక్కన చేరేరు కుతూహలంతో.

"నాకిప్పుడు ఏమీ రాసే ఓపిక లేదర్రా. మీలో ఎవరో ఒకరు ఏమిటి వ్రాయాలో వ్రాసేసి ఇస్తే, సంతకం చేసేస్తాను!"

అలా ఆవిడ అనేసరికి, ఇద్దరికీ ఏమి చేయాలో తోచలేదు.

ఒక రెండు నిమిషాల తరువాత, ప్రకాష్ "సరే, నీ పేరు, అంటే పూర్తి పేరు చెప్పు."

"పేరు, పూర్తి పేరు అంటూ రెండుంటాయేంటిరా!"

"ఎందుకుండవమ్మా. నేనే ఉన్నాను. నా పూర్తి పేరు సూర్యచంద్ర ప్రకాష్. అయినా నన్ను అందరూ ప్రకాష్ అన్న పేరుతోనే పిలుస్తున్నారు కదా!"

"అలాగంటావా, సరే వ్రాయి...."

"ఆగిపోయేవేంటమ్మా, చెప్పు."

ఆవిడేమీ మాట్లాడకుండా ఉండిపోతే "చెప్పమ్మా, ఈ కాగితాలు వ్రాసే పనైపోతే, ఒక గంట పడుకుందువుగాని!" అంది పల్లవి.

నిశ్శబ్దంగా కూర్చున్న ఆవిడ, ఐదు నిమిషాల తరువాత "నా పేరేమిటో గుర్తు రావడంలేదు." అన్నారు తలదించుకుని.

ఆ జవాబుతో, ఇద్దరికీ ఏమనాలో తోచలేదు.

కొద్దిసేపటి తరువాత, పల్లవి "నీ పేరు నీకే గుర్తు రాకపోవడమేమిటమ్మా?"

పేలవమైన ఒక నవ్వు నవ్వి, ఆవిడ "చిన్నప్పటి నుంచి మా అమ్మా నాన్నా 'అమ్మాయి' అని పిలవడమే. పైగా నాకు తోడబుట్టినవాళ్లు కూడా లేరు. మీనాన్న 'ఇగో', 'ఏమే' అని పిలవడమే! పనిమనిషిలాంటి వాళ్ళు 'అమ్మగోరూ ' అని పిలిచేవాళ్ళు. నన్నెవరికేనా పరిచయం చేయవలసి వస్తే.. 'మా ఆవిడ' అనో, 'నా శ్రీమతి' అనో, లేకపోతే 'మిసెస్ రామకృష్ణ' అనో పరిచయం చేసేవారు మీనాన్న! ఆసుపత్రిలో చేరవలసిన అవసరం రాకుండా, ఇంట్లోనే పుట్టేరు మీరిద్దరూ. మీరు 'అమ్మా' అని పిలవడమే! మీ ఇద్దరి చదువుల విషయంలో కానీ ఇంకేదైనా విషయంలో కానీ మీ నాన్న పేరు వ్రాయవలసిన అవసరమే కానీ, అమ్మ పేరు.. అంటే నా పేరు వ్రాయవలసిన అవసరమే పడలేదు! భగవంతుడి దయవలన, వంటింటి

చిట్కాలతో తగ్గిపోయే చిన్న చిన్న ఇబ్బందులు తప్పించి, ఇప్పటివరకూ రోగాల నెపంతో ఏ డాక్టర్ దగ్గరకి పరిగెత్తవలసిన అవసరం పడలేదు. కాబట్టి, నా పేరున ప్రిస్క్రిప్షన్ ఉండే అవకాశం లేదు. నా పేరుతో ఓటర్ కార్డు ఉందా అంటే, మీ నాన్న పేరుతోనే లేదు. ఏమంటే.. 'ఏ వెధవకి ఓటేసినా ఏమి ఒరగబెడతారని' అంటూ ఉండేవారు మీ నాన్న! ఆరేడు నెలల కిందట, ఆధార్ కార్డు చేయించుకుందికి మీ నాన్న వెళ్ళేటప్పుడు నాకు వీలుపడలేదు. ఆ తరువాత అసలు వెళ్ళేలేదు. అందుకే, నా పేరుతో ఆధార్ కార్డు కూడా లేదు. మరి నా పేరు నాకెలా గుర్తుంటుంది చెప్పండి!"

అది విన్న ప్రకాష్ అవాక్కై, రెండు నిమిషాల తరువాత.. "స్కూలు సర్టిఫికేటులో నీ పేరుంటుంది కదా!" అన్నాడు.

వెంటనే పల్లవి "నీ సర్టిఫికెట్ ఎక్కడ ఉందో చెప్పు తెస్తాను!" అంది.

"నాకంత అదృష్టం కూడానా. ఏ పరీక్ష వ్రాయకుండా సర్టిఫికెట్ ఎలా వస్తుంది!"

"ఏ పరీక్షా వ్రాయలేదా, ఎందుకు?" అంటూ ఆశ్చర్యపోయింది పల్లవి.

"మెట్రిక్యులేషన్ పరీక్ష నాలుగు నెలలుందనగా, ఒక పెళ్ళిలో నన్ను చూసిన మీ నాన్న, నన్నే చేసుకుంటానని పట్టుపట్టేరట. జాతకాలు పడడంతో, మా ఇద్దరికీ పెళ్లి నిశ్చయించేరు. అప్పుడు నాకు పదహారేళ్లే కాబట్టి, మా నాన్న రెండేళ్ళాగితే పెళ్లి చేస్తానన్నారు. మీ నాన్న, వారి నాన్న సరే అనడంతో, నాకు మరి బడికి పంపక ఇంటిపని వంటపని నేర్పించి, రెండేళ్ల తరువాత పెళ్లి చేసేరు. దాంతో నేను ఏ పరీక్షా వ్రాయలేదు."

ఆ మాటలు వింటూనే దిగులుపడిపోయారు వారిద్దరు.

"మీ స్కూల్లో హాజరు పిలిచినప్పుడు పేర్లు పిలుస్తూనే ఉండి ఉంటారు కదా. జ్ఞాపకం తెచ్చుకో నిన్ను ఏమని పిలిచేవారో?" అంటూ అడిగాడు ప్రకాష్.

"నాకు జ్ఞాపకమే..."

'హమ్మయ్య' అని గట్టిగా ఊపిరి తీసుకుంటూ "అయితే, ఏమని పిలిచేవారో చెప్పు?" అన్నాడు ప్రకాష్.

"మాకు రోల్ నెంబర్తో పిలిచే హాజరు వేసేవారు. ఏ మాస్టరు ఏ స్టూడెంట్ ని పేరు పెట్టి పిలవొద్దని హెడ్మాస్టర్ గారి ఆర్డర్ ఉండేది!"

"అదేమీటి?" అంది పల్లవి.

"ఏమో నాకే కాదు, నాతో చదువుకున్న ఎవరికీ తెలీదు!"

కొద్దిసేపటి తరువాత "నీతో చదువుకున్న స్నేహితులు నిన్ను ఏమని పిలిచేవారు?" కొంచెం ఆశగా అడిగింది పల్లవి.


"మేము ఇద్దరమే స్నేహితులుండేవారం. ఒకరినొకరు 'నేస్తం' అనే పిలుచుకొనేవారం. నా పెళ్ళైన తరువాత ఆ నేస్తాన్ని చూసిందేలేదు!"

ఆఖరి ఆశగా, ప్రకాష్ "నాన్న బ్యాంకు ఖాతాలో నీ పేరుంటుందనుకుంటాను. చూడు అక్కా!"
అది చూసి.. "బ్యాంకు ఖాతా నాన్న పేరు మీద మాత్రమే ఉంది!" నిరాశగా అంది పల్లవి.
అది విన్న ప్రకాష్ "ఆ ఖాతా పుస్తకంతే. బ్యాంకుకి ఫోన్చేసి నామినేషన్ ఎవరి పేరు మీద ఉందో కనుక్కుంటాను!" అన్నాడు.
తీరా ఫోన్ చేస్తే 'అలాంటి వివరాలు ఎవరికీ చెప్పకూడదు. అయినా నామినేషన్ అసలు ఎవరి పేరు మీద కూడా లేదు' అన్న బ్యాంకు వాళ్ళ సమాచారం విని ప్రకాష్, పల్లవి పూర్తిగా హతాశులైపోయేరు.
బ్రహ్మాస్త్రంలాగ ఒక ఆలోచన వచ్చింది ప్రకాష్ కీ. "అక్కా, నాన్న ఇన్సూరెన్సు పాలసీ ఉంటుంది చూడు. అందులో అమ్మ నామినేషన్ విధిగా ఉంటుంది!" అన్నాడు.
లేవబోతున్న పల్లవిని వారించి, ఆవిడ "ఏమీ చూడక్కరలేదు. మీ నాన్న ఇన్సూరెన్సు చెయ్యడానికి ఎప్పుడూ ఇష్టపడలేదు. 'ఇన్సూరెన్సుకు కట్టే డబ్బులతో వర్తమానంలో ఇబ్బందిపడుతూ, భవిషత్తులో ఏదో డబ్బు వస్తుందనుకోవడేమిటి' అనేవారు" అంటూ పెదవి విరిచింది.
చివరి ఆశగా పల్లవి "అమ్మా నీ జాతకం ఎక్కడ ఉంటుందో చెప్పు, అందులో నీ పేరుండవచ్చు" అంది.
గంభీరమైన ఆ సమయంలో కూడా ఆవిడ నవ్వి "నీకు వయసైతే వచ్చింది కానీ, లోకజ్ఞానం రాలేదమ్మా!" అంది. ఆ మాటకు ఉక్రోషం వచ్చిన పల్లవి "అదేమిటమ్మా అలా అనేసేవు!" అంది.
"బిడ్డ పుట్టిన మూడో రోజున జాతకం వ్రాస్తారు. అందులో నక్షత్రనామం, మాసనామం పూరించి, వ్యావహారిక నామం దగ్గర కొంత ఖాళీ జాగా వదిలేస్తారు. ఎందుకంటే, ఆ జాతకం వ్రాసే సరికి ఇంకా నామకరణం అవాలి కాబట్టి."
"ఆల్బంలో అక్క పెళ్లి శుభలేఖ ఉంది. అందులో నీ పేరు ఉంటుంది" అని ఆల్బం తేవడానికి వెళ్ళబోతున్న ప్రకాష్ ని వారించి -- " శ్రీమతి & శ్రీ రామకృష్ణ దంపతుల ఏకైక పుత్రికారత్నం, అని ఉందందులో " అందావిడ.
మళ్ళా ఆవిడే "నువ్వు ఆల్బం అంటే గుర్తొస్తోంది. అందులో మొదటి పేజీలో మా పెళ్లి శుభలేఖ ఉంచేనని చెప్పేరు మీ నాన్న. అదికానీ ఉంటే, అందులో నా పేరు ఉంటుంది" అనగానే ఆల్బం తేవడానికి లోపలి గదిలోకి పరిగెట్టేడు ప్రకాష్. బాగా పాతబడిన ఆల్బంలో చిరిగిపోతున్న పెళ్లి కార్డ్ లో మెరుస్తూ కనబడిన పేరు చూస్తూనే ప్రకాష్ కళ్ళలో వెలుగు కనబడింది.
"వద్దురా.. అమ్మకి 'అమ్మ' పేరే బావుంది. పేరు పెట్టి పిలవడంలో తృప్తి కనపడటం లేదు! ఆ ప్రయత్నం ఇక వద్దురా! అమ్మ పేరు తెలుసుకుని ఆవిడకి పింఛను తెప్పించడం కంటే.. ఆవిడని మనం అమ్మగా చూసుకుంటేనే ఆనందంగా ఉంటుందిరా! అమ్మకి మరో పేరు వద్దురా!" అంటూ వెనకాతలే వెళ్లిన పల్లవి కిటికీ తలుపులు తెరవగానే, ఆ గదంతా వెలుతురు ధారాళంగా ప్రసరించింది.

***0***

# విచిత్ర బంధం

సి. ఎన్. చంద్రశేఖర్



"శృతిగారూ. శుభోదయం. ఇంత ఉదయాన్నే వాట్సాప్ సందేశం పంపిన ఈ క్రొత్త వ్యక్తి ఎవరా అని ఆలోచిస్తున్నారా? కనుక్కోండి చూద్దాం. మీకు ఓ చిన్న క్లూ ఇస్తాను. మనం ఈమధ్య ఓ ఫంక్షన్ లో కలిశాం. ఒకరికొకరు పరిచయం చేయబడ్డాము. ఆ తర్వాత మీరు నా దగ్గరికి వచ్చి నాకో కాంప్లిమెంట్ ఇచ్చారు. ఇవి చాలనుకుంటా నేనెవరో కనుక్కోవడానికి. మీకు సరిగ్గా ఇరవైనాలుగు గంటల సమయం ఇస్తున్నాను. చాలు కదూ"

"..............."

"శృతిగారూ. గుడ్ మార్నింగ్. మీకిచ్చిన గడువు అయిపోయింది. నేనెవరో చెప్పేస్తున్నా. నా పేరు వైభవ్. గత ఆదివారం సాయంత్రం భరత్, శ్రావణిల పెళ్ళి రిసెప్షన్ కి మీరొచ్చారు. శ్రావణిని గ్రీట్ చెయ్యడానికి స్టేజిపైకి వచ్చారు.. అప్పుడు నేను భరత్ ప్రక్కనున్నాను. శ్రావణి మిమ్మల్ని భరత్ కి పరిచయం చేస్తే భరత్ నన్ను మీకు పరిచయం చేసాడు. మీరు నవ్వుతూ నావైపు చూస్తూ చేతులు జోడించారు. నేనూ నవ్వుతూ ప్రతినమస్కారం చేసాను. మీరు స్టేజి దిగి వెళ్ళిపోయినా అందమైన మీ రూపం, అంతకంటే అందమైన మీ నవ్వు నన్ను వెంటాడసాగింది. అందుకే మిమ్మల్ని వెదకుతూ బయలుదేరాను. ఓ చోట మీరు మీ స్నేహితురాళ్ళతో మాట్లాడుతూ కనిపించారు. మీ దృష్టి నావైపు మరల్చడమెలా అని ఆలోచించాను. వెంటనే ఉపాయం స్ఫురించింది. దగ్గర్లో భరత్ బంధువులు పాటలు పాడుకుంటూంటే వారిని అభ్యర్థించి మైక్ అందుకుని పాట పాడసాగాను. ఏ పాటో గుర్తుందా? మన్మధుడు సినిమాలోని 'నేను నేనులా లేనే నిన్న మొన్నలా' పాట. నిజంగానే మిమ్మల్ని చూసినప్పట్నుంచీ ఏదో క్రొత్త లోకంలో నేనున్నట్లు నాకు అనిపించసాగింది. అంతమంది ముందు పాడటానికి నాకు ధైర్యం ఎలా

వచ్చిందని మీకు అనుమానం వచ్చింది కదూ. నేను గాయకుణ్ణి. ఊర్లోని కొన్ని ఆర్కెస్ట్రా టీములతో కలిసి పాడిన అనుభవం ఉంది. మంచి ఫీల్ తో పాడిన ఆ పాటకు అందరితో పాటు మీరూ ముగ్ధులయ్యారు. నా దగ్గరికి వచ్చి "చాలా బాగా పాడారండీ" అంటూ చేయి అందించారు. 'ఆ సున్నితమైన చేయి జీవితాంతం నా చేతిలో ఉండిపోతే ఎంత బాగుంటుంది?' అనుకున్నాను. తీయటి అనుభూతికి లోనై మీకు థాంక్స్ కూడా చెప్పలేదు నేను. తర్వాత తేరుకుని చూస్తే మీరు కనిపించలేదు. అందరి అభినందనలు, నా ధన్యవాదాలు పూర్తయ్యాక మీకోసం హాలంతా వెతికాను. మీరు కనిపించలేదు. డైనింగ్ హాల్ లోనూ మీరు లేరు. తర్వాత బయటికి వచ్చి చూస్తే మీరు హోండా ఏక్టివా బండిపై వెళుతూ కనిపించారు. నా ప్రాణం ఉసూరనిపించింది. అయితే బుర్ర మాత్రం చురుకుగా పనిచేసింది. మీ బండి నెంబర్ నా సెల్ లో సేవ్ చేసుకుని, మరుసటి రోజు ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ లో పనిచేసే నా స్నేహితుడికి ఆ నెంబర్ పంపితే అతను వారి రికార్డ్స్ లో ఉన్న మీ ఫోన్ నెంబర్ని నాకు పంపాడు. అదండీ సంగతి. ఇదే సన్నివేశాన్ని మీవైపు నుంచి ఎలా వివరిస్తారో తెలుసుకోవాలని ఉంది. ప్రయత్నించరూ... ప్లీజ్"

"..........."

"వారం రోజులపాటు మీనుంచి ఉలుకు కోసం, పలుకు కోసం చూశానండీ. రెండూ లేవు! మీరు నా మెసేజస్ చూడలేదా అంటే.. అదీ కాదు. మీరు చూసినట్లుగా రెండు నీలిగీతలు కనిపిస్తూనే ఉన్నాయి. నేను మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నానా? ప్లీజ్. చెప్పండి. ఒకరిని ఇబ్బంది పెట్టి ఆనందించే నైజం కాదు నాది. ఇబ్బందంటే గుర్తొచ్చింది. మన ఊరినుంచి ఇరవై కిలోమీటర్ల దూరంలోని ఓ బ్యాంక్ బ్రాంచిలో నేను పనిచేస్తున్నాను. ఉదయం ఎనిమిది గంటలకు, తొమ్మిదికి, తొమ్మిదిన్నరకి బస్సులున్నాయి. ఎనిమిది గంటల బస్సుకు వెళితే మరీ ముందరగా బ్యాంక్ చేరిపోతాను. తొమ్మిదిన్నర బస్సుకు వెళితే టైముకు చేరిపోవచ్చు. కానీ బస్సు రావడం లేటైతే బ్యాంకుకి లేటవుతుంది. గత ఎనిమిదేళ్ళుగా ఏరోజూ బ్యాంకుకి లేటుగా వెళ్ళని రికార్డ్ నా పేరున ఉంది. తొమ్మిది గంటల బస్సు ఓ ప్రైవేటు బస్సు. అదో పుష్పక విమానం. కండక్టర్ ఎంతమంది ఎక్కినా ఎక్కించుకుంటూ ఉంటాడు, ప్యాసింజర్లని ముందుకు వెళ్ళమని గదమాయిస్తూ ఉంటాడు. ఓ రోజు బస్సు మధ్యలో నేనున్నాను. నాముందు ఓ యువతి ఉంది. ఆవిడ కూడా నాలా రోజూ ఆ బస్సులోనే ప్రయాణం చేస్తూంటూంది. నేను ఆవిడని దాదాపు అతుక్కుని ఉన్నాను. ఆ పరిస్థితి నాకు చాలా ఇబ్బందికరంగా ఉంది. కాని వెనక్కి జరిగే అవకాశమే లేదు, నా వెనుక అంతమంది జనం ఉన్నారు. ఆవిడ నావైపు విసుగ్గా చూస్తూ "కాస్తా వెనక్కి వెళ్ళరా?" అంది. నాకు చాలా అవమానంగా అనిపించింది. నా వెనక నిల్చునతన్ని బలంగా వెనక్కి నెట్టి నేను వెనక్కి జరిగాను. మరుసటిరోజు నుంచి ఎనిమిది గంటల బస్సులోనే ప్రయాణించడం మొదలుపెట్టాను. త్వరగా బ్యాంక్ చేరి పాటలు ప్రాక్టీస్ చేసుకోసాగాను. వారం రోజుల తర్వాత ఆవిడ కూడా ఎనిమిది గంటల బస్సు ఎక్కింది. నా ప్రక్క సీట్లో కూర్చుని "సారీ అండీ. మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను. ఆ రోజు మీరున్న పరిస్థితిలో నిన్న

నేనున్నాను. నా ముందు నిల్చున్నతను  నావైపు ఏవగింపుగా చూస్తే తలకొట్టేసినట్లైంది నాకు. ఆరోజు మీ పరిస్థితీ అర్ధమైంది. ఐ  యామ్ రియల్లీ సారీ" అంది. అప్పట్నుంచీ ఇద్దరం మంచి స్నేహితులైపోయాము.  నేను మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నానని మీరు భావిస్తే నాకు చెప్పెయ్యండి. అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలని మన పెద్దలన్నారు కదా!"

"..........."

"మీతో ఛాటింగ్ మొదలుపెట్టి అప్పుడే పదిహేనురోజులయ్యాయి. ఇద్దరూ మాట్లాడుకుంటేనే ఛాటింగ్ అనాలి కదూ? నో... నేను మీతో మాట్లాడటం మొదలుపెట్టి పదిహేనురోజులయ్యయి. నిన్న ఉదయం బైక్ పై వెళుతూంటే ఇద్దరు చిన్న పిల్లలు తల్లిని వదలి రోడ్డుకు అడ్డంగా పరుగెత్తుకొచ్చారు. వారిని కాపాడటం కోసం నేను ప్రక్కకెళ్ళి ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టి కిందపడ్డాను. భుజం దగ్గర విపరీతమైన నొప్పి. ఆ తల్లి తన పిల్లలను కాపాడినందుకు నా చేయి పట్టుకుని కృతజ్ఞతలు చెప్పడం, నేను బాధతో విలవిలలాడటం... తలచుకుంటే నవ్వొస్తూంది. చేతికి కట్టు కట్టిన డాక్టర్ 'హేర్ లైన్ ఫ్రాక్చర్ అయిందని,కొద్దిరోజులు బైక్ నడపవద్దని' చెప్పారు.

నిన్న సాయంత్రం గుడికి వెళదామని సిటీ బస్ ఎక్కాను. ఆ బస్సులో మీరున్నారు. రష్ గా ఉండటం వల్ల మీరు కూడా నాలాగే నిల్చుని ఉన్నారు. మీరు నన్ను చూడలేదు. నేను మిమ్మల్ని చూడటం ఆపలేదు. అయితే దేవతలాంటి మీరు అలా జనం మధ్యలో ఇరుక్కుని ప్రయాణం చేయడం నన్ను బాధించింది. బ్యాంకులో పెద్దస్థాయికి ఎదిగి, కారు కొని అందులోనే మిమ్మల్ని అన్నిచోట్లా త్రిప్పాలని నిశ్చయించుకున్నాను. మరి దేవి గారు ఏమంటారు?

"......................"

"మీతో మాటలు మొదలుపెట్టి నెలరోజులు అయ్యయి. మీనుంచి ఏ స్పందనా రాకపోతే నాలుగు రోజులు మెసేజ్ పెట్టకుండా ఉండిపోయాను. 'రోజూ మెసేజ్ పెట్టేవాడు ఏమైపోయాడు ఇన్నిరోజులూ?' అన్న కుతూహలంతోనైనా మీరు మెసేజ్ పెడతారని ఆశించాను. నాకు అంత అదృష్టం లేదని తెలిసిపోయింది. అయితే వదిరే నోరు, తిరిగే కాలు, మెస్సేజ్ ఇచ్చే వ్రేళ్ళూ ఊరకుండవు కదా? మీతో మాట్లాడాలని మనసు తొందర పెడుతూంటే సెల్ అందుకున్నాను. 'అస్తమానం ఆ సెల్ వైపు చూడకురా కళ్ళు పాడవుతాయీ అంటుంది మా అమ్మ. మీ మెస్సేజ్ కోసం ఎదురు చూసీ చూసీ కాయలు కాచిన నా కళ్ళను చూసి తను భయపడి ఉంటుంది. ఈ ప్రపంచంలో నాకున్న ఒకే ఒక బంధం, ఆధారం, ఆస్తి మా అమ్మ. ఎంత అందంగా ఉంటుందో అంత అందమైన మనసు మా అమ్మది. మా మధ్య ఏ దాపరికాలూ లేవు. మా నాన్న తనని మొదటిసారి కలసినప్పటి నుంచీ, పెళ్ళి కొడుకు పుట్టిన తర్వాత ఆయన ఎక్స్ ట్రా మారిటల్ రిలేషన్స్ గురించి విని, మనసు విరిగి, ఆయనకు దూరంగా వచ్చేయడం వరకూ మొత్తం నాతో చెప్పింది. నేను మిమ్మల్ని ఇష్టపడుతున్న విషయం, మీకు మెసేజులు  పంపే విషయం అమ్మకు తెలుసు. అంత పెద్ద

మెసేజులు సెల్ లో టైప్ చేసి పంపడం శ్రమ కదా అని అడిగింది ఓ రోజు. సిస్టంలో కూడా వాట్సాప్ ఓపన్ చేసుకోవచ్చని, కీబోర్డ్ పై టైపు చేసి పంపుతున్నానని చెబితే ఆశ్చర్యపోయింది. మిమ్మల్ని కోడలిగా చేసుకోవడానికి, కూతురుగా చూసుకోవడానికి తను ఉవ్విళ్ళూరుతూంది. మీరు రెడీయా?

“................”

"హలో శృతిగారూ!

మీతో మాట్లాడటం మొదలుపెట్టి మూడునెలలయ్యాయి. నాకు మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని చూడాలని అనిపిస్తుంది. కనీసం భరత్ దగ్గరికి వెళ్ళి తన పెళ్ళి రిసెప్షన్ ఫోటోల్లో మీరున్న ఫోటోని తెచ్చుకుని చూస్తూండవచ్చు. కాని మీ అనుమతి లేకుండా అలా చెయ్యడం సంస్కారం కాదు కనుక, ఆ పనులు చేయ్యలేదు. సంస్కారం అంటే గుర్తొచ్చింది... ఈ మధ్య ఓరోజు బ్యాంకులో నాకూ, మా మేనేజరుకూ మధ్య ఓ విషయం గురించి సీరియస్ డిస్కషన్ జరుగుతూంది. ఆ విషయంలో ఆయన చేసిన పొరబాటును నేను ఆయన దృష్టికి తెచ్చాను. దాంతో ఆయన ఇగో దెబ్బతింది. వెంటనే 'డోంట్ టాక్ నాన్ సెన్స్' అని నాపై అరిచాడు. నా కళ్ళలో నీరు తిరిగింది. నాకు ఊహ తెలిసినప్పటినుంచీ నేను ఎవరిచేతా మాట పడలేదు. తర్వాత 'ఆయన సంస్కారం అంతే' అని మనసుకు సర్ది చెప్పుకుని నా సీట్లోకొచ్చి పనిలో పడిపోయాను. మరుసటిరోజు మా అకౌంటెంట్ నా దగ్గరికి వచ్చి బ్రాంచిలో జరిగిన ఓ పెద్ద తప్పు వల్ల మేనేజర్ కి సస్పెన్షన్ ఆర్డర్స్ రాబోతున్నయని చెప్పాడు. నేను విషయం పూర్తిగా కనుక్కుని, మేనేజర్ దగ్గరికి వెళ్ళి ఇందులో బ్రాంచి తప్పేమీ లేదని, ఆ విషయానికి సంబందించిన ఉత్తరప్రత్యుత్తరాలన్నీ నేనే చూసుకున్నానని ఆయనతో చెప్పి, వాటిని ఫైల్లోంచి తీసి, కాపీలు తీయించి, మేనేజరు ద్వారా హెడ్డాఫీస్ కు పంపించాను. ఫలితంగా ఆయనకు శిక్ష తప్పింది. ఆయన నా చేతులు పట్టుకుని తన ఉద్యోగం కాపాడినందుకు కృతజ్ఞతలు చెప్పాడు . మనల్ని అవమానించిన వారిని ఎదురుదెబ్బ తీయడం కంటే వారిని దెబ్బల్నుంచి రక్షించడమే నిజమైన గెలుపని ఆరోజున నాకు తెలిసింది".

“....... ....”

"శృతిగారూ ఈనాటితో మీతో మాటలు మొదలుపెట్టి ఆరునెలలయ్యాయి. నా అభిరుచులు, ఆలోచనలు, అలవాట్లు, ఇష్టాఇష్టాలతో పాటు నాకు ఎదురైన అనుభవాలను కూడా మీతో పంచుకున్నాను. సాధారణంగా మా అమ్మతో తప్ప ఇంకెవరితోనూ నా విషయాలు పంచుకోను. కాని మిమ్మల్ని చూడగానే ఎన్నో ఏళ్ళుగా పరిచయం ఉన్న ఆత్మీయురాలిలా అనిపించారు. మీరు మీ గురించి ఏమీ చెప్పకపోయినా నాకు అన్నీ తెలిసినట్లే అనిపిస్తూంది. బహుశ దీన్నే 'బంధం' అంటారేమో"

“..............”

"మీకో శుభవార్త. నేను మీటీవీ 'పాటల పల్లకి 'ప్రోగ్రాంలో పాల్గొనడానికి ఎన్నికయ్యాను. గతంలో చాలా సార్లు సెలెక్షన్స్ లో మొదటి రౌండ్ లో ఎన్నికై తర్వాతి రౌండ్స్ లో ఎన్నికకాక తిరిగొచ్చేశాను. ఈసారి అన్ని

రౌండ్లూ నెగ్గి షూటింగ్ లో పాల్గొనడానికి అర్హుణ్ణయ్యాను. వారం రోజుల్లో షూటింగ్ మొదలవుతుంది. మూడునెలల తర్వాత టీవీలో వారం వారం ప్రసారమవుతాయి. దాదాపు సంవత్సరం పాటు మీరు నన్ను టీవీలో చూడొచ్చు, నా పాటలు వినొచ్చు. ఆ క్రెడిట్ అంతా మీదేనండీ! మిమ్మల్ని అన్ని రకాలుగా గెలవాలని, మీ మౌనం శబ్దంగా మారాలని నేను చేస్తున్న ప్రయత్నాల్లో ఇదొకటి. మీరు ప్రక్కన ఉంటే నేను ఏదైనా సాధించగలను. ఉంటారా?"

"………."

'తెలుసా….మనసా.. ఇది ఏనాటి అనుబంధమో'. ఈ రోజు స్టూడియోలో నేను పాడిన మొదటి పాట యిది. అందరూ చాలా బాగా పాడావని మెచ్చుకున్నారు. పాట పాడుతున్నంతసేపూ కనులముందు మీ రూపమే కదలాడింది. మిమ్మల్ని రిసెప్షన్ లో కలసిన క్షణం, మీరు నవ్వుతూ నమస్కరించడం, నన్ను తదేకంగా చూస్తూ నా పాట వినడం, నాతో కరచాలనం చేసి అభినందించడం…. అన్నీ గుర్తొచ్చాయి. వెంటనే మీ మౌనం కూడా గుర్తొచ్చి కంట నీరు తిరిగింది. మీ మౌనం రాగం అయ్యేదెప్పుడు?

"…………….."

"అంతా మట్టేనని తెలుసు, అదీ ఒక మాయేనని తెలుసు, తెలిసీ వలచీ విలపించుటలో…. తీయదనం ఎవరికి తెలుసు?" ఈ సీజన్లో నేను పాడిన చివరి పాట ఇది. నేను మీకు పంపిస్తున్న చివరి మెసేజ్ కూడా ఇదే. మీనుంచి స్పందన కోసం ఎదురు చూసి చూసీ అలసిపోయానండీ. నా ప్రేమ విషయంలో నేను చిత్తుగా ఓడిపోయాను. కాసేపట్లో ఈ సీజన్ ఫైనల్ విన్నర్ ఎవరో అనౌన్స్ చేస్తారు. అదెవరో తెలుసుకోవాలన్న ఆసక్తి నాకు లేదు. నా ప్రేమలో నేను ఫైనల్ గా లూజర్ గా నిలిచాను. ఇక మిమ్మల్ని మరచిపోవడానికి ప్రయత్నించాలి. అది అంత సులభం కాదు.. కాని తప్పదు. ఓ వ్యక్తి నుంచి ఆరునెలలుగా ప్రతిరోజూ మెసేజస్ అందుకుంటున్న వ్యక్తికి ఆ మెసేజస్ తో ఓ బంధం ఏర్పడి ఉంటుంది. ఇకపై మెసేజస్ రావు అనుకుంటే బాధగానూ అనిపించవచ్చు. అటువంటి బాధ మీకూ ఉంటే నాకోసం రెండు కన్నీటిబొట్లు రాల్చండి. ఇదే నా చివరి కోరిక కూడా!"

ఈ మెసేజ్ చదివిన శృతి వెక్కి వెక్కి ఏడవసాగింది.

***

కాలింగ్ బెల్ శబ్దం విని తలుపు తెరచిన శృతికి ఎదురుగా దాదాపు యాభై ఏళ్ళ వయసావిడ కనిపించిది. ముఖంలో మంచి కళతో ఉన్న ఆమెను చూడగానే గౌరవభావం కలిగింది శృతికి.

"శృతి అంటే నువ్వేనా?" ఆవిడే పలకరించింది మొదటగా!

అవునన్నట్లు తలూపింది శృతి.

"నేను వైభవ్ తల్లిని. నా పేరు శ్యామల!"

"ఓహ్. రండి. నిన్న ఫోన్ చేసి అడ్రస్ అడిగింది మీరేకదా. కూర్చోండి!" అంటూ ఇంటిలోపలికి ఆహ్వానించింది శృతి.

'ఇంత అందమైన అమ్మాయికి అంత కఠినమైన మనసును ఆ దేవుడు ఎందుకిచ్చాడో?' అనుకుంటూ సోఫాలో కూర్చుంది శ్యామల.

శృతికూడా కూర్చున్నాక "వైభవ్ నాకంతా చెప్పాడు. కానీ నాకో చిన్న అనుమానం ఉంది. అది నివృత్తి చేసుకోవడానికే నీ దగ్గరకు వచ్చాను!" అంది శ్యామల.

చెప్పమన్నట్టు చూసింది శృతి.

"నీకు వైభవ్ పట్ల ఆసక్తి లేదని నీ మౌనం వల్ల నాకు అర్థమైంది. ఆ విషయం వాడు మొదటి మెసేజ్ పంపినప్పుడే చెప్పిఉంటే వాడు అన్ని వందల మెసేజులు పంపేవాడు కాదుకదా? నీనుంచి 'నో' అన్న మాట రాలేదు కాబట్టి ఏదో ఒకరోజు 'ఎస్' అన్న జవాబు వస్తుందని ఆశగా ఎదురు చూసాడు. తన మనసంతా నిన్నే నింపుకున్నాడు. ఆరునెలల నిరీక్షణ తర్వాత ఆశ వదులుకున్నాడు. నిన్ను మరచిపోవడానికి వాడు పడుతున్న కష్టం చూస్తూంటే నా గుండె తరుక్కుపోతూంది" అంది శ్యామల కళ్ళనీళ్ళతో.

శృతి కళ్ళలో కూడా నీళ్ళు నిండాయి.

"నువ్వు చూస్తే మంచిదానిలా ఉన్నావు. వాడి విషయంలో అంత కఠినంగా ఎలా ఉండగలిగావు? పరిచయమైన ప్రతిఒక్కరి మనసును గెలుచుకునే తత్వం వాడిది. తను ఇష్టపడ్డ అమ్మాయిని గెలుచుకునే అదృష్టం వాడికి లేదా?"

"లేదు ఆంటీ. ఆ అదృష్టం మీ అబ్బాయికి లేదు!" అంది శృతి.

షాక్ తిన్నట్లు చూసింది శ్యామల శృతి వైపు.

తర్వాత "ఎందుకు లేదమ్మా? వాడికేం తక్కువ? వాడికి అందం ఉంది, చదువుంది, సంస్కారం ఉంది, ఉద్యోగం ఉంది, మధురమైన గాత్రం ఉంది. వాడు నీకు నచ్చకపోవడం ఏమిటి? నీ అభిరుచులకు తగినట్లు వాడు లేడా?" ఆవేశంగా అడిగింది శ్యామల.

"మీ అబ్బాయికేమండీ. మీరు చెప్పిన లక్షణాలతోబాటు మంచి మనసు కూడా ఉంది అతనికి. అయితే అతను ఇష్టపడిన శృతి ఈలోకంలో లేదు. ఐదునెలల క్రితం ఏక్సిడెంట్ లో మరణించింది"

శృతి చెప్పింది విన్నాక షాక్ తిన్నట్టు కూర్చుండిపోయింది శ్యామల. కొంతసేపటి తర్వాత తేరుకుని "అయితే నీవు శృతివి కావా?" అని అడిగింది.

"మీ అబ్బాయి మనసు పడిన శృతిని కాను"

అర్థం కానట్టు చూసింది శ్యామల.

"శృతి డిగ్రీలో నా క్లాస్ మేట్. ఇద్దరి పేర్లూ ఒకటే కావడంవల్ల మేము మరింత ఆప్తులయ్యాం. ఒకరి విషయాలు మరొకరితో పంచుకునేవాళ్ళం. వైభవ్ తన స్నేహితుని పెళ్ళిలో శృతిని చూసి మనసు పడ్డారు. అయితే అతను చేసిన చిన్న పొరబాటు నన్ను ఇబ్బంది పెట్టింది!"

ఏమిటన్నట్టు చూసింది శ్యామల.

"శృతి బైక్ పై వెళుతూంటే వైభవ్ ఆ వెహికల్ నెంబర్ నోట్ చేస్కుని, తన స్నేహితుని సహాయంతో ఆ వెహికల్ ఓనర్ ఫోన్ నెంబర్ తెలుసుకుని, ఆ నెంబరుకు వాట్సాప్ లో మెస్సేజస్ ఇవ్వసాగారు"

"ఆ విషయం నాతో కూడా చెప్పాడు వాడు"

"మీ ఇద్దరికీ తెలియని విషయం ఒకటుంది! ఆ వెహికల్ ఆ శృతిది కాదు... నాది. వైభవ్ పంపిన మెసేజులు నాకు వచ్చాయి. నాకు విషయం అర్థమై వాటిని శృతికి పంపాను. తను చాలా ఇంప్రెస్ అయింది. అయితే ఆమెకు తన తండ్రి అంటే చాలా భయం. అందుకే వెంటనే స్పందించలేదు. నేను ధైర్యం చెబితే అతని ప్రేమను అంగీకరించడానికి నిర్ణయించుకుంది. అంతలోనే ఏక్సిడెంట్ లో తను మరణించింది"

బాధగా కళ్ళు మూసుకుంది శ్యామల.

"శృతి పోయిన షాక్ నుంచి తేరుకోవడానికి నాకు నెలరోజులు పట్టింది. వైభవ్ నుంచి మెసేజులు వస్తూంటే ఎలా ఆపాలో నాకు అర్థం కాలేదు. తను ప్రాణంలా ప్రేమిస్తున్న వ్యక్తి ఈ లోకంలో లేదని తెలిస్తే వైభవ్ ఏమవుతారో అని భయం వేసింది. నేను మౌనంగా ఉండిపోతే ఏదో ఒకరోజు తనే విసిగిపోయి మనసు మార్చుకుంటారని భావించాను".

"ఎంత గొప్ప మనసమ్మా నీది. నా బిడ్డ గురించి నాకంటే ఎక్కువగా ఆలోచించావు. నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను"

"అయ్యో. అంత పెద్ద మాటలెందుకు ఆంటీ? ఇంతకూ వైభవ్ ఆ టీవీ ప్రోగ్రాం ఫైనల్స్ లో విజేతగా నిలిచారా?" ఆసక్తిగా అడిగింది శృతి.

"అవును. కప్పుతో పాటు ప్రైజ్ మనీగా పది లక్షలు ఇచ్చారు.ఈ విషయం టీవీలో వచ్చేదాకా ఎవరితో చెప్పవద్దన్నారు. నువ్వు మాకు ఆత్మీయురాలివి కాబట్టి, ఎవరితో చెప్పవనే నమ్మకం ఉంది కాబట్టి నీకు చెబుతున్నాను. ఇంకో గుడ్ న్యూస్. ఫైనల్ ఎపిసోడ్ కి న్యాయ నిర్ణేతగా వచ్చిన ప్రముఖ సంగీత దర్శకుడు విశాల్ రామన్ తన తదుపరి సినిమాలో రెండు పాటలు వీడితో పాడిస్తానని అందరి ముందు మాటిచ్చారు. ఈ విజయం నీవల్లే వచ్చింది. నువ్వు వాణ్ణి ఇంతవరకూ కాపాడటంవల్లే వచ్చింది. ఇక నేను వాడి దృష్టి కెరీర్ వైపు మళ్ళిస్తాను" అంటూ లేచి నిలబడి అడిగింది "అలాగే. మీ అమ్మానాన్నా ఇంట్లో లేనట్లున్నారు"

"డాక్టర్ దగ్గరికి వెళ్ళారు. వచ్చేస్తూ ఉంటారు కూర్చోండి"

"ఫర్వాలేదమ్మా. ఇంకోసారి వచ్చినప్పుడు కలుస్తాలే. వైభవ్ కి హైదరాబాదుకు ట్రాన్స్ ఫర్ అయింది. మలక్ పేట బ్రాంచికి వేసారు. అక్కడైతే ఉద్యోగం చేసుకుంటూనే పాటల రికార్డింగ్స్ కూడా చేసుకోవచ్చని వాడి ఆలోచన!" అంది శ్యామల.

"మంచి నిర్ణయం. ఆల్ ది బెస్ట్" అంది శృతి.

"అడగడం మరిచాను. నువ్వేం చేస్తున్నావు?"

"నేను బెంగళూర్ లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాను"

"చాలా సంతోషం. నిన్ను చాలా ఇబ్బంది పెట్టాం. మా ఇద్దరి తరపున క్షమాపణలు నీకు!"

"అయ్యో ఎందుకండీ. నేను మౌనంగా ఉండి అంత మంచి మనిషిని మోసం చేశానన్న గిల్టీ ఫీలింగ్ నాలో ఉంది"

శ్యామల గేటు వరకూ తనతో వచ్చిన శృతితో "నిన్ను చూడగానే చాలా నచ్చావు నాకు. నువ్వే శృతి అనుకుని నిన్ను ఎలాగైనా మా వైభవ్ తో పెళ్ళికి ఒప్పించి వెళ్ళాలని అనుకున్నాను. నేను అనుకున్నది ఒకటి, జరిగింది మరొకటి!" అంది నిరుత్సాహంగా.

"అంతా మంచే జరుగుతుంది. మీరు ధైర్యంగా ఉండండి" అంది శృతి.

***

ఓ సంవత్సరం తర్వాత ఓ రోజు రాత్రి భోజనాలయ్యాక ఈజీచైర్లో కూర్చుని పుస్తకం చదువుకుంటున్న శ్యామల దగ్గరికి వచ్చిన వైభవ్ "అమ్మా. నీతో ఓ పదినిమిషాలు మాట్లాడాలి!" అన్నాడు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ.

"చెప్పు నాన్నా!" అంది పుస్తకం మూసి ప్రక్కనున్న స్టూల్ పైన పెడుతూ.

"అమ్మా. నాకు ఈ మధ్య ఓ అమ్మాయి పరిచయమైంది. తను మా బ్యాంక్ కస్టమర్లతో నా మాటతీరు, వారి పనులు పూర్తిచేసే పద్ధతి బాగుందంటూ కాంప్లిమెంట్ ఇచ్చింది ఓ రోజు. మా పరిచయం స్నేహంగా మారింది. మా అభిప్రాయాలూ, అభిరుచులూ కలిసాయి. తనకు సంగీతమంటే చాలా ఇష్టం. నేను గాయకుడినన్న విషయం తెలుసుకుని టీవీలో నా ప్రోగ్రాంలు చూసి నాతో తన అభిప్రాయాలు పంచుకునేది. క్రమంగా మా స్నేహం ప్రేమగా మారింది. ప్రతి విషయం నీతో పంచుకునే నేను ఈ విషయం నీకు చెప్పలేదు.. శృతి విషయంలో నాతో పాటు నువ్వూ నిరుత్సాహానికి గురయ్యావు. అందుకే ఈసారి పెళ్ళిదాకా వచ్చాకే నీకు చెబుదామని ఆగాను. రేపు తను మన ఇంటికి వస్తుంది. చూసి నీకు నచ్చితే మమ్మల్ని ఆశీర్వదించు!"

"నీకు నచ్చితే నాకూ నచ్చినట్లే. మంచి వార్త చెప్పావు నాన్నా!" అంది శ్యామల సంతోషంగా.

మరుసటిరోజు వైభవ్ తో పాటు తమ ఇంట్లో అడుగుపెట్టిన అమ్మాయిని చూసి శ్యామల ఆశ్చర్యపోయింది.

"అమ్మా. తను శృతి....మా అమ్మ!" అంటూ పరిచయాలు చేసాడు వైభవ్.

''నమస్తే" అంటూ చేతులు జోడించింది శృతి.
అయోమయంగా తల పంకించింది శ్యామల.
"అమ్మా. వీళ్ళ ఊరు కూడా నెల్లూరేనట. బెంగళూరులో ఉద్యోగం చేస్తూ ట్రాన్స్ ఫర్ మీద హైదరాబాద్ వచ్చిందట!" అన్నాడు వైభవ్.
శ్యామలను చూసి కొంటెగా నవ్వింది శృతి.
శ్యామలకు జరిగింది అర్థమైంది. వెంటనే హాయిగా నవ్వేసింది.

***0***

# వంచన



## కొయిలాడ రామ్మోహనరావు

“డాడీ హఠాత్తుగా చనిపోవడంతో నా జీవితంలో చాలా మార్పులొచ్చాయి. ఆయన చనిపోయాకే తెలిసింది, ఎన్నో అప్పులున్నాయని. వ్యాపారంలో బాగా దెబ్బతిన్నా, అదే స్టేటస్ కొనసాగిస్తూ ఉండడంతో, నాకు ఏ విషయమూ తెలియలేదు. అమ్మ, నా చిన్నతనంలోనే చనిపోయింది. అప్పటినుంచి ఆయన నన్ను ఎంతో అల్లారుముద్దుగా పెంచారు. ముంబైలో పెద్ద ఇల్లు, మూడు కార్లు, విశాఖపట్నంలో ఒక అపార్టుమెంట్, అనకాపల్లిలో పది ఎకరాల మాగాణీ, ఒక్కసారిగా అప్పుల వాళ్ళ చేతిలోకి పోవడంతో నేను, దాదాపు రోడ్డున పడ్డాను. నా రీసెర్చ్ మధ్యలోనే ఆపేసి, మా చిన్నాన్నతో విశాఖపట్నం వచ్చేయాల్సి వచ్చింది. చిన్నాన్న బేంక్ మేనేజర్ గా పనిచేస్తూ, ఏదో స్కామ్ లో ఇరుక్కుని, సస్పెన్షన్ లో ఉన్నారు. ఆయనకు ఇద్దరు కొడుకులు. ఆస్తంతా తగలేసి, ఇద్దరినీ చదివించినా, వాళ్ళిద్దరూ పెద్దగా సెటిల్ కాలేదు. చిన్నాన్న ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడం వల్ల, నేను వాళ్లకు గుదిబండను అయ్యానని తరచూ బాధపడుతూ, ఉద్యోగం కోసం గట్టి ప్రయత్నం చేస్తున్నాను. నేను చదువుకున్నది ‘ఆంత్రపాలజీ’ కావడం వల్ల, ఉద్యోగం అంత తొందరగా దొరుకుతుందనే ఆశ పెద్దగా లేదు. చిన్నాన్న, పిన్ని, తమ్ముళ్లు చాలా మంచివాళ్ళు. అదే నాకు ఊరట.

విధి చాలా విచిత్రమయినదని నాకు తెలుసు. అది నాతో ఇలా ఆడుకుంటుందని, నా జీవితాన్ని ఇలా మలుపులు తిప్పుతుందని నేనెన్నడూ ఊహించలేదు. మా డాడి పెద్దకర్మ రోజున నా జీవితం రెండో మలుపు తిరిగింది. ఆ రోజు సాయంత్రం మా చిన్నాన్న నా దగ్గరకు వచ్చి, "ఒక శుభవార్తమ్మా. అన్నయ్య నీకు అన్యాయం చేసిపోయాడని నేను, పిన్ని అనుకుంటూ ఉండేవాళ్లం. కానీ వాడు చేసిన మంచి పనులే ఈ రోజు నీకు శ్రీరామరక్ష అయ్యాయమ్మా" అంటూ చెప్పుకుంటూ పోతుంటే, అయోమయంగా చూసాను. "ఏం లేదమ్మా నారాయణరావు మాస్టారు తెలుసు కదా?" అన్నాడు. తెలుసన్నట్లు తల ఊపాను. ఆయన అనకాపల్లిలో హెడ్ మాస్టర్ గా పనిచేస్తూ, ఈ మధ్యనే రిటైర్ అయ్యారు. ఆయనే అనకాపల్లిలో ఉన్న మీ పొలాలను చూసేవారు. "ఈరోజు ఆయన, మీ డాడీ చేసిన సహాయాల గురించి చెపుతూ, వాడికి వాళ్ళ కుటుంబం ఎంతో రుణపడి ఉందని, ఉడతా భక్తిగా తన రెండో తమ్ముడు 'విజయ్' కి నిన్నిచ్చి పెళ్లి చేయాలని అనుకుంటున్నారని చెప్పగానే మా సంతోషానికి హద్దు లేకుండా పోయింది. ఫంక్షన్ కి వచ్చిన వారందరూ తెగ ఆనందపడ్డారు. నువ్వు చాలా అదృష్టవంతురాలివమ్మా. విజయ్ చాలా మంచివాడు. స్టీల్ ప్లాంట్ లో ఇంజినీర్ గా పనిచేస్తున్నాడు. నీ లైఫ్ సెటిల్ అయిపోయినట్లే" అంటుంటే చిన్నాన్న ముఖం సంతోషంగా వెలిగిపోతుంది. పిన్ని కూడా అంతే ఆనందంలో ఉంది. నేను మాత్రం ఎగిరి గంతేయలేదు. 'అవును అనడానికి, కాదు అనడానికి' నాకు ఏ ఆప్షన్ లేదని మాత్రం అర్థం అయింది. మౌనంగా తలూపాను. నేను అడ్డు చెప్పకపోయేసరికి, వాళ్ళు మరింత సంతోషపడిపోయారు.

అలా నా ప్రమేయం లేకుండానే, విజయ్ తో నా పెళ్లి జరిగిపోయింది. అతను పనిచేసేది స్టీల్ ప్లాంట్ లో కాబట్టి, మేమిద్దరం 'వైజాగ్'లో కాపురం ఉంటామనే ఆలోచనలో ఉన్న నేను, 'అనకాపల్లి' లో ఉమ్మడికుటుంబంలో ఉండాలన్న వాస్తవాన్ని సులువుగా జీర్ణించుకోలేకపోయాను. అదొక్కటే కాదు నన్ను నిరాశపరచిన సందర్భాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడం మొదలుపెట్టాయి.

విజయ్ పెద్ద అనాకారి కాదు గానీ, అతనిలో స్మార్ట్ నెస్ అన్నది ఏ కోశానా కనిపించదు. కళ్ళజోడు దగ్గర్నుంచి కాలి బూట్ వరకూ, ఎక్కడా స్టైల్ అనేది కనిపించదు. దానికి తోడు అతి మంచితనం, అతి మెతకదనం అతన్ని ఒక 'దద్దమ్మ'లా చేసాయి అనిపిస్తుంది. ఆఫీసులో బాస్, కొలీగ్స్, వాళ్ళ పనులు ఇతనికే అంటగడుతున్నారని నాకు అర్థమయింది. కొన్ని రాత్రుళ్లు, సెలవు రోజులు ఆ పనులతోనే ఇంటి దగ్గర కుస్తీపడుతుంటే నాకు జాలి అనిపించేది కాదు. అతని చేతకానితనానికి కోపం వచ్చేది. అది మాత్రమే కాదు. ఇంట్లో కూడా అతన్ని శుభ్రంగా వాడుకుంటున్నారని నాకు తొందరగానే అర్థమయింది.

మాతో పాటూ ఆ ఇంట్లో మరో రెండు కుటుంబాలున్నాయి. మొదటిది మా పెద్ద బావ గారు నారాయణరావు గారిది. ఆయన భార్య 'వేదవతి'. పిల్లలు 'అనిల్, అఖిల'. రెండో బావగారు 'ఓంకార్'. ఆయన ఆర్టీసీ లో డ్రైవర్ గా పనిచేస్తున్నారు. 'సవిత' ఆయన భార్య. వాళ్లకు ఒకే ఒక కూతురు 'రేవతి'. వేదవతి చాలా గడుసయినది. వంటంతా సవిత చేత చేయిస్తుంది. ఆమెకు సాయం చేయడం నా డ్యూటి. ముంబై లాంటి మహానగరంలో

'మహారాణిలా' బతికిన నేను 'అటు పట్నమూ కాని, ఇటు పల్లెటూరూ కాని' అనకాపల్లిలో ఇలా మగ్గిపోతానని కలలో కూడా అనుకోలేదు.

సాయంత్రం అలిసిపోయి ఇంటికొచ్చిన విజయ్ కాఫీ తాగి, ఇంట్లోకి కావలసిన సరుకులు తేవడానికి బయల్దేరుతుంటే నాకెంతో బాధగా ఉండేది. 'ఆ పనులు చేయడానికి అతనే ఎందుకు వెళ్ళాలి?' అన్న నా ప్రశ్నకు సమాధానం ఉండేది కాదు. పెద్ద బావగారి పెద్దరికం, రెండో బావగారు అందుబాటులో లేకపోవడం, పిల్లలకు ఈ పనులు అప్పజెపితే వాళ్ళ చదువు పాడవుతుందనే మిష ...ఇలా చెప్పుకోవడానికి ఎన్నో కారణాలు కనిపిస్తున్నాయి. ఐఐటి కి ప్రిపేర్ అవుతున్న అనిల్ కి, టెన్త్ చదువుతున్న అఖిలకూ రాత్రుళ్లు ట్యూషన్ చెప్పే బాధ్యత విజయ్ దే కావడం నన్ను మరింత బాధించేది. ఇలాంటి సమస్యలతో నా సంసారంలో 'తీపి' సహజంగానే లోపించింది. శృంగార జీవితం కూడా అంతంత మాత్రంగానే ఉండడం 'పుండు మీద కారం జల్లినట్లుగా' ఉండేది నాకు.

పిల్లలకు ట్యూషన్ చెప్పి వచ్చేసరికి ఒక్కోసారి బాగా లేటయ్యేది, విజయ్ కి. అప్పటికే నిద్రలో జారుకున్న నేను మంచం మీద అడ్డదిడ్డంగా పడుకునేసరికి, అతను పడుకోవడానికి చోటు ఉండేదికాదు. నన్ను లేపి జరగమనడానికి మొహమాటపడి, అతను కిందనే పడుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఉదయం లేచిన తర్వాత ఆ విషయం తెలుసుకున్న నేను సిగ్గుతో చచ్చిపోయేదాన్ని. 'అయ్యయ్యో కింద పడుకున్నారా? లేపవలసిందిగా?' అని అంటే నవ్వేసి ఊరుకునేవాడు.

అనూహ్యంగా నాలోనూ మార్పు రావడం మొదలయింది. మెల్ల మెల్లగా, నాకు తెలియకుండానే పరిస్థితులకు అలవాటుపడడం మొదలుపెట్టాను. క్రమక్రమంగా విజయ్ కి చేరువకాసాగాను. అతన్ని మార్చాలని, ఇతరుల ఒత్తిడి అతని మీద పడకుండా చేయాలని, కాస్త గడుసుగా ప్రవర్తించే తీరు అలవాటు చేయాలని కంకణం కట్టుకున్నాను. ఈలోగా ట్రైనింగ్ నిమిత్తం రెండు నెలల పాటూ విజయ్ 'కలకత్తా' వెళ్ళాల్సిన పనిపడింది. ఇప్పుడిప్పుడే అతని మీద ఇష్టం పెంచుకుంటున్న నాకు, అతన్ని వదలడం బాధగా ఉంది. అయినా తప్పదుగా?

ఈ ఎడబాటు వల్ల మా మధ్య ప్రేమ ఇంకా బలపడుతుందని ఆశిస్తున్న సందర్భంలో, నా జీవితం మరో మలుపు తిరిగింది. నా కుడి కంటికేదో ఇన్ఫెక్షన్ రావడంతో మా బావగారు 'రవికాంత్' అనే స్పెషలిస్ట్ దగ్గరకు తీసుకెళ్ళారు. చికిత్స కోసం చాలాసార్లు అతని దగ్గరకు వెళ్లాల్సివచ్చేది. ఆ డాక్టర్ అందగాడు, చలాకీ అయినవాడు. నాకు తెలియకుండానే అతని ఆకర్షణలో పడిపోయాను. ఇలాంటి డాక్టర్ నే చేసుకోవాలని, పెళ్ళికి ముందు ఆశపడేదాన్ని. ఒకరోజు మాటల సందర్భంలో ఆయన అడిగాడు "మీరు నిరంజన రావు గారి అమ్మాయి కదూ?" అని. నేను ఆశ్చర్యపోతూ తలూపి "మా డాడీ మీకు తెలుసా?" అంటూ ప్రశ్నించాను. "పరిచయం లేదు. కానీ ...." అంటూ సందేహిస్తూ మాట మార్చి "ఇప్పుడు మీకు ఎలా ఉంది, కంటి నెప్పి తగ్గిందా?" అని అడిగాడు. అతనేదో దాస్తున్నాడని, కావాలనే టాపిక్ మార్చాడని నాకు

అనిపించింది. ఆ మాటే అడిగాను. "అబ్బే ...అవన్నీ ఇప్పుడెందుకులెండి" అంటూ తుంచేసినా నేను వదలలేదు. "మీరు ఏదో చెప్పాలని అనుకుంటున్నారు. అదేమిటో చెప్పండి" అని మొండికేసాను. అతను ఎందుకో ఇబ్బందిగా కదిలాడు. చెప్పలేక నసుగుతున్నాడు. నాలో సస్పెన్స్ పెరిగిపోతుంది. నేను ఒత్తిడి చేయడంతో మెల్లగా పెదవి విప్పాడు. "రెండేళ్ల క్రితం మిమ్మల్ని ఒక పెళ్ళిలో చూసాను...." అంటూ మళ్ళీ ఆపేసి "ఎందుకులెండి...ఆ విషయాలన్నీ ...చెప్పుకోవడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది" అన్నాడు దాటవేస్తూ. నేను ఒప్పుకోలేదు. చెప్పమని బలవంతం చేసాను. తటపటాయిస్తూ నెమ్మదిగా అసలు విషయం బయటపెట్టాడు. "మిమ్మల్ని చూసినప్పుడే మనసు పడి, మీ గురించి ఎంక్వయిరీ చేసాను. 'మీతో మేము తూగలేమని మా బంధువులు చెపుతున్నా వినకుండా మా మామయ్యను ముంబై పంపాను, సంబంధం మాట్లాడమని. అతను మీ ఇంటికొచ్చి, మీ ఆస్తి, అంతస్తు చూసి, ఆ విషయం ఎత్తలేక, తిరిగి వచ్చేసాడు. నేనెంతో నిరాశపడి, ఏడాది పాటూ పెళ్లి ప్రయత్నాలు మానుకున్నాను. ఆ తర్వాత ఇంట్లో వాళ్ళ బలవంతం మీద పెళ్లి చేసుకున్నాను" అంటూ తలెత్తకుండా చెప్పుకుంటూ పోతున్న అతన్ని చూస్తూ ఉండిపోయాను. 'ఎంత అద్భుతమయిన అవకాశం చేజారిపోయింది' అనుకోగానే నా మనసు భారంగా మూలిగింది. నేనేమీ మాట్లాడక పోయేసరికి అతను తలెత్తి చూసాడు. అతని మనసులోనూ తీవ్రమయిన బాధ ఉన్నట్లు అతని ముఖమే చెపుతుంది. ఇద్దరం ఒకరంటే మరొకరం ఇష్టపడుతున్నామని స్పష్టమయిపోయింది. అయితే పరిస్థితి చేజారిపోయిందన్న బాధ ఇద్దరిలోనూ కలిగింది. తన్నుకొస్తున్న దుఃఖాన్ని అదుపులో పెట్టుకోలేనని అనిపించింది నాకు. అందుకే చివాలున పైకి లేచి, విసురుగా బయటకు వచ్చేసాను. ఆ రోజంతా రవికాంత్ ఆలోచనలే. 'విధి నాతో ఎందుకిలా ఆడుకుంటుంది?' అనుకుంటూ విలపించని క్షణం లేదు.

వారం రోజుల తర్వాత గానీ రవికాంత్ ని కలవలేకపోయాను. మనసు దిటవు చేసుకొని మామూలుగా ఉండడానికి ప్రయత్నించాను. అంతకుముందు ఏమీ జరగనట్లే మాట్లాడుకున్నాం. ఆ రోజు పేషెంట్ల రద్దీ ఎక్కువగా లేనందున, అక్కడ ఎక్కువసేపే కూర్చున్నాను. మా ఇద్దరి అభిప్రాయాలూ బాగా కలిసాయి. కాసేపట్లోనే మేమిద్దరం ఎంతో దగ్గర అయినట్లు ఫీలయ్యాను. బయల్దేరడానికి సిద్ధపడుతూ వాచ్ చూసుకుంటుంటే, 'అప్పుడే వెళ్ళిపోతావా?' అన్నట్లు చూసాడు. ఆ చూపు నాలో కలకలం రేపింది. నన్నెంతగా ఇష్టపడుతున్నాడో తెలిసేసరికి నా మనసు ఉప్పొంగిపోయింది. అప్పటినుంచి మేమిద్దరం తరుచుగా కలుస్తూనే ఉన్నాం. నా కంటి వ్యాధి మాకు ఆ అవకాశాన్ని ఇచ్చింది. వ్యాధి తగ్గిపోయినా, ఫోన్ కాల్స్, మెసేజ్ ల ద్వారా మేము మానసికంగా మరింత దగ్గరయ్యాము.

విజయ్ కలకత్తా నుంచి తిరిగి వచ్చేశాడు. నా మనసులో రవికాంత్ తిష్టవేసుకుని ఉండడం వల్ల, విజయ్ తో చనువుగా ఉండలేకపోయాను. 'ఒంట్లో బాగాలేదు' అనే సాకుతో పడకగదిలో కూడా అతనికి దూరంగానే

ఉండేదాన్ని. విజయ్ బలవంత పెట్టేవాడు కాదు. సర్దుకుపోతున్న అతన్ని చూస్తుంటే, ఎంతో సిగ్గేసేది. తప్పు చేస్తున్నానన్న భావన కలిగేది.

రోజులు గడుస్తుంటే, నాకూ రవికాంత్ కి మధ్యనున్న బంధం మరింత బలపడసాగింది. చదువు సంధ్య లేని పల్లెటూరి అమ్మాయిని చేసుకోవడం వల్ల అతనికి సంసారం పట్ల చాలా అసంతృప్తి ఉన్నట్లు గ్రహించాను. మేమిద్దరం దగ్గర కావడానికి అదో కారణం అనిపించింది నాకు. ఒకర్ని విడిచి మరొకరు ఉండలేమన్న విషయాన్ని గ్రహించాక, మేమిద్దరం ఎవరికీ తెలియకుండా చెన్నైకి చెక్కేయాలని ప్లాన్ చేసుకున్నాం.

మర్నాడే మేము చెన్నైకి బయల్దేరే రోజు. అందుకే చాలా టెన్షన్ గా ఉంది. అన్యమనస్కంగా స్నానం ముగించి రూమ్ లోకి వచ్చిన నేను గతుక్కుమన్నాను. టేబుల్ మీద 'విజయ్ కోసం ముందుగా నేను రాసి పెట్టుకున్న ఉత్తరం' కనిపించేసరికి గుండె గుభేల్ మంది. ఆ ఉత్తరంతో పాటూ, పెళ్ళికి నాకు చేయించిన నగలు, ఐదు వందల రూపాయల నోట్ల కట్టలు, అక్కడ ఎందుకున్నాయో నాకు అర్థం కాలేదు.

'మనసు చంపుకొని ఇష్టం లేని సంసారం చేయలేనని, నచ్చిన వ్యక్తితో వెళ్లిపోతున్నానని, నా కోసం వెదికే ప్రయత్నం చేయవద్దని, పెళ్ళికి చేయించిన నగలు బీరువాలోనే వదిలి వెళుతున్నానని' విజయ్ కి రాసిన ఉత్తరమది. 'అది విజయ్ కంట పడింది' అని తెలియగానే నా గుండెలు దడ దడా కొట్టుకున్నాయి. అటువైపు తిరిగి ఉన్న విజయ్ ను ఎలా ఫేస్ చెయ్యాలో తెలియక, కొట్టుమిట్టాడుతూ బొమ్మలా నిలబడిపోయాను. నేను వెళ్ళిపోయాక తెలియవలసిన విషయం ఇప్పుడే తెలిసిపోయినందుకు, నా పరిస్థితి 'కుడితిలో పడ్డ ఎలుకలా' అయిపోయింది. అతి ఇబ్బందికరమయిన నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ గొంతు విప్పాడు విజయ్, నా వైపు తిరగకుండానే. "సారీ అనుకోకుండా మీరు రాసిన ఉత్తరం, ముందుగానే నా కంట పడింది. నాతో కాపురం మీకు ఇష్టం లేదని చూచాయగా గ్రహించాను గానీ, ఇంత సాహసం చేస్తారని ఊహించలేకపోయాను. మీ నాన్నగారి ఋణం తీర్చుకుంటున్నామని అనుకున్నామే తప్ప, మీ అభిప్రాయం ముందే కనుక్కోవాలని మాకెవరికీ అనిపించలేదు. మీరు మనస్ఫూర్తిగా పెళ్ళికి అంగీకరించారని అనుకోవడం మా తప్పే. మీ దారికి అడ్డురాను. మీరు కోరుకున్న వ్యక్తితో నిరభ్యంతరంగా వెళ్లిపోవచ్చును. స్టేషన్ కో, ఎయిర్ పోర్ట్ కో నేనే డ్రాప్ చేస్తాను. నగలు మీరే ఉంచుకోండి. అవసరం పడుతుందేమోనని కొంత కేష్ కూడా అక్కడ పెట్టాను. అన్నట్లు నాదో రిక్వెస్ట్. స్నేహితురాలి పెళ్ళికి ముంబై వెళ్తున్నానని, రెండు వారాల తర్వాత తిరిగి వస్తానని, ఇంట్లో చెప్పండి. ఆ గడువులోగా ఈ కొత్త సమస్యకు పరిష్కారం వెదకడానికి నా తంటాలేవో నేను పడతాను. ఎప్పుడు బయల్దేరుతున్నారో నాకు మెసేజ్ పెట్టండి. ఈ ఉత్తరం నా దగ్గర ఉంచుతాను. ఎవరి కంటనయినా పడితే, ప్రమాదం" అంటూ నా ముఖం కూడా చూడకుండా, ఆ ఉత్తరాన్ని తీసుకుని, మౌనంగా బయటకు వెళ్ళిపోయాడు.

అతను కొత్తగా 'మీరు' అంటూ సంబోధించడం, అంత ఉదాత్తంగా ప్రవర్తించడం నన్నెంతో చకితురాలిని చేసాయి. 'అంత గొప్ప వ్యక్తితో నేను ప్రవర్తిస్తున్న తీరును ఎవరయినా హర్షిస్తారా?' అనుకుంటూ

సిగ్గుపడ్డాను. మనసంతా అపరాధభావనతో నిండిపోయింది. నాలో మానసిక సంఘర్షణ మొదలయింది. “ఇప్పుడేం చేయాలి? తెగించి వెళ్ళిపోవాలా? లేదా నా నిర్ణయం మార్చుకొని ఉండిపోవాలా? అలా చేస్తే సంతోషంగా కాపురం చేయగలమా? ఏం చేయాలి? ఏం చేయాలి?” అన్న ఆలోచనలతో నా బుర్ర వేడెక్కిపోయింది. ఆ ఆలోచనలతో రాత్రంతా నిద్రపట్టలేదు. మనసంతా డోలాయమానంగా ఊగిసలాడుతూనే ఉంది. ఎటూ తేల్చుకోలేక కొట్టు మిట్టాడాను. ఎట్టకేలకు రవికాంత్ తో వెళ్ళిపోవడానికే నిర్ణయించుకున్నాను. ఏ ఫ్లైట్ కి వెళ్తున్నామో, విజయ్ కి మెసేజ్ పెట్టి, దీర్ఘంగా నిట్టూర్చాను.

విజయ్ నన్ను ఎయిర్పోర్ట్ లో దించేసి వెళ్ళిపోయాడు. వెళ్ళేటప్పుడు కనీసం నా ముఖం కూడా చూడకపోయేసరికి, గుండెనెవరో బలంగా పిండినంత బాధ కలిగింది. మనసు దిటవు చేసుకుని రవికాంత్ కోసం చూసాను. అతను నవ్వుతూ నా చేతిలోని సూట్ కేసు అందుకున్నాడు. నా మనసులో అగ్నిపర్వతం బద్దలవుతుందని అతనికేం తెలుసు? ఫ్లైట్ ఎక్కిన తర్వాత విజయ్ కి మెసేజ్ పెట్టాను. “నా జీవితంలో మీ అంత గొప్ప వ్యక్తిని నేనెప్పుడూ చూడలేదు. నా గురించి ఆలోచించకండి. మీరు మళ్ళీ పెళ్లి చేసుకోండి. మీరు ఎల్లవేళల సుఖంగా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మళ్ళీ మీకు ఎప్పటికీ కనిపించనేమో! క్షమించమని అడిగే అర్హత కూడా లేని ...అపరాజిత”. మెసేజ్ పూర్తి చేయగానే అప్రయత్నంగా నా కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగాయి.

***

రవికాంత్ స్నేహితుడు, రాజీవ్ ప్రోజెక్ట్ పనిమీద ఫేమిలీతో జర్మనీ వెళ్ళడం వల్ల, ఖాళీ అయిన అతని ఫ్లాట్ మాకు బాగా కలిసివచ్చింది. అక్కడే ఆనందంగా సెటిల్ అయిపోయాము. సరికొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నామన్న ఉత్సాహం, ఉత్తేజం మా ఇద్దరిలోనూ ఉరకలు వేస్తుంది. ఎన్నాళ్ళకో దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, నన్ను దగ్గరకు తీసుకుని, ముద్దులతో ముంచెత్తాడు రవికాంత్. ఆ అనుభవం నాకెంతో మధురంగా తోచింది. ఇన్నాళ్ళూ విజయ్ తో సంసారం చేసానన్నమాటేగానీ ఇంతటి మాధుర్యాన్ని ఎన్నడూ అనుభవించలేదు. ‘రవికాంత్ ఈజ్ మై రైట్ మేన్’ అనుకున్నాను తృప్తిగా. అతన్ని సున్నితంగా వెనక్కు నెట్టి, కాస్త దూరంగా జరిగి “కాస్త వెయిట్ చేయండి డాక్టర్ గారు. అప్పుడే అంత తొందరా?” అన్నాను చిలిపిగా నవ్వుతూ. సమాధానంగా అతను కూడా నవ్వాడు, ఎంతో మనోహరంగా.

“తర్వాత ప్రోగ్రాం ఏమిటి?” అని అడిగాను. “ఏముంది? ఫుడ్ ఆర్డర్ చేసి తెప్పించేసుకోవడమే” అన్నాడు కాజువల్ గా. “దాని గురించి కాదు. మన ఫ్యూచర్ ప్లాన్ ఏమిటి? మీ వాళ్ళతో ఏమి చెప్పి వచ్చారు? ఇబ్బందులేమీ ఉండవు కదా?” అని ప్రశ్నించాను. “ఏ సమస్యలూ రాకపోవచ్చు. లండన్ లో కొన్ని కోర్సులు చేయాలనే ఉద్దేశ్యం ఉండడం వల్ల, నేనొక్కడినే కనీసం రెండేళ్లు లండన్ లో ఉండాల్సి వస్తుందని, నా భార్యతో రెండు మూడు సార్లు చెప్పి, తనను మానసికంగా సిద్ధం చేసాను. నాకు యుకె వీసా ఉంది. నీ వీసా కోసం మనూర్లో ఉన్నప్పటినుంచే ప్రయత్నం చేస్తున్న సంగతి నీకు తెలిసిందే కదా? తొందర్లోనే నీకు వీసా

వచ్చేస్తుంది. ఆ తర్వాత లండన్ వెళ్లిపోదాం. రెండేళ్ల వరకూ మనల్ని ఎవరూ డిస్టర్బ్ చేయరు. ఈలోగా ఏమి చెయ్యాలన్నది నిదానంగా ఆలోచిద్దాం" అంటూ వివరించేసరికి, సంతృప్తిగా తల ఊపాను. "మరి మనం పెళ్ళెప్పుడు చేసుకుందాం?" అంటూ ఉత్సాహంగా అడిగాను. అతను వెంటనే సమాధానం చెప్పలేదు. దీర్ఘాలోచనలో పడినట్లు కనిపించాడు. నాలో గాభరా మొదలయింది. మళ్ళీ అదే ప్రశ్న అడిగాను. "ఆ విషయానికే వస్తున్నాను. ....కొన్ని రోజులు ఆగుదాం" అనగానే "వాట్??" అంటూ అరిచాను. "ఆగు... ఆవేశపడకు. నేను చెప్పేది నిదానంగా విను. మనిద్దరికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. ఇద్దరం కాపురాలు వద్దనుకొని వచ్చేసాం. ముందు ముందు ఏ సమస్యలూ రాకుండా, ప్రతి అడుగు ఆచి తూచి వేయాలి. ముందుగా ఒకరినొకరు బాగా అర్థం చేసుకోవాలి. దాని కోసం నెలో, రెండు నెలలో టెస్టింగ్ టైం పెట్టుకుందాం. ఏ గొడవలూ రాకుండా ఇద్దరూ సఖ్యతగా బతకగలమో లేదో ...." అంటుండగానే అడ్డు తగిలాను. "ఒకవేళ గొడవలొస్తే....?" బలవంతంగా కోపాన్ని అణుచుకుంటూ అన్నాను. "సర్దుకోవడానికి, ఒకరినొకరు సరిగ్గా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం" అంటూ శాంతంగా సర్దిచెపుతున్నట్లు మాట్లాడాడు. అతని ఉద్దేశ్యం నాకు అర్థమయిపోయింది. " అంటే సహజీవనమా?" అంటూ కోపంగా అరిచాను. రవికాంత్ ముఖంలో రంగులు మారాయి. నా రియాక్షన్ కి, నేను నిలదీసిన పద్ధతికి బిత్తరపోయాడు. అతని మాటలు తడబడ్డాయి. "అదికాదు అపరాజితా...." అంటూ ఏదో చెప్పబోయాడు. చివాలున లేచి నిలబడ్డాను. నా కోపం కట్టలు తెంచుకుంటుంది. "నీ మనసులో ఏముందో నాకు అర్థం అయిపోయింది. నెలో రెండు నెలలో ఎంజాయ్ చేసాక, నీ దారి నువ్వు చూసుకుంటావని గ్రహించలేని వెర్రిదానిని కాదు" అంటూ కోపంతో ఊగిపోయాను. "నా ఉద్దేశ్యం అది కాదు..." అంటూ ఏదో చెప్పబోయాడు. నేనతని మాటలు వినదలుచుకోలేదు. ఆవేశంతో ఊగిపోతూ నా సూట్ కేసు అందుకున్నాను. ఎదురుచూడని సంఘటనకు అతను మాటా పలుకు లేక రాయిలా నిలుచుండిపోయాడు. అతనా షాక్ నుంచి తేరుకోకముందే నేను ముందుకు అడుగులు వేసాను. నన్ను ఆపాలని అతను చేసిన ప్రయత్నాలేవీ సాగనివ్వలేదు.

***

నా ప్రాణస్నేహితురాలు కోమలి చెన్నై లోనే ఉండడం నా అదృష్టం. జరిగినదంతా తెలుసుకున్న కోమలి, వెనక్కి వెళ్ళిపోమని, విజయ్ తప్పక స్వీకరిస్తాడని సలహా ఇచ్చింది. కానీ ఏ ముఖం పెట్టుకుని వెళ్ళను? ఏ నిర్ణయమూ తీసుకోలేక వారంరోజుల పాటూ ఏడుస్తూ కూర్చున్నాను. ఆ తర్వాత "మోసపోయాను. మీరు అంగీకరిస్తే, తిరిగి వస్తాను" అని విజయ్ కి మెసేజ్ పెట్టాను. అంతకన్నా నాకు ఏ దిక్కూ తోచలేదు. గంటలో సమాధానం వచ్చింది, "ఎప్పుడొస్తున్నారు?" అంటూ. దాంతో నా ఆనందానికి హద్దే లేకుండా పోయింది. ఆ వారం రోజులు నేను పడిన బాధంతా చేత్తో తీసి పారేసినట్లయింది. నా మనసు పురివిప్పిన నెమలిలా నాట్యం చేసింది. కోమలి ఆనందానికి అవధులు లేవు. వెంటనే ఫ్లైట్ టికెట్ బుక్ చేసి, దాని వివరాలు మెసేజ్ పెట్టాను.

“ఎయిర్ పోర్ట్ లో ఎదురుచూస్తుంటాను” అన్న మెసేజ్ రాగానే, ఆనందంతో పులకించిపోయాను. అప్పటినుంచి విజయ్ ని ఎప్పుడెప్పుడు కలుస్తానా? అనుకుంటూ తహతహలాడాను.

ఆ సమయం రానే వచ్చింది. నన్ను కలిసిన విజయ్ ముఖంలో ఏ ఫీలింగ్స్ నాకు కనబడలేదు. పలకరింపుగా చిన్నగా నవ్వాడంతే. నేను అదేమీ పట్టించుకోలేదు. అతనెప్పుడూ అంతే. అన్నీ మనసులోనే దాచుకుంటాడు. ఒక పట్టాన బయటపడడు. హుషారుగా నవ్వుకుంటూ కారెక్కాను. కారు అనకాపల్లి వైపు కాకుండా విశాఖపట్నం వైపు తిరిగేసరికి, ‘విశాఖపట్నంలో కాపురం పెట్టే ఆలోచనగానీ ఉందా!’ అనుకుంటూ ఆశపడ్డాను. ‘గ్రీన్ పార్క్ హోటల్లో చిన్న పనుంది’ అని చెప్పగానే, చిన్నబుచ్చుకున్నాను, నా ఊహ నిజం కానందుకు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంవల్ల అక్కడికి వెళ్ళేవరకూ మేమిద్దరమూ ఏమీ మాట్లాడుకోలేదు.

రెస్టారెంట్ లో కూర్చున్నాక, “ఏం తీసుకుంటారు?” అని అడిగాడు. “మునుపటిలా నువ్వు అనవచ్చు. ఈ మర్యాదలేమిటి కొత్తగా?” అంటూ చిలిపిగా నవ్వాను. అతనెందుకో ఇబ్బందిగా కదిలాడు. “చాలా లేట్ చేసేసారు” అన్నాడు పొడిగా, ఉపోద్ఘాతం ఏమీ లేకుండా. నాకేమీ అర్థం కాక అయోమయంగా చూసాను. “వివరంగా చెపుతాను” అని అతను అనగానే, కుతూహలంతో ముందుకు వంగాను. “మీరు మళ్ళీ తిరిగిరారనుకున్న నేను, నా కొలీగ్ ‘మార్గరెట్’తో పెళ్ళి నిశ్చయం చేసుకున్నాను” అంటూ బాంబ్ పేల్చాడు. ఆ మాట వినగానే భూమి బద్దలయిపోతున్నట్లు అనిపించింది. “మార్గరెట్ ని నేను ఎప్పుడో పెళ్లి చేసుకోవాల్సింది. మా పెళ్ళికి పెద్దన్నయ్య ఒప్పుకోడని, ఆయన్ని ఒప్పించడానికి సరైన అవకాశం కోసం చూస్తూ ఉండగా, నేను కాదనను అనే నమ్మకంతో మన పెళ్లి ఖాయం చేసేసాడు. మీ అంతట మీరే నన్ను వదిలి వెళ్లిపోయారని తెలిసాక, పెళ్లి చేసుకుందామని మార్గరెట్ గట్టి పట్టుపట్టింది. ఈ పరిస్థితిలో అన్నయ్య అడ్డుచెప్పడు కనుక, నేను ఒప్పుకున్నాను. ఇప్పుడు నేను వెనుకడుగు వేయలేను” అని చెపుతుంటే, నా తల మీద పిడుగులు పడుతున్నట్లు అయింది. మాటా పలుకు లేక బొమ్మలా ఉండిపోయాను. చాలాసేపు మా ఇద్దరి మధ్య నిశ్శబ్దం నడిచింది. మెల్లగా గొంతు పెగల్చుకొని “మరి నన్నెందుకు రప్పించారు ఇక్కడికి?” అని అడిగాను బేలగా. సమాధానంగా కొన్ని కాగితాలు నా ముందుకు తోసాడు. “ఏమిటవి?” నీరసంగా అడిగాను. “విడాకుల పత్రాలు. ఇంటూ మార్క్ పెట్టినచోట సంతకాలు చేయండి” అంటూ పెన్ అందించాడు. అది అభ్యర్థన లాగా లేదు. ఆర్డర్ లాగా లేదు. అయోమయంగా అతన్నే చూస్తూ కాసేపు అలాగే ఉండిపోయాను. ఆ తర్వాత.... “సంతకం పెట్టక పోతే....?” అంటూ మొండిగా అన్నాను. చిన్నగా నవ్వాడతను. “మీరు నాకు రాసిన ఉత్తరం, పంపిన మెసేజ్ లు చాలు విడాకులు శాంక్షన్ కావడానికి. కాకపోతే కాస్త టైం పడుతుందంతే” అంటూ కాగితాలు మరింత ముందుకు తోసాడు. చేసేదేమీలేక సంతకాలు పెట్టేసాను, నిర్లిప్తంగా. “థాంక్స్ ...మిమ్మల్ని ఎక్కడ డ్రాప్ చేయమంటారు?” అని అడిగాడు కాగితాలు బేగ్

లో పెట్టుకుంటూ. “రైల్వే స్టేషన్లో దింపేయండి. ముంబై వెళ్ళిపోతాను” అన్నాను ముక్తసరిగా, అగమ్యగోచరమయిన నా భవిష్యత్ ను తలుచుకుంటూ.

స్టేషన్లో కూర్చున్నాక, నేను ఎంతగా మోసపోయానో, ఎంతగా వంచించబడ్డానో తలుచుకుంటూ నాలో నేనే కుమిలిపోయాను. ‘అయితే ఎవరిని ఎవరు వంచించారు?’ అని నన్ను నేనే ప్రశ్నించుకుంటే, నాకు ఏ సమాధానమూ తట్టలేదు. ఈ పరాజితురాలికి ‘అపరాజిత’ అని పేరెందుకు పెట్టావు డాడీ? అనుకుంటూ మౌనంగా రోదించాను.

***0***

# మంటలు



## పోతుల కృపాకర్

మండుతున్న చితిమంటల్లోకి తీక్షణంగా చూస్తూ కూర్చున్నాడు సూరిబాబు. రాత్రి తొమ్మిదిగంటలప్పుడు, కటిక చీకటిలో, నాలుకలు చాచి ఎగిసిపడుతున్న ఎర్రటి మంటల భీతి గొలిపే వెలుగులో, అతని కళ్ళు రెండూ, కణకణ మండుతున్న అగ్నిగోళాల్లా ఎర్రగా మండుతున్నాయి. బయటకు కనబడడం లేదుగాని అతని గుండె కూడా, కళ్ళు రెండింటి కంటే చాలా ఎక్కువగానే మండుతోందా సమయంలో.

ఇంచుమించు ఆరునెలల నుంచీ, కడుపునిండా కూడు తినడానికి గాని, కంటినిండా కునుకు తీయడానికిగాని తీరిక లేకుండా నిర్విరామంగా శవాల్ని తగలబెడుతూనే ఉన్నాడు సూరిబాబు. యాభైఏళ్ళ జీవితంలో, ముప్పై ఐదేళ్ళు కాటికాపరిగా, ఎన్నడూ తగలబెట్టనన్ని శవాలు. 'ఈ ఐదారు నెలల్లో...నాలుగు చేతులతో' అనుకున్నాడు కాయలు కాసిపోయిన తన మోటు అరచేతులవేపు చూసుకుంటూ.

నాలుగు చేతులతో అంటే...సూరిబాబుకి, అందరిలాగా రెండు చేతులుకాక, ఇంకో రెండు చేతులు ఎక్కువ ఉన్నాయనీ, వాటితో మృతదేహాలన్నింటినీ అతనొక్కడే ఎడాపెడా దహనం చేసిపారేస్తున్నాడనీ కాదు; అతనికి ఉన్న రెండు చేతులకీ అదనంగా ఇంకో రెండు చేతులు తోడుండేవనీ, అవి రెండూ అతని భార్య రాములమ్మ చేతులనీ దాని భావం.

అయితే… ఇప్పుడా ‘ఇంకో రెండుచేతులూ’ లేవు. అవి  చల్లబడిపోయి మూడు రోజులు అయింది.  ఏట్లో కలిసిపోయి రెండంటే రెండు రాత్రులు మాత్రమే అయింది.

తలంచుకుంటే గుండె మండిపోతోంది.  మండుతున్న కళ్ళనుండి నులివెచ్చని కన్నీటిచుక్కలు జలజలా రాలిపడుతున్నాయి.  కొన్నివేలమంది రోదనల్నీ, విలాపాల్నీ ఎలాంటి భావావేశమూ లేకుండా వింటూ, కొన్ని వందల శరీరాల్ని, ఎలాంటి చలనమూ లేకుండా,  భావరహితంగా బుగ్గిచేసి పారేయగలిగిన ఒక కాటికాపరి కళ్ళనుండి నులివెచ్చని దుఃఖాశ్రువులు…నమ్మశక్యం కాకుండా… ఆశ్చర్యంగా!!!

అయితే, పాతికేళ్ళపాటూ కష్టాల్లోనూ బాధల్లోనూ తన పక్కనే, తనతోనే తోడూనీడగా ఉన్న భార్య, ఒక అర్ధరాత్రి సమయాన,  అర్ధాంతరంగా తనను ఒంటరిని చేసి వెళ్ళిపోతే, కన్నీరు కార్చకుండా ఉండడానికి సూరిబాబు, ఎంత శవాలు తగలేసి బతుకీడ్చేవాడైనా…మామూలు మనిషే. మనసున్న వాడే. ఆ మనసుకి కష్టం కలిగితే కన్నీరు పెట్టుకునే అందరిలాంటి సగటు మానవమాత్రుడే. అందుకు అతీతుడేమీ కాదు.

చేసేది కాటికాపరి వృత్తే అయినా, ఆరడుగుల ఎత్తూ, కండలు తిరిగిన దృఢమైన శరీరం, కాటుకలాంటి నల్ల…టి శరీరఛాయా, బానకడుపూ, చింతనిప్పుల్లా కణకణ మండే ఎర్ర…టి కళ్ళూ, మెలిదిరిగిన కోరమీసాలూ, ఒకచేతిలో కొండచిలువలాంటి ఆరడుగుల బాణాకర్రా, మరోచేతిలో సగానికిపైగా ఖాళీ చేసిన కల్లుకుండా… ఆ వృత్తికి  'మూసరూప'మైన భయంకరాకారం కలవాడు కాడు సూరిబాబు.

కల్లూ సారా మాట అటుంచి, కనీసం బీడీముక్కైనా ముట్టుకోని వెర్రిబాగులోడు. నోట్లో నాలుక లేని అమాయకుడు. కాటికాపరిగా జీవితం వెళ్లమార్చాల్సిన వాడు అసలు కానేకాదు. బాగా చదువుకోవాలన్న గంపెడు ఆశ, తన గుప్పెడు గుండె నిండా నింపుకొని, అందరు పిల్లల్లాగా తనుకూడా హుషారుగా  బడికి వెళ్ళినవాడే.

అయితే,  ఈ దేశంలో… అరుదుగానైనా, చెప్పులు కుట్టేవాడి కూతురు బుద్ధిగా చదువుకొని   కలక్టరమ్మ కావొచ్చు; రోడ్లు తుడుచుకునేవాడి కొడుకు కష్టపడి చదివి డాక్టరుబాబు అవ్వొచ్చు; ఇంకా మాట్లాడితే, దేశానికి ప్రధానమంత్రైనా అవ్వొచ్చు;  రాష్ట్రపతి కూడా కావచ్చు.  అందుకు అవకాశాలూ, సదుపాయాలూ కొన్నైనా ఉన్నాయి.

ఇక డబ్బూ, పలుకుబడీ, హోదా…ఇవన్నీ ఉన్నవారి పిల్లల గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరమే లేదు. ఈషణ్మాత్రం కష్టపడకుండా, ఏంకావాలనుకుంటే అది, ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు, ఎలా కావాలనుకుంటే అలా, డబ్బు పారేసి, పలుకుబడి ఉపయోగించి చాలా సులువుగా కొనేసుకోవచ్చు. దానికి అవకాశాలు కావలసిన వాటికంటే  చాలా ఎక్కువే ఉన్నాయి.

కాని…ఒక శవాలు తగలబెట్టేవాడి సంతానం మాత్రం, ఎంత కాలం గడిచినా,  ఎన్ని తరాలు మారినా, అలాగే, శవాలు తగలబెట్టేవారిగానే మిగిలిపోవాలి తప్ప,   ఇంకేమీ కాలేరు అన్నది నికార్సైన నిజం.  దానికి సూరిబాబు జీవితం సజీవసాక్ష్యం.

*****

ఎనిమిదో తరగతి వరకూ పళ్ళబిగువున, అతికష్టం మీద లాక్కొచ్చిన సూరిబాబు, ఆ తరవాత, తొమ్మిదో తరగతిలోకి వెళ్ళలేకపోయాడు...అనేకంటే, వాడిని వెళ్ళనివ్వలేదు అంటే సమంజసంగా ఉంటుందేమో.

శవాలమీద డబ్బులేరుకుని పొట్ట పోసుకునే ఒక హేయమైన కాటికాపరి కొడుకు... పట్టపగటిపూట కూడా మానవమాత్రుడెవడూ అడుగు పెట్టడానికి సాహసించని వల్లకాట్లో బతుకీడ్చేవాడు... అటువంటి తుచ్ఛమైన, భయంకరమైన నేపథ్యం నుండి వచ్చిన సూరిబాబుతో స్కూల్లో ఒక్కడంటే ఒక్క విద్యార్థి కూడా మాట్లాడేవాడుకాడు. క్లాసులో పక్కన కూర్చోవాలంటే భయంతో వణికిపోయేవారు. పుస్తకాలూ, నోట్సులూ ఇచ్చి పుచ్చుకోవడం, కలిసి ఆడుకోవడం వంటి వాటి ప్రసక్తి అసలు లేనేలేదు.

ఎదిగీ ఎదగని, మానసిక పరిణతి పెద్దగా లేని పిల్లల ప్రవర్తన అలాఉంటే, వారికి విద్య గరపి, సన్మార్గంలో నడిపించి, విశిష్టమైన వ్యక్తులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యతగల గురువుల ప్రవర్తన అంతకంటే ఘోరంగా ఉండేదంటే అబద్ధం కాదు. తెలుగు మేస్టారైతే మరీ అమానుషంగా ప్రవర్తించేవాడు. ఎప్పుడూ "ఒరేయ్ శవం" అని పిలవడమే తప్ప, ఏనాడూ మర్యాదగా సూరిబాబుని పేరుపెట్టి పిలిచిన పాపాన పోలేదా మహానుభావుడు.

"వెధవల్లారా, ఈ 'శవంగాడితో' జాగర్తరేయ్. ఎందుకో తెలుసా? సాయంత్రం పూట మీరంతా స్కూలు గ్రౌండులో ఆడుకుంటుంటే, వీడు వల్లకాట్లో దెయ్యాల్తో ఆడుకుంటాడు!!! రేప్పొద్దున్న మీరంతా ఎంచక్కా అందమైన అమ్మాయిల్ని పెళ్ళిచేసుకుంటే, ఈ 'శవం'గాడు అందమైన ఆడదెయ్యాన్ని పెళ్ళి చేసుకుంటాడు!!! అంతే కాదు. మీలో ఎవడి మీదైనా వీడికి కోపం వచ్చిందనుకోండి, కామినీ పిశాచినొకదాన్ని మీకు అంటించేసి ఊరుకుంటాడు. అది మీ రక్తం పీల్చుకు తాగేస్తాది. కదురా శవం?" వంటి క్రూరమైన జోకులేస్తూ, వాడి రక్తం పీల్చేసేవాడు.

భరించలేకపోయేవాడు సూరిబాబు. విపరీతమైన కోపం వచ్చేది. ఎవరినీ ఏమీ చెయ్యలేని చేతగాని కోపం. నిస్సహాయతతో కళ్ళమ్మట నీళ్ళు కారేవి. కుమిలి కుమిలి ఏడ్చేవాడు. అలా ఏడుస్తున్న వాడ్ని చూస్తుంటే ఇంకాస్త వేళాకోళంగా ఉండేది బడిలో అందరికీ. మరింత చెలరేగి పోయేవారు.

***

వయసు పెరిగుతున్నకొద్దీ...తను జీవిస్తున్న సమాజం, దాని నైజం ఆకళింపు చేసుకునే పరిపక్వత సమకూరుతున్నకొద్దీ... ఆత్మాభిమానం, ఆత్మగౌరవం ముళ్ళకంచెల మధ్య మొలకెత్తే విత్తనాల్లా భయంభయంగా, తటపటాయిస్తూ తలెత్తేకొద్దీ... అమానుషంగా హింసిస్తున్న వారినీ, కాకుల్లా పొడుచుకు తింటున్న వారినీ ఎలా ఎదుర్కోవాలో తెలియని నిస్సహాయత ఆవరించేకొద్దీ...నెమ్మది నెమ్మదిగా బయటి ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగతెంపులు చేసుకోవడం మొదలుబెట్టాడు, మానసికంగానూ, శారీరకంగానూ బలహీనుడైన సూరిబాబు. తనలోకి తనే ముడుచుకుపోసాగాడు. అనతికాలంలోనే,

మనిషన్న వాడితో మాట్లాడడానికి ఏమాత్రమూ అభిలషించని మౌనిగానూ, అంతర్ముఖునిగానూ మారిపోయాడు.
చిట్టచివరికి, పద్నాలుగేళ్ళు వచ్చేసరికి, బడికి వెళ్ళి చదువుకునే స్థైర్యాన్ని సంపూర్తిగా కోల్పోయి, చదువుకు మంగళం పాడేసి, తండ్రి దగ్గర 'ఎప్రెంటిస్ కాటికాపరి'గా చేరిపోయాడు. తరవాత అనతికాలం లోనే, చేపట్టిన 'కులవృత్తి'లో పరమనిష్ణాతునిగా తయారయ్యాడు.
ఈలోకంలో తనకు నూకలున్నంత వరకూ, నూకలు చెల్లిపోయిన ప్రతీ మనిషినీ పిడికెడు బుగ్గిచేసి కైలాసానికో, యమపురికో సాగనంపాల్సిన బృహత్తరమైన బాధ్యత భుజస్కంధాలపై మోస్తున్నవాడు ఆ ఊరిలో సూరిబాబు ఒక్కడే. మరొకడు లేడు. అందుకే అతడందరికీ కావలసినవాడే; అదే సమయంలో ఎవ్వరికీ అక్కరలేనివాడూ, అంటరానివాడూ కూడా. ఉదయం పూట అతని మొహం చూస్తే సర్వ మహాపాతకాలూ చుట్టుకుంటాయన్న నమ్మకంతోనూ, అతని వంటి గాలి సోకితే ఢాకినీలూ, శాకినీలూ పట్టి, పీడించి, పిప్పిచేస్తాయన్న భయంతోనూ, సూరిబాబు ఎదురైతే దూరంగా పారిపోతారు ఆ ఊరి ప్రజలు.

***

కాలుతున్న శవాల్లో, ఉన్నట్టుండి ఒకటి నీలుక్కుంటూ లేచి కూర్చోబోతుంటే, తన ఆలోచనల నుండి బయటపడ్డాడు. కూర్చున్న దగ్గరనుంచి నెమ్మదిగా లేచి వెళ్ళి, చేతిలో బాణాకర్రతో దాని తలమీదో రెండుసార్లు బలహీనంగా బాది, వెనక్కి తిరిగొచ్చి, కూర్చున్న దగ్గరే మళ్ళీ కూలబడ్డాడు. నాలుకలు చాచి, ఎగిసిపడుతున్న మంటల్లోకి చూస్తూ, తిరిగి ఆలోచనల్లోకి జారుకున్నాడు.

***

ఇంతకు ముందు రోజుల్లో అయితే, వారానికి ఒకట్రెండు రోజులే 'పని' తగిలినా, ఆ సమయంలో దొరికే డబ్బులు కడుపు నింపుకోవడానికి బాగానే సరిపోయేవి భార్యాభర్తలిద్దరికీ. ఇప్పటి రోజులు అలాకాదు. పని మాటకొస్తే... ఊపిరి తీసుకోవడానికి సమయం లేనంత ఎక్కువగా, తూర్పు తెల్లవారక ముందే మొదలై, అర్ధరాత్రైనా పూర్తికానంత భారమైన పని. కాని... పదిరూపాయల డబ్బులు దొరకడం మాత్రం సానా కష్టంగా ఉంది.
"ఉప్పుడొచ్చే సెవాలన్నీ మునిసిపాల్టీవోలు మోసుకొచ్చే రోగిస్టి సెవాలే. అలాటి సెవాలెనకాల ఒచ్చే మారాజెవడూ అవుపడ్డపేఁల నేదు. ఇంతకు మునుపైతే సెవం ఎనకాల కనీసం పాతిక ముప్పై మందైనా ఏడుత్తా ఒచ్చీవోరు. ఏడ్సీవోడేడుత్తున్నా, ఏడనోడు ఎవుడో ఒకడు పన్నైపోనాక, నాలుగు డబ్బులు, అడక్కుండానే సేతిలో ఒడిసీవోడు. ఉప్పుడో...సెవం పేపు సూడ్డానికే జనాలు బెగిలిపోతుంటే, ఆటెనకాల వొసినాల వరకూ ఎలుపొచ్చీవోడెవడూ, ఒకేలొచ్చినా, పదిరూపాయలు సేతిలో ఎట్టీ వోడెవడు" అనుకున్నాడు నిరాశగా.

"అందుకే, అందరూ అదేదో మాయరోగవొఃచ్చి సత్తంటే 'అది' మాత్రం అలిసిపోయి, ఆకలితో సచ్చిపోనాది" అనుకున్నాడు మూడురోజుల క్రితం తనను వదిలిపోయిన భార్యను తలంచుకొని బాధగా. ఆనాటి సంఘటన కళ్ళముందు మెదిలింది.

***

వచ్చిన శవాలన్నింటి దహనం పూర్తయ్యి, చితిమంటలు చల్లారడం మొదలయ్యే సరికి అర్ధరాత్రి దాటిపోయింది ఆరోజు కూడా. శ్మశానంలోనే ఒక మూలనున్న గుడిసెకు చేరుకొని, ఎప్పుడో మధ్యాహ్నం తినగా మిగిలిన అన్నం మెతుకులు, నాలుగుంటే వాటినే నోటిలో వేసుకొని, నడుం వాల్చారు ఇద్దరూ. కన్ను మూసినట్టే లేదు, కునుకు తీసినట్టేలేదు, అంతలోనే తెల్లవారిపోయింది.

మూసి ఉన్న గేటు బయట వినిపిస్తున్న కోలాహలానికి కళ్ళు తెరిచిన సూరిబాబు, రెండడుగుల దూరంలో నిద్రపోతున్న రాములమ్మను లేపడానికి ఆమె మీద చెయ్యివేసాడు. మంచుముక్కలా చల్లగా తగిలింది ఆమె శరీరం. జీవంలేని భార్య శరీరంవేపు జీవంలేని కళ్ళతో చూస్తూ, శిలాప్రతిమలా కూర్చుండిపోయాడు చాలాసేపు.

ఈరోజింత ధారాళంగా కన్నీరు వర్షిస్తున్న అతని కళ్ళనుండి, ఆరోజు ఎందుకోగాని ఒక్కటంటే ఒక్క కన్నీటిచుక్కైనా రాలలేదు. బయట కేకలూ, గోలా ఎక్కువ కావడంతో, భార్య శరీరం పైనుండి చూపులు మరల్చి, బయటకు అడుగులు వేసిన సూరిబాబుకి ఎప్పుడో అర్ధరాత్రి కావస్తున్నప్పుడు గాని, రావుఃలమ్మ శరీరాన్ని కూడా దహనం చెయ్యాలన్న సంగతే గుర్తుకు రాలేదు.

గుర్తుకొచ్చాక, భార్య శవాన్ని, కాస్త పద్ధతిగా, గౌరవంగా దహనం చేయడానికి కావలసిన కర్రలు కాసిన్నైనా దొరకలేదు. చావులు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయి, కట్టెల ధరలు చుక్కలనంటేటంత ఎత్తుకి ఎగిరిపోవడంతో, తెల్లవారాకైనా నాలుగు కట్టెలు కొని ఆ పని పూర్తిచేయగల స్తోమత కూడా లేదతనికి. ఏం చెయ్యాలో తోచలేదు. చాలాసేపు ఆలోచించిన మీదట ఒక నిర్ణయానికి వచ్చాడు.

అర్ధరాత్రి రెండుగంటల టైమప్పుడు...ఊరంతా కర్ఫ్యూలో మునగదీసుకొని పవళించిన వేళ... దెయ్యాలూ పోలీసులూ తప్ప, బయట అడుగుపెట్టడానికి మానవమాత్రుడన్నవాడెవడూ సాహసించని నడినిశీధిలో...చిరుగుల దుప్పటిలో చుట్టిన భార్య శవాన్ని భుజాన వేసుకొని... పోలీసుల కళ్లబడకుండా... దొంగలా...సందుల్లో...గొందుల్లో...నెమ్మదిగా....భారంగా...భయంభయంగా నడుచుకుంటూ...ఊరికి మైలున్నర దూరంలో నిండుగా ప్రవహిస్తున్న కన్నతల్లిలాంటి నదివేపు సాగిపోయాడు. రెండు గంటల తరవాత దుఃఖంతో వెనక్కి తిరిగొచ్చాడు భార్య కళేబరాన్ని కన్నతల్లి గర్భంలోకి జారవిడిచి... భుజాన భేతాళుడు లేని విక్రమార్కుడిలా.

***

చాలారోజులనుండీ తినడానికి సరైన తిండీ, కంటినిండా చాలినంత నిద్రా లేక నిస్సత్తువగా ఉంది సూరిబాబుకి ఆ సమయంలో. అంతే కాకుండా, ఇన్నాళ్ళూ ఆలంబనగా ఉన్న భార్య లేకపోవడంతో...ఎవరిమీదో తెలియదుగాని... పిచ్చి కోపంగా కూడా ఉంది. ఎగసి పడుతున్న చితిమంటలవేపు దృష్టి సారించాడు విసుగ్గా. ఒక్కటి తప్ప ఇంచుమించు అన్నింటి దహనం పూర్తి కావచ్చింది.

'అది కూడా బుగ్గైపోతే...' అనుకుంటూ కూర్చున్న దగ్గరనుండి లేచాడు మంటలు ఎగదొయ్యడానికి. మండుతున్న చితివేపు అడుగులు వేసాడు నీరసంగా. పక్కలకు పడిపోయిన కర్రముక్కలూ, పేళ్ళు చేత్తో తీసి, చితిలో పడేసి, చేతికర్రతో మంటని ఎగదోసే ప్రయత్నంలో ముందుకు వంగాడు. అంతే...ఒక్కసారిగా కళ్ళు బైర్లు కమ్మాయి. మైకం కమ్మేసింది , ఒళ్ళు తూలింది. శరీరంలో శక్తి లేకపోవడంతో, నిలబడలేకపోయాడు. మండుతున్న చితిలో బొక్కబోర్లా పడిపోయాడు.

***

పూర్తిగా తెల్లవారకముందే. పీపీఈ కిట్లు ధరించి, అరడజను శవాల్ని మోసుకొచ్చిన మునిసిపాలిటీ వర్కర్లు, చిన్నగా పొగలు చిమ్ముతున్న చితిలో, సగం కాలిన స్థితిలో పడి ఉన్న సూరిబాబు శవాన్ని చూసి "రేత్రి మందెక్కువైపోనాది గావోఁలు లంజికొడుక్కి. కాల్తన్న కాస్టంలో పడిపోయి సచ్చూరుకున్నాడు" అనుకున్నారు వేళాకోళంగా నవ్వుకుంటూ.

***0***

# వందే! పార్వతీపరమేశ్వరా



## ఎం ఏ పద్మనాభ రావు

ప్రియుని గాఢ చుంబన రసానుభూతి వలన ఎర్రబడ్డ ప్రియురాలి పెదవుల్లా ఉంది ఆకాశం. దూరంగా సంధ్యాకాంత సిగ్గుబడుతూ మెల్లగా నడచి వస్తోంది. చిరుచీకట్లు వెలుగురేఖలను తమలో ఐక్యం చేసుకుంటుంటే అవి సన్నగా చీలిపోయి మాయమైపోతున్నాయి. ఓ సన్నని కాంతిరేఖ సంధ్యాకాంత పాపిట సింధూరంలా మెరిసి ఆ సాయం సమయానికి వింత సొబగులను సంతరించింది. సుదూర గగనయానం చేసి అలసిన పక్షులు రెక్కలార్చుకుంటూ గూడులకు చేరుతున్నాయి. గూడు నొదలి రాలేని పిట్టలు తమ తల్లుల రాకను పసిగట్టి రాగాలు తీస్తున్నాయి. ఆ సాయంకాలం సంధ్యారాగ వర్ణాలు చూసేవారికి రమణీయ దృశ్యకావ్యంలా గోచరిస్తోంది.

నగర శివార్లలో పచ్చని ప్రకృతి మధ్యన అదొక ఆరంతస్తుల అపార్టుమెంటు. ఆ ప్రాంగణంలో ఉన్న రావి చెట్టుపై ఓ గువ్వలజంట గూడు చేరుకున్న ఆనందంతో చేస్తున్న కిచకిచలు అవి పరాచికాలాడు కుంటున్నట్టని పిస్తోంది.

ఆ అపార్టుమెంటు మూడో అంతస్తులో నివసిస్తున్న ఓ జంట అప్పుడే బాల్కానిలోకి చేరారు. తమ గూటి పక్షులు రెక్కలొచ్చి విదేశాల కెగిరిపోయాయి. రోజుకోసారి దూరశ్రవణాన్ని వినిపిస్తూంటాయి. ఆ కాసేపు వాటి కిలకిలలు అక్కడ ప్రతిధ్వనిస్తాయి. ఆ జంట తన్మయత్వంతో మురిసిపోతుంది. తర్వాత అంతా

నిశ్శబ్దమే. దైనందిక జీవనంలో ఆ ఒక్క చర్య తప్ప పెద్దగా మార్పులేని దినచర్య వారిది. అవిశ్రమంగా దొరికే విశ్రాంతి నుంచి విరామం కోరుకునే వారిద్దరికి ఈ సాయంకాలాలు ఒక వరం. అందుకే ప్రతిరోజూ ఈ సమయాన్ని అభిమానిస్తూ ఆహ్వానిస్తారు. ఏకాంతాన్ని ఆనందంగా ఆస్వాదించడానికి, కాసేపు మనసులను సాంత్వన పరుచుకోడానికి, కొన్ని ముచ్చట్లు పంచుకోడానికి అనువైన సమయంగా మలుచుకుంటారు.

ఎదురెదురు కుర్చీల్లో కూర్చుని ఎర్రబడ్డ ఆకాశాన్ని, ఆ గువ్వలజంటని చూస్తూ ఆ చల్లని సాయం సమయాన్ని ఆహ్లాదంగా అనుభవిస్తున్నారు. ఇంతలో మొబైల్ మోగింది. ఒక్కొక్కసారి కొన్ని వనరులు ప్రశాంతతను, ఏకాంతాన్ని భగ్నం చేస్తాయి. కళ్ళజోడు ఒకసారి సవరించుకుని మొబైల్ని పరికించి స్విచ్చాఫ్ చేసి నవ్వుతూ ఆయనకేసి చూసింది ఆవిడ.

"ఎవరు?" ఏకాంతానికి భంగం కలిగించినా, ఫోను చేసిందెవరో తెల్సుకోవాలన్న ఆసక్తి ఆయన గొంతులో.

"ఎవరైతే ఏంటి. ఈ సమయం పూర్తిగా మనది. మన వ్యక్తిగతం. కాసేపు అలా గతంలోకి నడచి మనలను మనం పలకరించుకునే వేళల్లో మన మధ్యలో చొరబడడానికి ఇంకొకరికి అవకాశం లేదు." మెల్లగా మృదువుగా అందావిడ. ఆ మాటలన్నప్పుడు ఆవిడ ముఖంలో తేలియాడిన నిర్ద్వందపు భావాలు.

"అవును కదూ!" కొంటెతనం తొంగి చూసిందాయన మాటలో.

"అవును. అన్నట్టు ఈరోజు ఒక విశేషం జరిగింది. పొద్దున్న అమెరికా నుంచి అమ్మాయి వీడియో కాల్ చేసినపుడు, 'అమ్మా! ఒక్కరోజు నా దగ్గర్నుంచి గాని, తమ్ముడి దగ్గర్నుంచి గాని ఫోను రాకపోతే విలవిలలాడుతావు కదా? మీ రోజుల్లో ఈ ఫోనులు, ఇంటర్నెట్లు లేవుగా, మరి నీకు నాన్నకు మధ్య ప్రేమ వాహకాలేంటి? అదే... మీరిద్దరూ అయిదేళ్ళు ప్రేమించుకుని ఆ తర్వాత పెళ్లి చేసుకున్నారు కదా? మీ మధ్య మోడ్ ఆఫ్ కమ్యూనికేషన్ ఏంటి? అని అడిగింది." సంధ్యారాగపు సిగ్గులు ఆవిడ బుగ్గల్లో.

"నువ్వేమన్నావు?"

"ఏం చెప్పాలా అని కాసేపు తటపటాయించా. అయినా నాకు దానికి మధ్య దాపరికాలెందుకనుకుని, నా బీరువాలో భద్రంగా దాచుకున్నవి తీసి దానికి చూపించాను." సిగ్గుపడుతూ ముసిముసిగా నవ్వింది.

"ఏంటవి ?" అంత భద్రంగా ఏం దాచుకుందబ్బా నాకు తెలీకుండా అన్న అనుమానంగా అడిగారు.

"మీరేం అంత అనుమాన పడిపోకండి." ఆవిడ గ్రహించింది కామోసు, " మీకు తెలీకుండా దాచుకోడానికేం ఉంటుంది నాదగ్గర? తమరి ప్రేమ పైత్యం. నా ప్రాణప్రదమైన మీ ప్రేమలేఖలు తప్ప. ఉండండి ఇప్పుడే వస్తాను." లోపలికెళ్ళి ఓ కాగితాల కట్టతో తిరిగొచ్చి కూర్చుంది.

"ఏంటీ అవన్నీ నే రాసిన ప్రేమలేఖలా?" కొంచెం గర్వం, కాస్త సంతోషం ఆయన మాటల్లో. "ఇలా ఇస్తావా వాటిని. ఒకసారి చదివి మళ్ళీ ఆ మాధుర్యపు రోజులు గుర్తు తెచ్చుకోవాలని ఉంది." జేబులు వెదుకుతూ,

“అయ్యో నా కళ్ళజోడు లేదు ఇక్కడ. పోనీ నువ్వొకటి చదివి వినిపించొచ్చు కదా నాకోసం.. ప్లీజ్?” అభ్యర్థించారు.

“అంత బ్రతిమాలక్కర్లేదు. ఒక్కటంటే ఒక్కటి చదువుతాను. మీరు కళ్ళు మూసుకుని వినండి. మీరలా నాకేసి చూస్తుంటే సిగ్గేస్తోంది.” అప్పుడు ఆమె వదనం కుంకమ శోభితమవ్వడం ఆయన గమనించక పోలేదు.

“నీ సిగ్గు చిలకలెత్తుకు పోనూ. నా హృదయం రాసిన కమ్మని ప్రేమలేఖను తీయని స్వరంతో నువ్వు చదువుతే వినాలని నేననుకుంటే... సిగ్గంటే ఎలా?”

“అయితే వినండి...!”

“ప్రియా!” అని చదువుతూంటే ఆమె గొంతు మార్దవంగా వణికింది. ఆయనకేసి సిగ్గుతో చూసి గొంతు సవరించుకుని చదవడం మొదలెట్టింది.

“నీ జ్ఞాపకాలు నా మనసును జల్లెడ పట్టోంటే, జీవితంలోని మధురానుభూతులు ఒక్కొక్కటిగా పలకరించి పోతున్నాయి. నా స్వప్నం సాకారం చెందిన వేళ, నీ సాక్షాత్కారం నా కనుల ముందర ...నయనం నయనం పలుకరించుకున్న క్షణంలో నను స్వాగతిస్తూ విచ్చుకున్న రెండు ఎర్ర గులాబీలు... ఆ గులాబీ కొసల జాలువారుతున్న చిరునవ్వులు నన్ను అచేతనావస్థలోకి నెట్టినప్పుడు.... గుండెల్లో తియ్యని బాధ. నేల జారిన ఆ నవ్వుల నేరుకుంటూ నీ విశాల నేత్రాల ముంగిటిలో నా మనసును పారేసుకున్నా. ఆ మతి తప్పిన స్థితిలో అది ప్రేమో? మరేమో? తెలియక సందిగ్దంగా నిను చూసా. అమాయకంగా పెదాలు విరిచి వలపుల విల్లును సంధించావు. నవ్వులు రువ్వి మనసుని హరించావు. పెదవులు విరచి గుండెను గాయ పరిచావు. ఏం మాయ చేసావో..?

ఎక్కడో సన్నగా అనురాగ స్వరాల జల్లులు. సౌందర్య ప్రపంచంలో స్వప్న గీతికల సౌరభాలు. “ఆకాశపు వొంపులోన ఆర్ద్ర వెనుక నీ నవ్వు, పాతాళం లోతులలో ప్రతిధ్వనించి సాగింది....” తిలక్ “అమృతం కురిసిన రాత్రి”....ఎద లోతుల్లో ధ్వనిస్తోంది! ఎంత హృద్యమైన కవిత. గుండెను తాకి మంటను రేపింది. నా గుండెలోతుల్లో నీ నవ్వు ప్రతిధ్వనిస్తూనే ఉంది. తీయని బాధను రగిలిస్తోంది. ప్రేమ ఒక తీయని బాధని అనుభవపూర్వకంగా తెలిసింది. ఆ బాధ నన్నునిలవనీయడం లేదు. నిలకడలేని, నిలబడలేని స్థితి. భూమ్యాకర్షణశక్తికే సవాలులా నీ ఆకర్షణా శక్తి. అసలు నిన్నెందుకు నాకు తారసపడేలా చేసావని ఆ భగవంతుడిని తిట్టుకున్నా. అందుకే శపించాడేమో నిన్ను తప్ప అన్నీ మర్చిపోయేలా ? మాటిమాటికి నువ్వే గుర్తుకొస్తున్నావు. నా ఆలోచనా ప్రపంచం ఒక ఆకాశం . అక్కడ మెరిసే నక్షత్రాల్లా ఆశలు. ఆశే నా శ్వాశ.... ఒక అందమైన ఆకృతికి ఎంత బలమైన ఆకర్షణా శక్తి. సుడిగాలులే లేపింది. సునామీలనే సృష్టించింది. శరదృతువు వెన్నెల్లా బాధిస్తోంది. వేరే ఆలోచన లేదు. మరే భావనా లేదు. నువ్వే...నువ్వే...! రాత్రి, పగలు, ఎండా, వాన అన్నీ నువ్వే...! నీ నవ్వులు నా అంతరాంతరాలలో

ప్రతిధ్వనిస్తూ ఉంటే, నీ కన్నుల్లో నాకై నేను వెదుక్కుంటున్నాను ఏదో ఆశతో , ఆశ పడడం, ప్రేమించడం నేరమైతే, ఆశ పడకపోవడం, ప్రేమించ బడకపోవడం శాపమే. శాపానికి శిలగా మారడం కంటే, నేరం చేసి బందీ నవుతా నీ హృదయంలో.. ప్రేమఖైదీగా... నే మిగిలిపోతా ! ప్రియ నేస్తంగా... నీలో కలసిపోతా !!"
చదవడం ముగించి తన్మయత్వంతో కళ్ళు మూసుకుంది. ఆవిడ ఎద లోతుల్లో దాగున్న యవ్వనపు శోభ బహిర్గతమై ఆవిడ మోములో కాంతులను వెదజల్లింది. కాసేపు మౌనం రాజ్యమేలింది అక్కడ. ఆయన మెల్లగా కుర్చీలోంచి లేచి ఆవిడ దగ్గర చతికల పడి మోకాళ్ళపై తల పెట్టి ముఖంలోకి చూసారు.
"ఒకసారి కళ్ళు విప్పి నన్ను చూడు ! నిన్నంతగా ప్రేమించిన నేను, అప్పుడప్పుడు నీకిష్టమైన సంగీతంలో మునిగి నన్ను పట్టించుకోలేదనే సాకుతో ద్వేషించాను. పిల్లల ధ్యాసలో పడి నా పనులు నిర్లక్ష్యం చేసావని విసుక్కున్నాను, కోప్పడ్డాను, దెబ్బలాడాను కూడా. అయినా అమ్మలా నన్నెప్పుడూ గుండెల్లో పెట్టుకున్నావు. నీకు తెల్సు, చిన్నతనంలోనే నేను అమ్మను కోల్పోయానని, తర్వాత కొంతకాలానికి నాన్నకు కూడా దూరమయ్యానని. నిజం చెప్పాలంటే నేను మా అమ్మ దగ్గరకన్నా నీ దగ్గరే ఎక్కువ పెరిగాను. అంతలా అమ్మానాన్నాను మరిపించిన నిన్ను నా ప్రవర్తనతో బాధకు గురిచేసాను కదూ! నువొక్కసారి కూడా నాకెదురు చెప్పలేదు. నాపై తిరగబడలేదు. నా మీద ప్రేమ కురిపించావు. అప్పటి నా ప్రవర్తనకు ఇప్పుడు నన్ను క్షమిస్తావు కదూ?" ఆయన గొంతులో ఉండచుట్టుకున్న అపరాధ భావన ఎక్కువగా మాట్లాడ నీయలేదు.
"రాగద్వేషాలకు, కోపతాపాలకు మనిషి అతీతుడు కాదు. నేను కూడా...! వాటిని మన చెప్పు చేతల్లో పెట్టుకున్ననాడు జీవితం స్వర్గధామ మవుతుంది. ఆ నిజాన్ని తెలుసుకుని మసలాను నేను. మీకు చెప్పేటంతటి దాన్ని కాదు గాని మన మధ్య ఉండాల్సింది ప్రేమ, నమ్మకం, అంతేకాని చింతలు, క్షమార్పణలు కాదు." చిరునవ్వుతూ సమాధానం చెప్పింది ఆవిడ.
కింద కూర్చున్న ఆయన ఆవిడ కాళ్ళను చేతులతో చుట్టేసి ఒళ్లో తల పెట్టి పడుకున్నారు. చల్లని గాలి దూరం నుంచి సంగీత తరంగాలను మోసుకొస్తోంది. ఆయన భ్రుకుటి ముడిపడింది. 'వాగార్థా వివసంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ ...' బాల సుబ్రహ్మణ్యం స్వరాభిషేకం చేస్తున్నాడు టీవీలో.
ఆ సమయంలో సంగీతం హాయిగా అనిపించిందాయనకు. 'ఆవిడ పాడుతున్నప్పుడు ఇంత హాయిని ఎప్పుడైనా అనుభవించానా?' ఆ ఆలోచనకు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. పశ్చాత్తాపం ఆయన్ని చుట్టుముట్టింది. "అప్పుడు నీ సంగీతాని ద్వేషించినా, ఇప్పుడు మాత్రం నువ్వు ఓ పాట పాడితే వినాలని ఉంది." ప్రేమగా అర్థించారు.
"నన్నూ నా సంగీతాన్ని మీరు ద్వేషించారని నేనెప్పుడూ భావించలేదు. చాటుగా నా పాటను వినేవారని నాకు తెలుసు. మీరు మనసు పడి అడిగారు. మీ కోరిక తీర్చాలిగా...!" మృదువుగా గొంతు సవరించుకుంది.

ఈ సమయమునా అడుగుతాను నిన్ను...ఓ హృదయమా వదలి వెళ్లకే నన్ను...

కలలు కనే వేళలో తెరచి ఉంచాను కనులు ,కనులు మూసుకుంటే చెదిరిపోవు కలలూ...

మార్దవంతో పాడుతున్న ఆమె గొంతులో మాధుర్యం మిళితమై ఉంది. శ్రుతిలయలులా కలసిపోయిన వారి మనసులు బాహ్యప్రపంచం దాటి కాసేపు అలౌకికానందంలో విహరించాయి. ఆ గాన మాధుర్యాని పూర్తిగా అనుభవించిన ఆయన,

"నువ్వెప్పుడూ నన్ను అది కావాలి, ఇది కావాలంటూ ఏమీ అడగలేదు. అసలు నీకేం కోరికలు లేవా? ఉంటే మరెందుకు వాటినెప్పుడు బయట పెట్టలేదు?" వరాలిచ్చే భోలాశంకరుడిలా అన్నాడు.

ఆవిడ మనసారా నవ్వింది. కుర్చీ లోంచి మెల్లగా కిందకు జారి ఆయన్ని ఆనుకుని కూర్చుంది. "కోరికలా? అవి లేని వాళ్ళుంటారా? కోరికలు కాకుల్లాంటివి. కావ్...కావ్ మంటో మన చుట్టూ చేరి చికాకు పెడతాయి. ఎంత కసురుకున్నా మనల్ని ఒదిలిపోవు. నేనడగకుండానే మంచి కుటుంబాన్ని ఇచ్చారు. మీ కష్టసుఖాల్లో పాలుపంచుకునేలా చేసారు. ఇంతకంటే ఇంకేం కావాలి? మీరు ఉమామహేశ్వరరావు. పేరుకు తగ్గట్టు మీరు అర్ధనారీశ్వరుడు. పెళ్ళికి ముందే నా పేరుని మీలో కలుపుకున్నారుగా!" ఉమ గలగలా నవ్వింది.


"మీరడిగారు కనుక నా కోరిక చెప్తాను. జీవితం చివరివరకు హాయిగా ఆనందంగా బ్రతకాలని కోరిక. ఆ తర్వాత మీ చేతుల్లో..." చప్పున ఉమ నోరు మూసేశారు ఆయన.

"ఎవరు ముందో, ఎవరు వెనుకో? ఎవరికెరుక? ఇప్పుడెందుకా మాట. " కాస్త కోపం ధ్వనించింది ఆయన గొంతులో.

"ఇప్పటివరకు యవ్వనంలోని మధురక్షణాలను తల్చుకున్నాం. కాసేపు మన వయసుని మర్చిపోయి గతంలోకి విహరించాం. పిల్లలు దూరంగా ఉన్నారనే బాధలేకుండా నాకు మీరు, మీకు నేను అంటూ జీవనం సాగిస్తున్నాం. కాని, ఈ కాలం కరిగిపోక మానదు. మన వయసులు పెరుగక మానవు. మన రూపాలు మారుతాయి, రేపన్నది ఉండక పోవచ్చు. మనలో ఎవరు ముందు, ఎవరు వెనుక అన్నది అప్రస్తుతం. ఇద్దరిలో ఎవరున్నా వారికి ఈ మధుర జ్ఞాపకాలు మాత్రం శాశ్వతం. కష్టాలు, కన్నీళ్లు, బరువులు, బాధ్యతలు పక్కకు నెట్టేసి, జీవించడంలో పొందిన ఆనందాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ ఉండాలనే కోరిక. అన్యోన్య దాంపత్యానికి ప్రతీక ఆ ఆదిదంపతులు. నేను ఉమా, మీరు మహేశ్వరుడు. మనం ఆది దంపతులమే. బ్రతికున్నన్నాళ్ళు మీరు నేను అలాగే ఉండాలనే బలమైన కోరిక." ఉమామహేశ్వరావు చేతుల్లో ఒదిగిపోయింది ఉమ. అప్పుడక్కడ అర్ధనారీశ్వర తత్వం ఆవిష్కృతమైంది.

***0***

# విలువైనది కాలమే




## జయంతి ప్రకాశ శర్మ

కారులో కూర్చుని లాప్టాప్ లో పని చేస్తున్న వేదాంతి, రింగు వినగానే, తల తిప్పి పక్కనే ఉన్న ఫోను వైపు చూసాడు. 'అమ్మ' అని కనబడింది. చిరాగ్గా ఫోనెత్తి "ఇప్పుడే కదా ఇంటినుంచి బయలుదేరాను, ఇంతలోనే కొత్త విషయాలేం వచ్చాయి.." లాప్ టాప్ మీద దృష్టి పెట్టి, ఫోన్లో అడిగాడు.

"కొత్త విషయలకేం ఖర్మ.. పాతవే నీకు పట్టవు! మేం చెప్పాలనుకున్నా, ఇంటి దగ్గర నీతో మాట్లాడడానికి ఎక్కడ వీలవుతోందీ! ఉన్నంత సేపు.. చేతిలో ఆ లాప్ టాప్, చెవుల్లో ఫోను వైర్లు ఉంటాయి. ఇక మేమెవరితో మాట్లాడాలి!"

వేదాంతికి తల్లి మాటలు రుచించలేదు. అయినా సరే తమాయించుకుని "సరే చెప్పు!" అసహనంగా అన్నాడు.

"నీ టైము వేస్టు చేయనులే.. ఒక్క నిమిషమే! వచ్చే ఆదివారం సుబ్బారావు మావయ్య కూతురు పెళ్లిరా.. మనం తప్పకుండా వెళ్ళాలి.." తల్లి మాటలు పూర్తి కాకుండానే "ఓస్.. అంతేనా! ఇంకా ఏమిటో అనుకున్నా.. ఒక్క నిమిషం లైన్లో ఉండు" అంటూ లాప్టాప్ ని బ్యాగులో సర్దుకుని, కారు దిగి ఆఫీసులోకి నడుస్తూ "మీరు ఎప్పుడు వెళ్తారో చెప్పండి, ఫ్లైట్ టిక్కెట్లు తీయిస్తాను!" అన్నాడు.

"ఫ్లైటు టిక్కెట్లు ఎక్కడికిరా.. పెళ్ళి ఈ ఊర్లోనే! ఏమిటో... చదవేస్తే ఉన్న మతి పోయింది నీకు!"

తల్లి మాటల్లో అంతరార్థం అర్ధమయి "నాకెక్కడ వీలవుతుంది! మీటింగులున్నాయి.. మీరు వెళ్లండి!" అంటూ ఫోను కట్ చేయబోయాడు.
"ఒక్క నిమిషంరా.. సొంత మేనమామ కూతురు పెళ్ళికి రానంటావేమిట్రా? అంత రాచకార్యాలు ఏ౦వున్నాయి.. !"
తల్లి మాటలు సీరియస్ గా వినబడ్డాయి వేదాంతికి.
"సరేనమ్మా.. సాయంత్రం ఇంటికొచ్చిన తర్వాత మాట్లాడుకుందాంలే! నాకిప్పుడు మీటింగు ఉంది!" అంటూ ఫోన్ కట్ చేసాడు.
కాన్ఫరెన్స్ హాల్లో మీటింగు చూసుకుని, తన ఆఫీసు రూములోకి వస్తూ ఇంటికి ఫోన్ చేసి.. "నీరజా.. మధ్యాహ్నం లంచ్ తర్వాత ఫ్లైట్ కి అర్జంటుగా ఢిల్లీ వెళ్తున్నాను. సూట్ కేసు పంపు" అంటూ, మరో మాటకు అవకాశం ఇవ్వకుండా ఫోను కట్ చేసి, ఆఫీసు పనిలో మునిగిపోయాడు.
వేదాంతి మధ్యాహ్నం వరకు పనిలో క్షణం తీరిక లేకుండా మునిగి, ఎయిర్ పోర్ట్ కు బయలుదేరాడు. అలా చివరి క్షణంలో ఫ్లైట్ అందుకోవడం అలవాటే. ఎయిర్‌పోర్ట్ లో చెక్ ఇన్ కి వెళ్తుంటే, ఉదయం అమ్మ చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది. వెంటనే మళ్ళీ నీరజకి ఫోన్ రింగు చేసి..."అన్నట్టు మర్చిపోయాను! ఆదివారం మా మావయ్య కూతురు పెళ్ళిట కదా! మీరందరు వెళ్లండి.. ఫ్లైట్ టిక్కెట్లు నువ్వే తీసుకో..."
భర్త మాటలు పూర్తిగా కాకుండానే.."అదేమిటండీ.. పెళ్ళి ఈ ఊర్లోనే.. ఉదయం అత్తయ్యగారు మీకు చెప్పారుగా!" అంది. పరధ్యానంగా మాట్లాడే భర్త మాటలకి అలవాటు పడిపోయింది నీరజ.
"ఓ.. అవును కదూ! మీటింగులో పడి మర్చిపోయాను. ఇంకా నాలుగు రోజులుందిగా, చూద్దాంలే!"
"ఏ ఫంక్షన్ కి వెళ్ళినా మీ గురించి అడుగుతారు. ఏదో చెప్తాం గాని, ఇలా కథా, కార్యక్రమం జరిగినప్పుడే కదా నలుగురిని కలవగలుస్తాం. ఉత్తప్పుడు కలుసుకునే భాగ్యం ఎలాగూ లేదు! 'ఏదోలా తీరిక చేసుకోమని' అక్కడందరు అడుగుతుంటే ఇబ్బందిగా వుందండి!" అంటూ ఆవేదనగా అంది.
"నిజమే.. కాని ఉద్యోగం అలాంటిది. నేనేం చెయ్యను! నాకు తీరిక ఉంటే వస్తానులే! సరే.. ఫ్లైట్ లోపలికి వెళ్తున్నాను, తర్వాత మాట్లాడుతాన్లే!" అంటూ ఫోన్ కట్ చేసాడు.
నీరజ ఇలాంటి సంభాషణలకి కూడా బాగా అలవాటు పడిపోయింది!

***

వేదాంతి ఓ మల్టీనేషనల్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గా పని చేస్తున్నాడు. ఐ.ఐ.టి. లో ఇంజనీరింగ్, ఐ.ఐ.యమ్. లో ఎమ్.బి.ఎ. చేసాడు. వెంటనే పెద్ద కంపెనీలో ఉద్యోగం వచ్చింది. స్వతహాగా తెలివైనవాడు కావడంతో, అతి చిన్న వయసులోనే అంచెలంచెలుగా ఆ స్థాయికి చేరాడు. కోట్ల రూపాయలలో జీతం! పెద్ద బంగళా, ఇతర సదుపాయాలు ఉన్నాయి. రోజుకి నాలుగైదు గంటలు నిద్ర తప్పితే, మిగతా సమయంలో ఉద్యోగ బాధ్యతల్లోనే మునిగి ఉంటాడు. నెలలో సగం రోజులు క్యాంపులు, మిగతా సగం రోజులు

మీటింగులంటూ, ఇంట్లో ఉండే సమయం తక్కువే! ఆ కొద్దిపాటి సమయంలో కూడా ఫోను మాట్లాడుతూనో, లేదా లాప్ టాప్ మీద పని చేస్తూనో ఉంటాడు.

"మనకు పెద్ద మొత్తాల్లో జీతం ఇస్తున్నప్పుడు, పని కూడా అంత ఎక్కువగానే ఉంటుంది. మనం కష్టపడకుండా కిందవాళ్లని పని చేయమని అడగలేం! మనం ఎలా వుంటే, మన కిందవాళ్ళు కూడా అలాగే ఉంటారు!" అంటూ, ఆఫీసు మీటింగుల్లో, వేదాంతి ఈ మాటల్ని పదేపదే చెప్తుంటాడు.

"నేను కష్టపడుతున్నది మీ అందరి కోసమే! నాకేం ఇబ్బంది లేదు. ఉద్యోగం దైవంతో సమానంగా చూసుకోవాలి. నేను చూసుకుంటున్నాను. కుటుంబానికి కావలసిన సదుపాయాలు చూడవలసిన బాధ్యత కూడా నాదే! అందుకు నేను కష్టపడాలి!" అంటూ ఇంట్లోవాళ్లతో కూడా ఎప్పుడూ అంటుంటాడు.

జీవితం, జీతం.. వీటి మీద ఎప్పుడూ వేదాంతికి ఆలోచనలు రాలేదు... రావడానికి సమయం, సందర్భం కూడా ఎదురు కాలేదు!

***

ఆ రోజు బోర్డు మీటింగు సీరియస్‌గా జరుగుతుంటే, చలం నుంచి ఫోన్ వచ్చింది. వేదాంతి ఫోను కట్ చేసి మీటింగులో మునిగిపోయాడు.

చలం.. వేదాంతి బాల్యమిత్రుడు. ఇద్దరి మధ్య మంచి స్నేహం ఉంది. అతను అదే ఊర్లో బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరి కుటుంబాల మధ్య మంచి స్నేహమే... అయితే రాకపోకలు ఒకవైపు నుంచే ఉన్నాయి. చలమే తరుచు వేదాంతి ఇంటికి వెళ్తుంటాడు. వేదాంతి హోదా, బాధ్యతలు బాగా తెలిసిన చలం, అతను ఉన్నా లేకపోయినా వాళ్లింటికి వెళ్ళి కాస్సేపు కబుర్లు చెప్పి వస్తుంటాడు.

"ఏమిటో మాయదారి ఉద్యోగం.. క్షణం తీరిక ఉండదు. ఆ ఆఫీసు వాళ్లు వీడికి జీతాలిస్తూ వాడి జీవితాన్ని తాకట్టు పెట్టేసుకున్నారు. ఓ మాటా ఉండదు, మంతీ ఉండదు! ఓ చుట్టం లేడు, ఫ్రెండు లేడు. ఎంతసేపు ఆ ఫోన్లు, ఆ యాపిలు డొక్కు! అదే వాడి ప్రపంచం.. మీ ఫ్రెండుకి సుఖం లేదోయ్ చలం!" అంటూ వేదాంతి తల్లి చలం దగ్గర తన అక్కసుని వెళ్ళగక్కుతూ ఉంటుంది.

"ఈరోజుల్లో ఉద్యోగాలు అలాగే ఉన్నాయి దొడ్డమ్మగారు! హోదా పెరిగే కొద్దీ, బాధ్యతలు ఎక్కువవుతాయి. దానికి తోడు మనవాడికి చిత్తశుద్ధి పాలెక్కువే కదా! ఆ పాలతో తోడుకున్న గడ్డపెరుగు మధ్యలో ఆనందంగానే ఉంటాడు లెండి!" అంటూ నవ్వుతూ అంటాడు.

అలాంటి సంభాషణలు అప్పుడప్పుడు వేదాంతి సమక్షంలోనూ జరుగుతుంటాయి. కాని వేదాంతి నవ్వుకుంటూ వాళ్ళ సంభాషణను ఓ చెవితో విని, ఇంకో చెవితో వదిలేస్తాడు.

మీటింగు మధ్యలో ఓ రెండు నిమిషాలు ఖాళీ దొరకడంతో, టైము చూసుకున్నాడు. ఈ మీటింగు ముగించుకుని ఢిల్లీ వెళ్లాలి. ఫ్లైట్ కి ఇంకో రెండు గంటల సమయం ఉంది. ఇంకో గంట మీటింగు నడుస్తుంది.

తర్వాత ఎయిర్‌పోర్ట్ కి అరగంట ప్రయాణం. సెల్ ఫోన్ తీసి మిస్సుడ్ కాల్స్ చూసాడు. నీరజ ఫోన్నుంచి మిస్సుడ్ కాల్స్ కూడా ఉన్నాయి. వెంటనే మెసేజులు చూసాడు.

"చలంగారికి ఉదయాన్నే యాక్సిడెంట్ అయిందిట.. చాలా సీరియస్‌గా ఉందిట. కేర్ హాస్పిటల్లో ఉన్నారు. వాళ్ళ మిసెస్ ఫోన్ చేసి చెప్పింది" నీరజ నుంచి వచ్చిన మెసేజ్ చూసి, వేదాంతి ఒక్కసారి షాక్ కు గురయ్యాడు. అప్పటికే మీటింగులో అందరు వేదాంతి వైపు చూస్తున్నారు... అయన చెప్పవలసిన విషయం కోసం! ఇబ్బందిగా కదిలి, రుమాలుతో ఓసారి మొహం తుడుచుకుని మాట్లాడ్డం మొదలెట్టాడు.

మీటింగు ముగించుకుని గబగబా ఎయిర్పోర్ట్ కు వెళ్తుంటే ఆ విషయం గుర్తొచ్చింది. వెంటనే చలం ఎడ్మిట్ చేసిన కేర్ ఆసుపత్రి చీఫ్ కి ఫోన్ చేసాడు. విషయం చెప్పి, ఎలా వుందో అడిగాడు.

'సార్.. ఐయామ్ ఆన్ రౌండ్స్ సర్.. ఐ షల్ గెట్ బ్యాక్ టు యూ' అంటూ ఫోన్ కట్ చేసాడు.

వేదాంతి విమానం ఎక్కేవరకు ఆ విషయం గుర్తుకు రాలేదు. ఫోన్లేమీ రాలేదు, మెసేజులు కూడా ఏం లేవు. సీట్లో కూర్చుంటూ, సాయంత్రం మీటింగులో మాట్లాడవలసిన విషయాలు గురించి ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఒక్క క్షణం చలం గుర్తుకు వచ్చి, 'పాపం వాడెలా వున్నాడో' అనుకున్నాడు.

చేతిలో ఉన్న బ్యాగులోంచి లాప్ టాప్, ఏవో కాగితాలు తీసి, వాటి మీద దృష్టి సారించాడు. సాయంత్రం మినిస్టర్ తో మీటింగు ఉంది. అందులో తాను ప్రెజెంట్ చేయవలసిన విషయాలు చూసుకుంటూ ఉండిపోయాడు.

ఆ సాయంత్రం మీటింగు అయేసరికి రాత్రి పది గంటలు దాటిపోయింది. తెల్లవారుజామున ఐదు గంటల ఫ్లైట్ కి తను తిరిగి వచ్చెయ్యాలి. మూడు గంటలకి అలారం కొట్టడంతో వేదాంతి లేస్తూ, మెసేజులు చూసాడు. తను ఎక్కవలసిన ఫ్లైట్ ఆరు గంటలు డిలే అంటూ ఉన్న మెసేజ్ చూసి, తిరిగి పడుకోబోతూ, చలం ఫోన్ నుంచి వచ్చిన మెసేజ్ చూసి ఒక్కసారిగా లేచి కూర్చున్నాడు! ఒక్కసారిగా శరీరం కంపించింది. "చలం ఈజ్ నో మోర్". మెదడంతా బండబారిపోయింది.

ఏం చేయాలో తోచలేదు. ఆ టైములో ఎవరికీ ఫోను చేయలేని పరిస్థితి. మిగిలిన మెసేజులన్నీ ఆఫీసుకు సంబంధించినవీ, ఇతరత్రా వ్యాపార ప్రకటనలు ఉన్నాయి.

నిద్ర తేలిపోయింది. మంచం దిగి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. 'అదేమిటి.. చలం పోవడమేమిటీ! ఈ పరిస్థితిని అతని భార్య, పిల్లలు ఎలా తట్టుకుంటారు?' ఏవేవో ఆలోచనలు సుడులు సుడులుగా తిరుగుతున్నాయి. వెంటనే వెళ్దామనుకుంటూ, ఇంకేమైనా ఫ్లైట్స్ ఉన్నాయమో సెల్‌ఫోన్ లో చూసాడు.. అన్నీ ఆలస్యంగా నడుస్తున్నట్టు చూపెడుతున్నాయి. టిక్కెట్లు కూడా లేవు.

వేదాంతికి జీవితంలో మొదటిసారి ఓ పెద్ద సమస్య ఎదురైనట్టుగా ఉంది. చలం మరణాన్ని నమ్మలేకపోతున్నాడు. పదే పదే ఆ మెసేజ్ చూస్తున్నాడు.

ఉద్యోగ నిర్వహణలో వచ్చే ఎన్నో సమస్యలను అవలీలగా పరిష్కరించే వేదాంతికి, ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తోచడం లేదు.

సోఫాలో కూర్చున్న వేదాంతి వెనక్కి వాలుతూ కళ్ళు మూసుకునేసరికి, కళ్ళల్లో నిండుకున్న కన్నీరు జారి మొహాన్ని తడిపేసాయి.

కన్నీరు వెచ్చగా ఉంటుందనే విషయం మొట్టమొదటిసారి తెలిసింది వేదాంతికి.

'మనుషులతో అనుబంధానికి ఇంత శక్తి ఉంటుందా..!' ఆలోచిస్తూ కూర్చున్న వేదాంతికి ఒక్కడూ కూర్చోవడం భయం వేసింది.

'ఒంటరితనం ఇంత భయానకమా..' అనిపించిన వేదాంతి.. గబగబా సూట్ కేసు సర్దుకుని ఎయిర్ పోర్టుకు బయలుదేరిపోయాడు.

అక్కడ జనాన్ని చూడగానే కొంత ఉపశమనం కలిగినట్టైంది. ఇంకా మూడు గంటలు టైముంది. చెక్ ఇన్ చేసి లాంజ్ లో కూర్చుని నీరజకి ఫోన్ చేసాడు.

"మేం ఇక్కడే ఉన్నాం. చలం అమ్మా, నాన్నా, వాళ్ల అన్నయ్యా వచ్చారు. పాపం వాళ్లెవరూ తట్టుకోలేక పోతున్నారు. మీరుంటే బావుండేది!"

"ఏం చేసేది.. ఎయిర్ పోర్టులోనే ఉన్నాను. నా ఫ్లైట్ చాలా లేటు. నేనొచ్చేటప్పటికి సాయంత్రం నాలుగు దాటుతుంది!"

"సరే.. ఒక్కసారి ఆవిడతో మాట్లాడండి..."

"వద్దు వద్దు.. ఏం మాట్లాడాలో తెలియటం లేదు...!"

ఫోన్ కట్ అయింది.

ఆఫీసులో పి.ఏ.కి ఫోన్ చేసి ఆరోజు తన ప్రోగ్రామ్స్ అన్నీ కాన్సిల్ చేయమని చెప్పి, ఆఫీసు ఫోన్ ఆఫ్ చేసాడు. పర్సనల్ ఫోను నుంచి తల్లికి ఫోన్ చేసాడు.

"ఏమిటోరా.. ఘోరం జరిగిపోయింది. సమయానికి నువ్వూ లేవు. పాపం ఆ తల్లితండ్రులకు పుత్రశోకం మిగిలిపోయింది. వాళ్లకేమిటి.. నాకే అలావుంది.  బాగా అలవాటైపోయి, మనింట్లో మనిషిలా ఉండేవాడు!"

వేదాంతి ఆ మాటలని  వింటూ.."మీరు ఎక్కడున్నారు..!" అంటూ అడిగాడు.

"ఎక్కడుంటాం.. అక్కడే ఉన్నాం! ఇలాంటి సమయాల్లో మనిషికి మనిషి సాయం, ఓదార్పు అవసరం నాయనా! తర్వాత మాట్లాడుతానులే.. ఆ ముసలావిడ దగ్గర కూర్చుని ఉన్నాను!" అంటూ ఫోన్ కట్ చేసింది.

వేదాంతి ఫ్లైట్ దిగి నేరుగా చలం ఇంటికే వెళ్లాడు. అక్కడ తన చిన్నప్పటి మిత్రులు, చలం బంధువులతో నిండిపోయుంది. వేదాంతిని చూడగానే అందరు పక్కకు తప్పుకుంటూ దారిచ్చారు. కాని వేదాంతికి చలం ఆఖరిచూపు దక్కలేదు. అప్పటికే అతడ్ని తీసుకువెళ్ళిపోయారు.

'వాడు మనుషుల మధ్య జీవించాడురా!'
తల్లి మాటలు జ్ఞాపకం వచ్చి ఆలోచనల్లో పడ్డాడు వేదాంతి! అక్కడో పావుగంట గడిపి వచ్చేసాడు.
ఎప్పుడూ శలవు మాట ఎరగని వేదాంతి రెండ్రోజులు ఇంటి దగ్గరే ఉండిపోయాడు. ఇంట్లో అన్యమనస్కంగా గడిపాడు. అతను ఇంట్లో అంతసేపు గడపడం పిల్లలకు కూడా కొత్తగా ఉంది. మానసికంగా బాగా కుంగిపోయినా వేదాంతికి ఆ రెండ్రోజులు ఇంట్లో గడపడం కొంత ఊరటని ఇచ్చింది. పిల్లలతో కాలక్షేపం చేస్తుంటే, కొంత మరుపు క్రమేపీ కనబడుతోంది.
రెండు రోజులు గడిచిన తర్వాత, ఆ రోజు బోర్డు మీటింగు ఉందనే విషయాన్ని పి.ఏ. ఫోన్ చేసి జ్ఞాపకం చేసాడు. మీటింగులో మాట్లాడవలసిన పేపర్లు సిద్ధం చేయమని చెప్పాడు వేదాంతి.

వేదాంతికి ఆఫీసు విషయాలమీద పూర్తిగా అవగాహన ఉంది. ఆ రోజు ఏం మాట్లాడాలో ముందుగా ప్లాన్ చేసుకున్నాడు. గంటసేపు మీటింగు జరిగిన తర్వాత.. చివర్లో "నేనో విషయం మీ ముందుంచాలి!" అంటూ వేదాంతి మాట్లాడటం మొదలెట్టాడు.
"ఫ్రెండ్స్ అతి తక్కువ స్టాఫ్ తో మనం కంపెనీని చాలా లాభాలతో నడిపిస్తున్నాం. అందరూ చాలా కష్టపడి పనిచేస్తున్నారు. చెప్పాలంటే ఒకొక్కరూ పదిమంది పని చేస్తున్నారు. ఇరవై నాలుగ్గంటల్లో నిద్రలో కూడా మనకి అఫీసు పనే కనబడుతుంది! మనకి వచ్చే జీతాలు కూడా ఏడు అంకెలు దాటే ఉన్నాయి. కంపెనీ పరంగా చాలా విషయాల్లో విజయాలు సాధించాం! ఇలా చెప్పుకుంటే.. మన కంపెనీ గురించి గొప్పగా చెప్పుకోవచ్చు! గర్వంగా ఉంటుంది కూడా! కాని ఈ మధ్య కాలంలో కొన్ని విషయాలు ఆలోచిస్తుంటే మనిషిగా మనం ఏం కోల్పోతున్నామో తలుచుకునేసరికే ఒక్కసారి భయం వేసింది! మన చేతుల నిండా డబ్బులున్నాయి.. కాని దాన్ని అనుభవించడానికి మనకి టైము లేదు! ఫ్రెండ్స్ తోనో, ఫామిలితోనో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కప్పు కాఫీ తాగడానికి సమయం మనకి చిక్కడం లేదు! వాళ్ళతో గడపలేక పోతున్నాం. ఫంక్షన్లకి వెళ్లలేకపోతున్నాం.! కనీసం కమ్మటి కాఫీని త్రాగుతూ ఆ వాసనని ఆస్వాదించలేక పోతున్నాం! హాయిగా సినిమాకు వెళ్ళి ఎన్జాయ్ చేయగలుగున్నామా... అంటే అదీ లేదు! అథవా ఏదైనా పంక్షన్ కి వెళితే, మనల్ని మన సొంత మనుషులే ఉన్నతంగా చూసి, ఎక్కువ గౌరవం ఇస్తూ, మనకి దూరంగా ఉంటారు! వెరసి.. మనం మనుషులకు, మనసులకు దూరంగా ఉన్నాం! కనీసం విషాద పరిస్థితుల్లో కూడా మనం మనవాళ్ళని కలవలేకపోతున్నాం! డబ్బు, హోదా.. ఇవేవీ మనకి కావలసిన మానవ సంబంధాలను ఇవ్వలేవని నాకిపుడిప్పుడే తెలుస్తోంది! మనం జీతాల్లో పడి జీవితం మర్చిపోయాం!"
వేదాంతి ఒక్కసారిగా ఆగి, గుక్కెడు మంచినీళ్ళు తాగాడు. ఊహించలేని విషయాలు వేదాంతి మాట్లాడుతుంటే, మిగతా డైరెక్టర్స్ అందరూ ఆతృతగా అతని వైపు చూస్తున్నారు!

"ఫ్రెండ్స్.. ఇంకో విషయం కూడా నా ఆలోచనల్లోకి వచ్చింది. మన దేశంలో పదిహేను మిలియన్ల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. చదువుకుని కూడా ఉద్యోగాలు దొరక్క, ఆత్మహత్యలు చేసుకుంటున్నారు! మరోవైపు మనలాంటివాళ్ళం పదిమంది చేసే పనిని ఒక్కరే చేస్తూ, అదో గొప్ప విషయం అనుకుంటున్నాం! ఆ శ్రమకి అవార్డులు, రివార్డులు సంపాందిస్తూ అదే జీవితం అని గర్వపడుతున్నాం! కాని కోట్ల జీతాలకి మనం మన కాలాన్ని అమ్మేస్తున్నాం! ఆ కాలం విలువ తెలిసేసరికి ముఖ్యంగా మానవ సంబంధాలని కోల్పోతున్నాం! డబ్బు పోతే, తిరిగి సంపాదించొచ్చును. అలాగే ఒకసారి కోల్పోయిన మానవ సంబంధాలను తిరిగి సంపాదించటం కూడా వీలవుతుంది, కాని కోల్పోయిన కాలాన్ని సంపాదించలేం! మనం సంఘజీవులం, మనకి మానవ సంబంధాలు ఉండాలి. అలాగే మనకంటూ సమయం కావాలి! అందుకే ఈ ప్రతిపాదనను మీ ముందు ఉంచుతున్నాను. ఆలోచించి నిర్ణయం తీసుకోండి!" అంటూ ఆగాడు. వేదాంతి చాలా రిలాక్స్ అయినట్టు కనబడ్డాడు.

"జీవించడానికి డబ్బు సంపాదించాలి గానీ, డబ్బు సంపాదన కోసం జీవించకూడదనే విషయం ఆలస్యంగా నాకు అర్ధమయింది! అందుకే మనం.. మన టైముని, జీతాన్ని పదిమందికి పంచి, మనం మన 'జీవితాన్ని' తీసుకుందాం!"

వేదాంతి మాటలు వారెవరికీ అర్ధం కానట్టు, అతని వైపు చూసారు.

"అవునవును... మీకు అర్ధమయి ఉండదు. వివరంగా చెప్తాను. మన కంపెనీలో ఉన్న ఉద్యోగుల సంఖ్య.. పై స్థాయి నుంచి కింద స్థాయి వరకు పెంచుదాం. నిబంధనలు ఏవైనా ఉంటే, వాటిని సవరించి, బంధాలను పెంచుకుందాం! మన జీతాలను కొంత మేర తగ్గించుకుని, వాటిని అదనంగా వచ్చే ఉద్యోగులకు జీతాలుగా ఇద్దాం! మనతోపాటు మరో ఇంతమందికి జీవనాధారం దొరుకుతుంది! దానికి బదులుగా మనకంటూ సమయాన్ని తీసుకుందాం! ఒక్క విషయం గుర్తుంచుకోండి.. మనం 'విలువ' తెలియకుండా డబ్బు సంపాదిస్తున్నాం. కాని, విలువైన సమయాన్ని అమ్మేస్తున్నాం! అంటే మనం డబ్బు సంపాదించి, జీవితాన్ని కోల్పోతున్నాం! అందుకే మనం జీతాన్ని తగ్గించుకుని, మనదైన సమయాన్ని పెంచుకుందాం. మనుషులతో మనసులతో మసులుదాం! నా అలోచనల్ని మీ ముందు ఉంచాను. నిర్ణయం మీదే!"

వేదాంతి మాటలు ముగింపు మాట వినగానే, ఆ సమావేశం కరతాళ ధ్వనులతో మారుమ్రోగింది.

***0***



# భయం

కొండముది హనుమంతరావు

సంక్రాంతి సెలవులయిపోయి కాలేజ్ తెఱచి పది రోజులయింది. సెలవులకు, ఇంటికి వెళ్లిన అనుపమ రాలేదు.

అందుకు కారణం ఎంత ఆలోచించినా అర్థం కాలేదు సంధ్యకు. ఒక్క సంధ్యకే కాదు, కాలేజీలో ఏ విద్యార్థికీ అర్థం కాలేదు. ఇంకోరు ఇంకోరు అయితే ఇంతగా ఆలోచించేవారు కాదు. అనుపమ కాలేజీ బ్యూటీ! అందుకే విద్యార్థులు కూడా 'వర్రీ' అవుతున్నారు.. అనుపమ రాలేదంటే! అందమే ఆనందం అన్నారు కదా మరి !

ఈ పది రోజుల్లో సంధ్య రెండుత్తరాలు వ్రాసింది. కాని అనుపమ నుంచి సమాధానం రాలేదు. ఇక ఇలాకాదనుకొని, అనుపమ రూమ్ మేట్ సంధ్య, క్లాస్ మేట్ వాసంతి ఆ ఆదివారం అనుపమ ఊరికి వెళ్లి వద్దామనుకున్నారు. ఎంత.. పది మైళ్ల దూరం! ఆర్. టి. సి. బస్సు ఉంది. ఉదయం బయల్దేరి వెళ్తే సాయంత్రానికి తిరిగి రావచ్చు. కాని ఉదయం బయల్దేరటానికి వీలుకాకపోయింది. బాటనీ, ప్రైవేటు క్లాసు ఉండడంతో, మధ్యాహ్నం రెండు గంటలకు వెళ్లామనుకున్నారు. వాసంతి వచ్చేసరికి సంధ్య మేకప్ పూర్తి కాలేదు. కట్టిన చీరె కాదని మరొక చీరె కోసం పెట్టె తీస్తున్నది.

"ఏం తల్లీ! ఇంకా చీరె సింగారం కాలేదా?"

"అయిపోయింది. ఒక్క నిమిషం."

ఒక్క నిమిషమని పది నిమిషాలకు బయల్దేరింది సంధ్య. రూమ్ తలుపు తాళం వేసి కారిడార్ లోకి వచ్చారు ఇద్ద రూ. ఇంతలోకి ఏం గుర్తుకు వచ్చిందో "జస్ట్ వన్ మినిట్ వాసంతీ!" అంటు వేసిన తాళం తీసి రూమ్ లోకి వెళ్లింది సంధ్య. ఏమి మర్చిపోయిందా అని చూస్తే.. అద్దం ముందు నిలబడి, మరొకసారి పౌడరు అద్దుకుంటున్నది, బొట్టును సరిచేసుకుంటున్నది. వాసంతి ఉద్దేశంలో సంధ్య అలంకరణ లేకపోయినా అందంగా ఉంటుంది. కాని సంధ్యకు అలంకరించుకుని మరీ అందంగా కనపడటం అంటే తగని ఇష్టం.

ఆదివారం కావటనేమో బస్సు రద్దీగా లేదు. వాళ్ళేక్కిన అయిదు నిమిషాలకు బస్ బయల్దేరింది. జనవరి నెల ఆఖరు వారం! పడమటకు వాలిన సూర్యుని కిరణాలు మలివెచ్చగా చెంపలను తాకుతున్నాయి. ఊరి బయటికి వచ్చాక పచ్చని జనపచేల మీదుగా వస్తున్న గాలి హాయిగా ఉంది. బస్ ముందుకు పోతూంటే రోడ్డు పక్కని చెట్లు వెనక్కి పరుగులు తీస్తున్నాయి.

సంధ్య మనసు గతంలోకి పరుగులు తీసింది.

***

ఫస్టియర్ బి.యస్సీ, చదువుతున్నఅనుపమ ఆ రోజు ఒక్కతే షాపింగ్ కు వెళ్ళింది. రూమ్ మేట్ రమణి కెమిస్ట్రీ రికార్డు రాయాల్సి రూమ్ లోనే ఉండి పోయింది. అనుపమ టాయిలెట్ సామాను కొనుక్కుని, పాక్ చేయించి, ఆ పాకెట్ చేత్తో పట్టుకుని షాపులో నుంచి బయటికి వచ్చేసరికి పేవ్ మెంటు మీది జాజిపూల సౌరభం ఆమె కాళ్ళకు బంధం వేసింది.

అనుపమకు జాజిపూలంటే ఎంత ఇష్టమో ! నాలుగుమూరలు కొనుక్కున్నది. పొట్లం కట్టి ఇచ్చింది పూలమ్మి. బాగ్ లో వేసుకున్నదే కాని మనసు నిలవలేదు. పొట్లం తీసి, విప్పి, ఒక్కసారి ఆ పూలను ఆఘ్రాణించి, తల్లో తురుముకున్నది.

అయితే ఆ సెంటర్లో నిలుచున్న నలుగురు యువకులు తనను గమనిస్తున్నట్టు అనుపమకు తెలియదు. అసలే అనుపమ అందాల భరిణ. మేలిమి బంగారం కూడా సిగ్గు బడే శరీరచ్ఛాయ, సంపెంగపువ్వును ఎక్కిరించే ముక్కు, గులాబీలతో పోటీపడే చెక్కిళ్ళు, మీనాక్షి అంటే సరిపోయే కనుదోయి అందాల అనుపమకు ఎర్రని ఫారిన్ నైలెక్స్ శారీ మరింత శోభను చేకూరుస్తున్నది. శారీకి మేచ్ అయేటట్టుగా ధరించిన ఎరుపురంగు జాకెట్టు మరింత సౌందర్యం సమకూరుస్తున్నది. తల్లో తెల్లని జాజిపూలు, అటు సంజవెలుగు .. ఇటు మెర్క్యురీ కాంతులూ కలిసిన మనోజ్ఞ వాతావరణం. దివి నుంచి దిగివచ్చిన దివ్యసుందరిలాగా భాసిస్తున్నది అనుపమ. ఇంత అందాలరాశి కాబట్టే క్రితం సంవత్సరం వరకు సంధ్య కిచ్చిన 'కాలేజీ బ్యూటీ' బిరుదు, ఈ సంవత్సరం అనుపమకు ఏకగ్రీవంగా ప్రధానం చేశారు.. కాలేజీ విద్యార్థులు! విద్యార్థినులూ అందుకు అభ్యంతరం చెప్పలేదు. సంధ్య కూడా స్పోర్టివ్ స్పిరిట్ తో, తన రాంక్ అనుపమకు బదలాయించింది.

ఆ కాలేజీ బ్యూటీ బజారులో ఒంటరిగా కన్పించేసరికి ఆ నలుగురు యువకులూ ఏదో చిన్నగా మాట్లాడుకున్నారు. వారి వాలకం చూస్తుంటే ఏదో పందెం కాసుకున్నట్లు కూడా ఉంది. అందులోని పొడుగుజుట్టు పోలిగాడు తలవంచి బెల్ బాటం వంక చూసుకున్నాడు. ఆ తర్వాత తల ఎగరేశాడు, కాలరు సవరించుకున్నాడు. గబగబా నడిచి అనుపమను చేరాడు.

ఇదంతా రోడ్డుకు మరొక పక్కన ఉన్న సంధ్య గమనిస్తున్నట్లు ఆ చతుష్టయానికి తెలియదు. పొ. పో. గాడి కంటే త్వరగా సంధ్య నడిచింది.. అనుపమ వైపు.

అయినావాడు అప్పటికే అనుపమ వెనుకగా నడుస్తూ ఆమె తల్లోని జాజిపూలను వాసనచూసి, ఒక్క పువ్వు తుంచాడు. బిత్తరపోయి అనుపను వెనక్కి తిరిగితే, పొ. పో. గాడు వెకిలినవ్వు నవ్వి, ఆ పువ్వు ముక్కు దగ్గర పెట్టుకున్నాడు. తను చేసిన ఈ ఘనకార్యానికి గర్వపడుతూ తన స్నేహితుల కోసం వెనక్కి తిరిగాడు. తిరిగితే.. కలకత్తా కాళీలాగ సంధ్య కనపడింది. వాడు కంగారుపడి, అడుగు వెనక్కి వేసేసరికి, సంధ్య ఎడమకాలి చెప్పు విప్పింది.

వాడు నిలువుగుడ్లు పడిపోయాయి.

చెప్పుతో సంధ్య ఎడా పెడా వాయిస్తూంటే.. వాడేమీ చేయలేకపోయాడు. ఈలోగా జనం చుట్టూ చేరారు. జనానికి జరిగింది తెలియకపోయినా ఆడపిల్లను అల్లరి పెట్టుంటే, ఆ ఆడపిల్ల ఆడపులయి ఎదురు తిరిగిందని అర్థం చేసుకుని, తలోమాటా అన్నారు వాడిని. ఆడపిల్లలు గల తండ్రులు కసితీరా తిట్టిపోశారు వాడిని. కాలేజీలో చదివే చెల్లెలుగల ఒక అన్న వాడి మీద చెయ్యి చేసుకున్నాడు. ఈలోగా సంధ్య అనుపమను చేయి పట్టుకుని, జనంలోంచి తప్పించి, ఎదురుగా కన్పడ్డ రిక్షాలో ఎక్కించి, తనూ ఎక్కి లేడీసు హాస్టలుకు పోనీయమంది,

సంధ్య చూపిన అసాధారణ ధైర్యానికి ముందు ఆశ్చర్యపోయినా, ఆ తర్వాత సెహబాష్ అన్నారు విద్యార్థినులందరూ.

సోషియాలజీ స్టూడెంట్స్ మాత్రం సంధ్యకు ఇంత ధైర్యం ఎలా వచ్చింది అని శోధించారు. నడిబజారులో ఒక యువకుడ్ని, వాడు చేసింది ఎంత తప్పుపని అయినా, చెపుచ్చుకుని కొట్టే గుండెధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది అని ఎంతగానో ఆలోచించారు. ఫామిలీ బాక్ గ్రౌండు విచారించారు. సంధ్య తండ్రి మిలటరీలో పెద్ద ఆఫీసర్, సంధ్య అన్న ఇటీవల ఐ. పి. యస్సాసయ్యాడు. రక్తంలోనే ఉంది ఆ ధైర్యం అని తేల్చేశారు. వీళ్లంతా సంధ్య గురించి ఆలోచిస్తుంటే సంధ్య అనుపమ గురించి తీవ్రంగా ఆలోచించింది.

అనుపమ అంటే సంధ్యకెంతో ఇష్టం. అనుపమ అందమంటే ఇంకా ఎంతో ఇష్టం. అనుపమ పువ్వులా సుకుమారమయింది. మకరందంలా మధురమయింది. మకరందం కోసం పువ్వు మీద తుమ్మెద వాలకూడదు. అనుపమను కంటికి రెప్పలా కాపాడాలన్న నిర్ణయానికి వచ్చింది సంధ్య.

అందుకే హాస్టల్ వార్డెన్ లో మాట్లాడి, అనుపమను తన రూమ్ కు మార్చుకుంది.

ఇప్పుడు అనుపమా, సంధ్యా రూమ్ మేట్స్.

***

అనుపమతో జరిగిన పరిచయం సంధ్య మనోవీధిలో కదలాడింది. మధ్యలో ఏదో చిన్న ఊరు. బస్సు ఆగింది. నలుగురు దిగారు. ఇద్దరు ఎక్కారు బస్సు బయల్దేరింది పక్కకి తిరిగి చూస్తే వాసంతి మరేదో లోకంలో ఉన్నది. వాసంతి ఆలోచన సంధ్య చుట్టూ.

***

సెకండియర్, థర్డ్ ఇయర్ స్టూడెంట్సుకు అక్టోబరు పరీక్షలు. ఫస్టియర్ స్టూడెంట్సుకు టెర్మినల్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. ముందు చదివినా, చదవక పోయినా రేపటి పరీక్షకు ఈరోజు రాత్రి కష్టపడి చదివితేనే ఫలితం దక్కేది. పరీక్షా విధానమే అలాగ ఉంది.

రాత్రి పది గంటలవేళ-

విద్యార్థినులందరూ సిన్సియర్ గా చదువుకుంటూ ఉండగా లైట్లు ఉన్నట్లుండి ఒక్క సారి ఆరిపోయాయి హాస్టలులో.

"అయ్యో! లైట్లు పోయాయే!" అనుకున్నారు. కొందరు. అనుకొని చీకట్లో తడుముకుంటూ, కప్ బోర్డులోని కొవ్వొత్తులు వెతికి తీసి, వెలిగించుకుని ఆ గుడ్డి వెలుతురులో చదువుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు. అందులో అనుపమ ఒకతె.

"హాయ్! భలే! లైట్లు పోయినాయ్!" అని ఒక్క నిమిషం రిలాక్స్ అయారు కొందరు. కాని మరు నిమిషంలో- మర్నాటి పరీక్ష గుర్తుకు వచ్చేమో... "అమ్మో!" అనుకుని వరండాలోకి వచ్చారు. ఆ వచ్చిన వాళ్లలో వాసంతి ఒకతె.

ఎదురుగా ఉన్న బిల్డింగులో ఉన్నాయి లైట్లు కొంచెం దూరంలో ఉన్న వార్డెన్ క్వార్టర్స్ లోనూ ఉన్నాయి లైట్లు.

ఈ బిల్డింగ్ లోనే లేవు. అర్ధగంట గడిచినా, పోయిన లైట్లు రాలేదు.

"ఎలాగ? ఎలాగ?" అనుకుంటున్నారు బి. ఎ. అమ్మాయిలు.

"ఫ్యూజు పోయి వుంటుంది!" అన్నది ఒక ఫిజిక్స్ అమ్మాయి.

"ఎలక్ట్రిసిటీ డిపారు మెంటు వాళ్లు వచ్చి పోల్ మీద ఫ్యూజు వేస్తేనే గాని లైటు వెలగవు!" ఒక బి. యస్సీ. అమ్మాయి వివరణ.

"రాత్రి ఎనిమిది దాటితే వాళ్ళు రారు!" ఒక బి. కాం. అమ్మాయి ఉవాచ.

"అయితే ఈ రాత్రంతా యింతేనా.. రేపు పరీక్షలో..." ఒక బి.ఏ. అమ్మాయి భయం.

"వార్డెన్ గారికి రిపోర్టు చేస్తే, ఆమె ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీసుకు ఫోన్ చేస్తే, వాళ్లు వస్తారేమో!" ఒక ఆమ్మాయి ఉచిత సలహా.

ఆ సలహా అందరికీ నచ్చింది. కాని ఎవ్వరూ అది ఆచరణలో పెట్టేందుకు ముందుకు రావటం లేదు.

వార్డెన్ గారి క్వార్టర్సుకు వెళ్ళటానికి వారికి భయం.

"అమ్మో! చీకటి!" అని భయపడ్డది ఒక అమ్మాయి.

"పురుగూ, పుట్రా ఉంటాయి!" మరొక పిల్ల భయం.

"వార్డెన్ మాడమ్ ఈ సమయంలో డిస్టర్బ్ చేస్తే కోప్పడతారు!" తన భయమేమిటో చెప్పింది ఒక ఆడపిల్ల,

“మీరుత్త పిరికి వాళ్లు!"
సంధ్య అక్కడ వున్నదని ఆ చీకట్లో వాళ్లకు తెలియదు.
“నేను వెళ్ళి వస్తాను ఉండండి" అని సంధ్య బయల్దేరింది.
“నా దగ్గ ఆ టార్చిలైటుంది ఇస్తాను. ఒక్క నిమిషం ఆగు సంధ్యా!” చీకటి అంటే భయపడే అమ్మాయి.
“పోనీ నేను తోడువద్దును గాని, మొన్న పగటి పూట ఒకపాము రెండు మూరలుంది. అలా జరజరా నా ముందుగా పాకిపోయింది. నన్ను పగపట్టిందేమోనని భయంగా ఉంది. ఎందుకయినా మంచిది.. కర్ర తీసుకుపో సంధ్యా !" పురుగూ పుట్రా ఉంటాయని భయపడే ఆడపిల్ల.
“వార్డెన్ మాడమ్ ఎదుటికి రాను, కావాలంటే గేటుదాకా తోడు వస్తాను!" వార్డెన్ ఎదుటబడటానికి భయపడే విద్యార్థిని.
తోడు తీసుకోలేదు. కర్ర తీసుకోలేదు. టార్చిలైటు తీసుకోలేదు. సంధ్య ఒక్కతే వార్డెన్ క్వార్టర్సుకు బయల్దేరింది.
చీకట్లో ఆకాశాన నక్షత్రాలు నల్లటి పట్టు చీరమీద కుట్టిన పువ్వుల్లో ఉన్నాయి. పువ్వుల మాదిరిగానే నక్షత్రాలలోనూ, రంగులున్నాయి కాబోలు. కొన్ని ఎర్రగా మందారాల్లా, మరికొన్ని తెల్లగా నంది. వర్ధనాల్లా, ఇంకొన్ని నీలంగా నీలాంబరాల్లా కన్నుల పండుగ చేస్తున్నాయి. ఆకాశంలో నక్షత్రాలు కాదు, గ్రహాలూ కన్పిస్తాయిట.. కాని పోల్చుకోవటం కష్టం.
ఎంకి కళ తళతళలు చీకట్లో చూడాలంటాడు నాయుడు బావ. తారల తళుకు చీకటి రాత్రిన చూస్తే ఎంత సొగసు! ఎంత సోయగం!
నక్షత్రాలను చూస్తూ నడిచిన సంధ్య చీకటి అంటే భయపడనూ లేదు, పాము ఏమిటో ఎరగనూ ఎరగదు.
వార్డెన్ క్వార్టర్సుకు వచ్చేసరికి కుక్క “భౌ ! భౌ !" అంటూ ముందుకు దూకింది.
చిన్న సైజు పులిలా ఉంది ఆ అల్సేషియన్ కుక్క. ఇంకొకరయితే ఆ కుక్క రూపం చూసి, దాని అరుపువిని వెనక్కి పరుగు తీసేవారే, కాని. సంధ్య నిర్భయంగా నిలబడ్డది. తనెందుకు భయపడాలి !
“హూ ఈజిట్” అంటూ వార్డెన్ తలుపు తీసుకుని వరండాలోకి వచ్చారు.
"నేను.. సంధ్యను మాడమ్!"
“ఏమిటి.. ఇలా రాత్రి వేళ వచ్చావ్ ?" గేటు తీశారు వార్డెన్. ఆల్సీషియన్ వచ్చి, వార్డెన్ పక్కన నిల్చుని, ఎవరీ అమ్మాయి, ఇంత నిబ్బరంగా ఉన్నది అని ఆశ్చర్యపోతున్నది.
తను వచ్చినపని చెప్పింది సంధ్య. ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీసుకు టెలిఫోన్ చేయమని రిక్వెస్ట్ చేసింది.
వార్డెన్ ఫోన్ చేస్తే అవతల వాళ్ళు ఏమన్నారో.. సూడెంట్సుకి పరీక్షలు, చదువు కోవాలి. లైట్లు లేకపోతే ఇబ్బంది అని చెప్పారు.
వాళ్ళు రావటానికి ఒప్పుకున్నారేమో-.. థాంక్స్ చెప్పి ఫోన్ పెట్టేశారామె

“నువ్వు వెళ్ళు, సంధ్యా! పది నిమిషాల్లో వచ్చి ఫ్యూజు వేస్తామన్నారు!” థాంక్స్ చెప్పి వచ్చేసింది సంధ్య.

అలా వచ్చిన సంధ్యను చుట్టు ముట్టారు విద్యార్థినులందరూ.. యుద్ధ భూమిలోకి ధైర్యంగా వెళ్ళి, సురక్షితంగా తిరిగి వచ్చిన యోధునిలా, ఆరాధనగా సంధ్యను చూశారు వారందరూ. వారి సందేహాలకు సమాధానంగా.. లైట్లు ఒక పావు గంటలో వస్తాయని చెప్పింది సంధ్య. అన్నట్లు గానే పావుగంటలో లైట్లు వెలిగాయి.

మరొకసారి రూఢి చేసుకున్నారు.. సంధ్యకు రోడ్ సైడ్ రౌడీలంటే భయం లేదు. చీకటి అంటే భయం లేదు, పురుగూ, పుట్రా అంటే భయం లేదు. వార్డెన్ అంటే భయం లేదు.

***

బస్ ఆగింది.. అమపమ వాళ్ళ ఊరు అదే.

భయమెఱుగని సంధ్య గురించి ఆలోచిస్తున్న వాసంతికి బస్ ఆగినట్లు తెలియదు. సంధ్య, భుజం తట్టి వాసంతిని ఈ లోకంలోకి తెచ్చింది. బస్ దిగిన సంధ్యనూ, వాసంతిని సెంటర్లోని మనుష్యులు ఎగా దిగా చూడసాగారు. అక్కడ చిన్న సైజు హోటలు,రెండు కిళ్లీ కొట్టు ఉన్నాయి. అంత చిన్నది కాదు, అంత పెద్దదీ కాదు ఆ ఊరు. ఊళ్ళో అనుపమ ఇల్లు వారిద్దరూ ఎఱుగరు.

“వాళ్లను అడుగుదామా?" అన్నది సంధ్య.. సెంటర్లో ఉన్న మనుషులను చూపించి,

“అమ్మో! అంతమంది మగాళ్ల మధ్యకు పోయి అడగటమే!"వాసంతి అధైర్య పడ్డది.

“నీకు ధైర్యం లేకపోతే ఇక్కడే ఉండు. నేను కనుక్కు వస్తాను!" సంధ్య వారి దగ్గరకు వెళ్లింది.

“చూడండి...” సంధ్య వారి వంక చూస్తూ సంబోధించింది.

“మీరు చూడమనక్కర్లేదు.. చూస్తూనే ఉన్నాం!" అందరిలో చిన్నగా ఉన్న కొంటివాడు అందుకున్నాడు.

“అదే నిలువు గుడ్లు పడితేనూ దృష్టి సరి చేసుకోమంటున్నా!" సంధ్య బుస్సుమంది వాడి మీదికి.

“వాడుత్త కొంటె కోణంగి. వాడితో నీకెందుకమ్మా! ఏం కావాలి?" వయసు మళ్లిన ఒకాయన సంధ్యను సౌమ్యంగా అడిగాడు.

“రామచంద్రరావుగారింటికి వెళ్లాలండి మేము, వాళమ్మాయి అనుపమ అని ఉంది. కాలేజీలో చదువుకుంటున్నది.. వాళ్ళింటికి.”

ఆయన చెప్పిన గుర్తుల ప్రకారం అనుపమ వాళ్ల ఇల్లు త్వరలోనే కనుక్కోగలిగారు.

చుట్టూ అయిదారడుగుల ఎత్తున ప్రహరీ గోడ. లోపల డాబా ఉన్నట్లుగా దాని పిట్ట గోడలు కన్పిస్తున్నాయి. పాతకాలపు పద్ధతిన పెద్ద తలుపులు, ముందు నాలుగు మెట్లు, తలుపులు తీసుకు లోపలికి పోతేకాని ఎవ్వరూ కన్పించరు. గోడమీదుగా జామచెట్టు, కరివేపాకు చెట్టు తొంగి చూస్తున్నాయి. ఉన్న నాలుగు మెట్లు ఎక్కి తలుపు దగ్గరకు వారిద్దరూ చేరేసరికి, ముందు పెరడులో ఉందేమో.. అమపమ గొంతు విన్పించింది.

“జాజిపూలు ఇలా ఇచ్చేసి, గూలాబీలు కోయవే లక్ష్మి!" చెల్లెల్ని హెచ్చరిస్తున్నది అనుపమ.
సంధ్యా, వాసంతీ ఇదరూ ఒకరి, మొహాలు ఒకరు తృప్తిగా చూసుకున్నారు. తాము పనిగట్టుకుని వచ్చినందుకు అనుపమ ఇంటి దగ్గర ఉంది. ఉత్తరం అందే ఉంటుంది. సమాధానం ఎందుకు రాయలేదో?
అనుపమను కేకవేయబోయిన వాసంతిని వారించింది సంధ్య.
“కేక వేయకు. గొంతు గుర్తు పడ్తుంది తలుపు తట్టుదాం, ఎవరా అని తలుపు తీస్తుంది. అప్పుడు ఒక్కసారి ఆది
మనిద్దర్నీ చూసి ఆశ్చర్య పోతుంది. ఆశ్చర్యంతో చారెడేసి కళ్లు చాటలంతవుతాయి. అప్పుడా కళ్లు ఎంత బాగుంటాయని, అనుకోకుండా వచ్చిన మనల్ని చూసి సంతోష పడుతుంది. ఆ సంతోషంతో అణువణువూ పులకిస్తుంది. అప్పుడు అందాల అనుపమ మరింత అందంగా ఉంటుంది. ముద్దు ముద్దుగా వుంటుంది!"
సంధ్య తన పథకం వివరించింది.
“ముద్దు పెట్టు కుంటావా?"
“ఏం పెట్టుకుంటే తప్పు? అనుపమ అంటే నాకు ప్రాణం. అనుపమ అందం అంటే ఎంతో ఇష్టం నాకు."
తలుపు తట్టింది. సంధ్య తబల మీద సన్నగా చేయి వేసినట్లు.
"ఎవరూ?" లోపలినుంచి ఆసుపమ తీయని కంఠం - వీణను చిన్నగా మీటినట్లు. ఏవరూ మాట్లాడ లేదు.
మరొకసారి తట్టింది.
"ఎవరది.. మాట్లాడరేం?" కొంచెం హెచ్చుస్థాయిలో అనుపమ. పేరు చెప్పబోయిన వాసంతి నోటికి చేయి అడ్డుపెట్టింది సంధ్య. చిలిపిగా లోలోన నవ్వుకుంటూ మరోసారి తలుపు తట్టింది సంధ్య.
"కొత్తగా వచ్చారే పోస్టు మాష్టారు. వారమ్మాయేమో అక్కా | పాపం ఆ పిల్ల మూగపిల్ల కదా మాట్లాడలేదు. తలుపు తట్టుంది గాని!" అనుపమ చెల్లెలు అక్క ముందు తన ఊహ పరుస్తున్నది.
“అదే అయి ఉండాలి. నే తీస్తాలే నువ్వా పూలు కోయటం కానీయి.”
అనువను కాలి పట్టాల సన్నని శబ్దం.. సంధ్య హృదయ శబ్దానికి లయబద్ధం.
అనుపమ తలుపు తీస్తున్న చప్పుడు.. సంధ్య హృదయ కవాటాలు సుకుమారంగా తెలుచుకుంటున్న సవ్వడి.
తలుపు తీసింది. అనుపమ.
“మీరా?" అనబోయింది. కాని నోట మాట రాలేదు.
దృశ్యం చూసి సంధ్య కెవ్వున కేక వేసింది భయపడి.
రోడ్ సైడు రౌడీలు, కారు చీకటి, పురుగూ పుట్రా, అల్సేషియన్ 'కుక్కా వార్డెన్ మాడమ్, సెంటర్లోని పదిమంది కొత్త మగవాళ్ళు.. వీటికి వేటికీ భయ పడని సంధ్య అనుపమని చూసి భయపడ్డది.
అందుకు కారణం..


కాలేజి బ్యూటీ అనుపమ అందాల మొహం, సెలవుల్లో జరిగిన ఫైర్ యాక్సిడెంటులో, వికృతంగా తయారవటమే ! కమిలిపోయిన టమాటోల్లాగా ఉన్నాయి బుగ్గలు... మాడిపోయిన జీడిగింజల్లా ఉన్నాయి కళ్ళు.. నల్లగా వేగిన కాకరకాయలా ఉంది ముక్కు. చూడలేక కళ్ళకు చేతులడ్డు పెట్టుకుంది సంధ్య.

అపురూపంగా చూసుకుంటున్న తన అందమూ, ఏదయినా కీడు జరిగితే, అంతేగా అన్న ఊహ.. సంధ్య మనసును భయ పెట్టున్నది.

అటు పక్కకి ఒరిగిపోతున్న సంధ్యను వాసంతి పొదివిపట్టుకుంది.

***0***

"ఆంధ్ర సచిత్ర వార పత్రిక : 21.07.1978 నుంచి పునర్ముద్రణ"



# మహా శివరాత్రి

## శుభాకాంక్షలు

మార్చి 2022 "ఉగాది ప్రత్యేక సంచిక" తో

02/04/2022 న పునర్దర్శనం

